శనివారం
5-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 193
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఏపీ నీటి ప్రాజెక్టులపై సుప్రీంకోర్టుకు వెళతాం

విశాలాంధ్ర-హైదరాబాద్ : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న నీటి ప్రాజెక్టులపై సుప్రీం కోర్టుకు వెళతామని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రాయలసీమ ఎత్తిపోతల, బనకచర్ల ప్రాజెక్టులతో తెలంగాణకు నష్టం వాటిల్లుతోందని

- మిగతా 2 లో

అమెరికాపై 34 శాతం చైనా సుంకాలు

బీజింగ్: అమెరికా మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధంలో తాము ఏమాత్రం వెనక్కి తగ్గేది లేదని చైనా బలమైన సంకేతాలు పంపింది. తాజాగా వాషింగ్టన్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించింది. అమెరికా నుంచి దిగుమతి అయ్యే అన్ని రకాల వస్తువులకు ఇది వర్తిస్తుందని ది స్టేట్ కౌన్సిల్ ఆఫ్ టారిఫ్ కమిషన్ వెల్లడించింది. ఏప్రిల్ 10వ తేదీన ఇది అమల్లోకి రానున్నట్లు చెప్పింది. వాషింగ్టన్ చర్యలు అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలకు విరుద్ధమని ఆరోపించింది. ఏకపక్షంగా ఆర్థిక

- మిగతా 2 లో

త్వరలో కొత్త రూ.10, రూ.500 నోట్లు

ముంబై: భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) నూతన గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో కొత్తగా రూ.10, రూ.500 నోట్లు రాను న్నాయి. మహాత్మా గాంధీ సిరీస్‌లో ఉన్న నోట్ల మాదిరిగానే కొత్త నోట్లు ఉంటాయని ఆర్‌బీఐ శుక్రవారం ప్రకటించింది. పాత రూ.10, రూ.500 నోట్లు చెల్లుతా యని పేర్కొంది. రూ.100, రూ.200 నోట్లను కూడా మల్హోత్రా సంతకంతో జారీ చేస్తున్నట్లు గతనెల ఆర్‌బీఐ వెల్లడించింది. దీర్ఘకాలంలో పాటు ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేసిన శక్తి కాంత దాస్ పదవీకాలం ముగియ డంతో ఆయన స్థానంలో గతేడాది డిసెంబర్‌లో మల్హోత్రా బాధ్యతలు స్వీకరించిన విషయం విదితమే.

నిరసన వెల్లువ

దేశ విభజనకు బీజేపీ కుట్ర

- 'వక్ఫ్' సవరణ రాజ్యాంగ విరుద్ధం
- దేశవ్యాప్తంగా ఆందోళనలు
- అహ్మదాబాద్‌లో ఆందోళనకారులపై పోలీస్ జులుం
- కోల్‌కతా, చెన్నై, బెంగళూరులో రోడ్డెక్కిన ముస్లింలు

న్యూఢిల్లీ: వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లుపై పార్లమెంటు ఆమోదముద్ర వేసిన కొన్ని గంటల వ్యవధిలోనే దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ముస్లిం సంఘాల తోపాటు ప్రతిపక్షాలు సైతం శుక్రవారం రోడ్లపైకి వచ్చి పార్లమెంటు ఉభయ సభల్లో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదించడంపై మండిపడ్డాయి. ఈ బిల్లు చట్టంగా రూపుదాల్చకుండా రాష్ట్రపతి ద్రౌపది

- మిగతా 2 లో

'వక్ఫ్'పై సుప్రీంకు కాంగ్రెస్, ఎంఐఎం

న్యూఢిల్లీ: రాజ్యాంగానికి విరుద్ధమైన వక్ఫ్(సవరణ) బిల్లు చట్టబద్ధతను సవాల్ చేస్తూ కాంగ్రెస్, ఏఐఎంఐఎం ఎంపీలు మహమ్మద్ జావేద్, అసదుద్దీన్ ఒవైసీ శు క్రవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ బిల్లులో నిబంధనలు ముస్లిం సమాజ ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేలా ఉన్నాయని వేర్వేరుగా దాఖలు చేసిన తమ పిటిషన్లలో పేర్కొన్నారు. ముస్లింల మతపరమైన స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేలా, వక్ఫ్ ఆస్తులు, వాటి నిర్వహణపై ఆంక్షలు విధించేదిగా ఈ బిల్లు ఉన్నట్లు వెల్లడించారు. న్యాయవాది అనస్ తన్వీర్ ద్వారా జావేద్ తన పిటిషన్ దాఖలు చేయగా... ఒవైసీ తరపున న్యాయవాది జాఫర్ అహ్మద్ పిటిషన్ వేశారు. మిగతా మతాలపై లేని ఆంక్షలు ముస్లింలపై ఆపాదించే ఈ బిల్లు చట్టబద్ధతను సవాల్ చేశారు. 'వక్ఫ్ ఆస్తులపై ముస్లింలు ఆంక్షలు ఎదుర్కొంటారు. కబ్జాదారుడు రాత్రికిరాత్రి యజమాని అయిపోతాడు. ముస్లింయేతరుడికి అధికారం ఇవ్వడం రాజ్యాంగంలోని అధికరణ 14కు విరుద్ధం' అని ఒవైసీ పిటిషన్ పేర్కొంది. మెజారిటీ వర్గ నిరంకుశత్వం నుంచి మైనారిటీలను

- మిగతా 2 లో

ప్రగతి నిరోధకులపై అప్రమత్తం

రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి

భూనిర్వాసితులు 112 మందికి ఉద్యోగ నియామక పత్రాలు: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రగతి నిరోధకులు చేస్తున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క యువతకు సూచించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పరిధిలోని 112 మంది భూ నిర్వాసితులకు టీఎస్ జెన్‌కో ఉద్యోగాలు కల్పించింది. నియామక పత్రాలను శుక్రవారం మాదాపూర్ సైబర్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అందజేశారు. దామచర్ల మండలం వీర్లపాలెంకు చెందిన 112 మందికి జూనియర్ అసిస్టెంట్లు, ప్లాంట్ అటెండర్లు, ఆఫీస్ సబార్డినేట్ల ఉద్యోగాలు కల్పించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ... ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలిస్తామని గత ప్రభుత్వ నేతలు చెప్పారని, నిర్వాసితులు వృద్ధులైపోయారు కానీ, ఉద్యోగాలివ్వలేదని విమర్శించారు. ఇప్పుడు అలా జరగకుండా భూమి కోల్పోయిన వారికి వెంటనే ఉపాధి

కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేని యువతకు... రాజీవ్ యువ వికాసం ద్వారా ఉపాధి కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ పథకానికి రూ.తొమ్మిది వేల కోట్లు

- మిగతా 2 లో

సమగ్ర నివేదిక ఇవ్వండి

2లో

ఉత్తమ విద్యా వ్యవస్థకు కృషి

అందుకోసం విధాన పత్రం రూపకల్పన

సీఎం రేవంత్

విశాలాంధ్ర-హైదరాబాద్ : రాష్ట్రంలో మెరుగైన విద్యా వ్యవస్థ రూపకల్పనకు సమగ్ర విధాన పత్రం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విద్యా కమిషన్‌ను ఆదేశించారు. ఉత్తమ విద్యా వ్యవస్థ ఏర్పాటుకు ఎంత వ్యయమైనా వెనుకాడమని సీఎం తెలిపారు. క్షేత్ర స్థాయి పరిస్థితులకు అద్దం పట్టేలా విధానపత్రం ఉండాలని, అదే సమయంలో అది ఆచరణకు దూరంగా ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో లోపాలు, తీసుకురావల్సిన సంస్కరణలపై ముఖ్యమంత్రి ఐసీసీసీలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యా రంగానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, ఉపాధ్యాయుల నియామకం, అమ్మ ఆదర్శ కమిటీలు, పుస్తకాలు, యూనిఫాం పంపిణీతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లు,

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీల నిర్మాణాన్ని ముఖ్యమంత్రి వివరించారు. ప్రాథమిక దశలో అందే విద్యతోనే పునాది బలపడుతుందని... ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తే ఉన్నత చదువుల్లో విద్యార్థులు మరింత మెరుగ్గా రాణించగలరని సీఎం అభిప్రాయపడ్డారు. అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాల స్థాయిలో తీసుకురావల్సిన మార్పులపై సమాజంలోని వివిధ సంఘాలు, ప్రముఖులతో చర్చించి మెరుగైన విధాన పత్రం రూపొందించాలని సీఎం సూచించారు. మనకు ఉన్న వనరులు సద్వినియోగం చేసుకోవాలని, విద్యా వ్యవస్థలో తెలంగాణ అగ్రగామిగా ఉండేందుకు దోహదపడేలా సూచనలు, సలహాలు ఉండాలని తెలిపారు. వివిధ రాష్ట్రాల్లోని పర్యటనలు, ఆయా రాష్ట్రాలు, ఇతర దేశాల్లో ప్రాథమిక విద్యలో అనుసరిస్తున్న విధానాలను విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 1960 దశకం నుంచి ప్రస్తుతం వరకు విద్యా వ్యవస్థలోని తీసుకువచ్చిన అనేక సంస్కరణలు క్రమేణా విద్యార్థుల సృజనాత్మక శక్తి, ఆలోచనా ధోరణిని ఎలా హరించి వేశాయో ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ వివరించారు. విద్యా వ్యవస్థలో మార్పులకు పరీక్షల విధానం, పాఠశాలల్లో తనిఖీలు, జీవన నైపుణ్యాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ప్రాథమిక విద్యా శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి, విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్‌రావు, చారకొండ వెంకటేష్, కె.జ్యోత్స్న శివారెడ్డి, అనేక ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంస్కరణల ముసుగులో సమానత్వం, లౌకికవాదంపై దాడి

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ చట్టాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పూర్తిగా తిరస్కరించింది. సంస్కరణల ముసుగులో లౌకికవాదం, సమానత్వంపై దాడిగా దీనిని అభివర్ణించింది. ఈ మేరకు శుక్రవారం సీపీఐ జాతీయ సమితి ఓ ప్రకటన విడుదల చేసింది. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు చట్టపరంగా కీలక రక్షణలను తొలగిస్తుంది. నియంత్రణను కేంద్రీకరించడంతో పాటు మత, ధార్మిక ప్రయోజనాలకు ఉద్దేశించిన వక్ఫ్ ఆస్తులలో ప్రభుత్వ జోక్యాన్ని అనుమతించడం ద్వారా ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తుంది. ఈ చట్టం అన్యాయమే కాకుండా రాజ్యాంగ విరుద్ధం. వక్ఫ్‌పై ఉద్దేశపూర్వక ఆంక్షలను విధించడం ద్వారా ఆర్టికల్ 14, వక్ఫ్‌ను ఎవరు సృష్టించవచ్చో నిర్ణయించేందుకు రాష్ట్రాలను

- మిగతా 2 లో

కార్మికుల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే: కూనంనేని

విశాలాంధ్ర - హైదరాబాద్: నిత్యం దోపిడీకి గురవుతున్న కార్మికవర్గం పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హిమాయత్‌నగర్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్ అధ్యక్షతన సబ్ కమిటీ సమావేశం జరిగింది. కూనంనేని మాట్లాడుతూ... కార్మికవర్గ పోరాటాల ద్వారానే సోషలిస్టు రాజ్యస్థాపన సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. దేశంలో కార్మికులశ్రమ దోచుకునే పెట్టుబడిదారి వర్గానికి

- మిగతా 2 లో

పార్లమెంట్ నిరవధిక వాయిదా

వక్ఫ్ సహా 16 బిల్లులకు ఆమోదం

న్యూఢిల్లీ: అధికార-ప్రతిపక్షసభ్యుల పోటాపోటీ నినాదాలు, విమర్శల నడుమ లోక్‌సభ, రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడ్డాయి. దీంతో జనవరి 31న ప్రారంభమైన పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. శుక్రవారం ఉదయం 11గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే సోనియాగాంధీ క్షమాపణ చెప్పాలని అధికార

- మిగతా 2 లో

ఫిరాయింపులపై మీ వైఖరేంటి?

'సుప్రీం' తప్పుపట్టినా మారని రేవంత్ తీరు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి హరీశ్‌రావు లేఖ

2లో

సీపీఐ ప్రధాన కార్యదర్శులు - 7

ఇఎంఎస్. నంబూద్రిపాద్

కమ్యూనిస్టు పార్టీ చీలక ముందు సీపీఐ ప్రధాన కార్యదర్శిగా దాదాపు రెండేళ్లు మాత్రమే ఆ బాధ్యతలు నిర్వర్తించిన వారిలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ ఒకరు. దాదాపు 11 ఏళ్ల పాటు అజయ్ ఘోష్ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆ తరవాత 1962 నుంచి 1964 దాకా అంటే కమ్యూనిస్టు పార్టీ చీలిపోయే దాకా నంబూద్రిపాద్ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

కాల్పుల విరమణకు ఒప్పుకోరేం?

- ఉద్దేశపూర్వక జాప్యానికి మీరిచ్చే సమాధనం ఏమిటి?
- రష్యాను నిలదీసిన బ్రిటన్, ఫ్రాన్స్
- అమెరికాకు వివరణ ఇవ్వాలంటూ ఒత్తిడి

లండన్: ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ కోసం చర్చలను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారంటూ బ్రిటన్, ఫ్రాన్స్ ఆరోపించాయి. అమెరికాకు తక్షణమే వివరణ ఇవ్వాలంటూ పుతిన్‌పై ఒత్తిడి తెచ్చారు. 30 రోజుల కాల్పుల విరమణ కోసం అమెరికా చేసిన ప్రతిపాదనను రష్యా తిరస్కరించింది. ఉక్రెయిన్‌తో మూడేళ్లుగా సాగుతున్న యుద్ధాన్ని ముగించే ప్రక్రియ సాగుతూ పోతుందని మాస్కో పేర్కొంది. పుతిన్ అడ్డంకులు సృష్టిస్తూ ఈ ప్రక్రియను జాప్యం చేస్తున్నారన్నది మా అభిప్రాయం అని బ్రిటన్ విదేశాంగ శాఖ కార్యదర్శి డేవిడ్ లామ్మీ వ్యాఖ్యానించారు. ఆయనతో ఫ్రాన్స్ విదేశాంగ శాఖ కార్యదర్శి జీన్ నోయల్ బారోట్ కూడా ఏకీభవించారు. ఇద్దరు నాయకులు శుక్రవారం నాటో హెడ్‌క్వార్టర్స్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ కాల్పుల విరమణకు పుతిన్ అంగీకరించాల్సిందేనన్నారు. 'ఉక్రెయిన్‌పై బాంబుల వర్షాన్ని రష్యా కొనసాగిస్తోంది. ఆ దేశ పౌరులు, వనరులను ధ్వంసం చేస్తోంది. వ్లాదిమిర్ పుతిన్ మేము మిమ్మల్ని గమనిస్తున్నాం. మీరు ఏం చేస్తున్నారో మాకు తెలుసు' అని డేవిడ్ లామ్మీ వ్యాఖ్యానించారు. మూడు వారాల కిందటే ఉక్రెయిన్ కాల్పుల విమరణకు అంగీకరించిన క్రమంలో అందుకు ఒప్పుకోకపోవడం వల్ల అమెరికాకు రష్యా సమాధానం చెప్పాలని జీన్ నోయల్ అన్నారు. ఉక్రెయిన్ సాయుధ దళాల బలోపేతానికి ఇద్దరు విదేశాంగ మంత్రులు సంకల్పించారు. పుతిన్ వెంటనే స్పందించాలి. అవుననో... కాదననో తక్షణమే సమాధానం ఇవ్వాలి. ఇలా కాలయాపన చేయడం శ్రేయస్కరం కాదు. మిలటరీ క్యాంపెయిన్‌ను ఆపే ఆలోచన కూడా రష్యాకు లేదు.

తప్పనిసరిగా ఏడాది పాటు సైన్యానికి సేవ చేయాలంటూ 18-30 ఏళ్ల మధ్య వయస్సుగల 1,60,000 మందికి పుతిన్ బలవంత చేస్తుండటం, ఇందుకోసం సోమవారం ఉత్తర్వులు జారీ కావడం విదితమే. ఇదిలావుంటే, రష్యా, ఉక్రెయన్ అధినేతలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసహనాన్ని ప్రదర్శించడం తెలిసిందే.

24 గంటల్లో 100 మందికిపైగా మృతి

- గాజాలో ఇజ్రాయిల్ భీకర దాడులు
- లెబనాన్‌లో హమాస్ కమాండర్ హతం
- సిరియాపైనా బాంబుల వర్షం

జెరూసలేం/బీరుట్/టెల్‌అవీవ్: ఇజ్రాయిల్ తన తీరు మార్చుకోవడం లేదు. ప్రపంచ దేశాలు ఆక్షేపిస్తున్న అమెరికా అండదండలతో గాజా, లెబనాన్, సిరియా దేశాలపై దాడులను విస్తృతంగా జరుపుతోంది. గాజాలో మారణహోమాన్ని కొనసాగిస్తోంది. శుక్రవారం తెల్లవారుజామున, గురువారం ఓ ఆసుపత్రి సహా అనేక చోట్ల జరిపిన భూతల, వైమానిక భీకర దాడుల్లో 100 మందికిపైగా మరణించారు. అటు దక్షిణ లెబనాన్‌లో జరిపిన దాడుల్లో హమాస్ కమాండర్ హతం కాగా సిరియాపైనా ఇజ్రాయిల్ దళాలు విరుచుకుపడుతున్నాయి. భద్రతా జోన్ విస్తరణ నెపంతో గాజాలోని షుజయా ప్రాంతంలో సైనిక చర్యలను ఇజ్రాయిల్ ముమ్మురం చేసింది. తాజా దాడుల్లో 30 మంది చనిపోగా, ఇందులో 25 మంది ఖాన్ యూనియస్‌లో ప్రాణాలు కోల్పోయారని గాజా రక్షణ సంస్థ తెలిపింది. పరిస్థితి చాలా ప్రమాదకరంగా మారిందని, ఎటు చూసినా మృత్యువు కనిపిస్తోందని తన సోదరి ఇంట్లో చిక్కుకున్న ఎలేనా హలాస్ మీడియాకు ఫోన్ ద్వారా తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులు భయానకంగా ఉన్నాయని, ఎటు నుంచి తమపై బాంబులు వచ్చి పడతాయో అంటూ భయపడుతున్నామని చెప్పారు. ప్రతి ఘడియ ఒక యుగంగా గడుస్తోందన్నారు. కాగా, ఉగ్రవాదులు, వారి స్థావరాలు, సంబంధిత మౌలిక వసతులన్నీ నాశనం చేస్తామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ ప్రకటించారు. తిరిగి దాడులు మొదలు పెట్టినప్పటి నుంచి 600 ఉగ్ర స్థావరాలను తుడిచిపెట్టామన్నారు. హమాస్ అంతమే లక్ష్యంగా గాజాలోని అన్ని ప్రాంతాల్లో తమ సైన్యం అధ్వర్యంలో ఉగ్రవాదుల ప్రక్షాళన జరుగుతోందని ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు. గాజాలోని హమాస్ కమాండ్, కంట్రోల్ సెంటన్‌ను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం వెల్లడించింది. ఇదిలాఉంటే పలస్తీనా భూభాగంలో మార్చి 18 నుంచి ఇజ్రాయిల్ దాడులు తిరిగి ప్రారంభించింది. అప్పటి నుంచి 1,163 మంది చనిపోయారు. ఈ మేరకు గాజా ఆరోగ్య శాఖ శుక్రవారం నివేదించింది. అయితే ఇజ్రాయిల్ దాడుల్లో చనిపోయిన పలస్తీనియన్ల సంఖ్య మొత్తం 50,523గా ఉన్నట్లు తెలిపింది. మృతుల్లో చిన్నారులు, మహిళలు అధికమని పేర్కొంది. తెగిపడిన తలలు, మొండాలతో అక్కడ భయానక వాతావరణం ఉన్నట్లు పలస్తీనియన్లు చెప్పారు. తమ వారి కోసం వెత్తుకుంటూ తెగిపడిన కాళ్లు, చేతులు, తలలు, మొండాన్ని ఏరుకునే పరిస్థితి ఉండటంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరోవైపు లెబనాన్, సిరియాపైనా ఇజ్రాయిల్ విరుచుకుపడుతోంది. దక్షిణ లెబనాన్‌లోని సిదాన్ ప్రాంతంలో జరిపిన దాడిలో హమాస్ కమాండర్ హసన్ ఫర్హత్‌తో పాటు అతని కుమారుడిని హతమార్చినట్లు ఇజ్రాయిల్ ప్రకటించింది. అయితే సిదాన్‌లోని అపార్టుమెంట్‌పై ఇజ్రాయిల్ దాడిలో ముగ్గురు చనిపోయారని లెబనాన్ ఆరోగ్య శాఖ వెల్లడించింది.

'వక్ఫ్'పై సుప్రీంకు కాంగ్రెస్, ఎంఐఎం

(మొదటిపేజీ తరువాయి)

కాపాడాల్సిన రాజ్యాంగ బాధ్యత న్యాయవ్యవస్థపై ఉందని, రాజ్యాంగం మైనారిటీలకు కల్పించిన హక్కులను పరిరక్షించడం కూడా న్యాయవ్యవస్థ కర్తవ్యమని పిటిషన్‌లో ఒవైసీ పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు ఏకపక్షంగా రూపొందిందని కాంగ్రెస్ ఎంపీ జావేద్ పిటిషన్ పేర్కొంది. మతాచారాల ఆధారంగా వక్ఫ్ బోర్డుల ఏర్పాటుపై ఆంక్షలు, పరిమితులు ఆమోదయోగ్యం కాదని వెల్లడించింది. రాజ్యాంగంలోని అధికరణ 25 ప్రకారం నచ్చిన మతాన్ని అనుసరించేందుకు కల్పించిన హక్కును ఈ బిల్లు హరిస్తున్నట్లు ఆరోపించింది. ఇస్లాం మతాన్ని స్వీకరించి, దాతలైన వారిపై వివక్షపూరిత ఆంక్షలు విధించడం రాజ్యాంగంలోని అధికరణ 15కు విరుద్ధమని పేర్కొంది. వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ లో ముస్లింయేతరులను సభ్యులుగా చేర్చడం అనవసర ప్రయాస అని దుయ్యబట్టింది. హిందువుల బోర్డుల విషయంలో ఇలాంటి పద్ధతి లేదని గుర్తుచేసింది. ఇతర మతాల సంస్థలు, వ్యవస్థలకు లేని నిబంధనలు కేవలం వక్ఫ్‌లపైనే ఆపాదించడం, ఆంక్షలు విధించడం, రాజ్యాంగంలోని అధికరణలు 14, 15కు విరుద్ధమని స్పష్టంచేసింది. వక్ఫ్ ట్రిబ్యునళ్ల అధికారాలనూ ఈ బిల్లు హరిస్తోందని పేర్కొంది. వివాదాలు పరిష్కరించే పద్ధతులనూ మార్చివేస్తోందని, ఇస్లామిక్ చట్టం ప్రకారం తీసుకునే చర్యలను నియంత్రిస్తున్నదని వెల్లడించింది. వక్ఫ్ ఆస్తులపై పాలకుల నియంత్రణ పెరిగితే... మత అవసరాల కోసం ఆస్తులు ఇచ్చే దాతలు పరిమితం అయిపోతారని తెలిపింది. 1954లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు పూర్తి విరుద్ధంగా కొత్త బిల్లు ఉందని గుర్తుచేసింది. 'వక్ఫ్-బై-యూజర్' భావనకే ఇది తూట్లు పొడుస్తోందని దుయ్యబట్టింది. వక్ఫ్ బై యూజర్ సూత్రాన్ని అయోధ్య తీర్పులో సుప్రీంకోర్టు ప్రస్తావించడాన్ని కాంగ్రెస్ ఎంపీ జావేద్ పిటిషన్ గుర్తుచేసింది.

యూన్ తొలగింపు

- ద.కొరియా అధ్యక్షుడి కేసులో రాజ్యాంగ కోర్టు తీర్పు
- ఆపద్ధర్మ అధ్యక్షుడిగా ప్రధాని హాన్
- జూన్‌లో నూతన అధ్యక్షుడి ఎన్నిక

సియోల్: దక్షిణ కొరియా అధ్యక్షుడిగా యూన్ సుక్ యోల్‌ను తొలగిస్తూ రాజ్యాంగ కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఎనిమిది మందిలో కూడిన విస్తృత ధర్మాసనంలో ఆరుగురి మధ్య ఏకాభిప్రాయంతో ఈ తీర్పు వెలువడింది. సైనిక పాలన విధించడం ద్వారా యూన్ చిక్కుల్లో పడ్డారు. అభిశంసనను ఎదుర్కొన్నారు. అధికారానికి దూరమయ్యారు. దశాబ్దాల్లో లేని రాజకీయ సంక్షోభాన్ని సృష్టించారు. యూన్‌ను అధ్యక్ష పగ్గాల నుంచి పూర్తి స్థాయిలో తప్పిస్తూ తాత్కాలిక సీజే మూన్ హ్యూంగ్ బే ఆదేశాలిచ్చారు. 'డిసెంబరు 3న మార్షల్ లా అమలు ద్వారా అధ్యక్షుడిగా తన బాధ్యతలను యూన్ అతిక్రమించారు. రాజ్యాంగం కల్పించిన అధికార పరిధికి మించి ప్రవర్తిస్తూ ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లజేశారు. ప్రజలను మోసం చేశారు. వారి నమ్మకాన్ని వమ్ము చేశారు. మార్షల్ లా అమలుతో దేశంలో గందరగోళ పరిస్థితులకు తెరతీశారు. ఆర్థిక వ్యవస్థ, విదేశాంగ విధానానికి విఘాతం కలిగించారు' అని అన్నారు. కాగా, కోర్టు తాజా తీర్పు మానవ హక్కుల సంస్థ స్వాగతించింది. ఇది ప్రజల విజయమంటూ అభివర్ణించింది. మరోవైపు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పారని యూన్ తరపు న్యాయవాదులు ఓ సందేశాన్ని విడుదల చేశారు. 'నన్ను క్షమించండి. మీ ఆకాంక్షలకు తగ్గట్టు ఉండలేకపోయా. అందుకు చింతిస్తున్నా' అని ఆ సందేశంలో యూన్ పేర్కొన్నారు. తాజా పరిణామాలతో దక్షిణ కొరియాలో ఎన్నికలకు రంగం సిద్ధమైంది. 60 రోజుల్లోగా కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాలి. అప్పటి వరకు ఆపద్ధర్మ అధ్యక్షుడిగా ప్రధాని హాన్ డక్ సూ బాధ్యతలు చేపడతారు. అధ్యక్షుడిగా ఎన్నికయ్యేందుకు లిబరల్ డెమొక్రటిక్ పార్టీ నాయకుడు లీ జే మ్యుంగ్‌కు అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆయన 2022 ఎన్నికలలో చాలా తక్కువ ఓట్లతో ఓడిపోయారు. అటు కన్జర్వేటివ్‌లు కూడా తమ అభ్యర్థులతో సిద్ధంగా ఉన్నారు. జూన్ మొదటివారంలో ఎన్నికలు నిర్వహించే యోచనలో దక్షిణ కొరియా ఎన్నికల సంఘం ఉన్నది. ఆపద్ధర్మ అధ్యక్షుడు హాన్‌తో చర్చించి, పోలింగ్ తేదీని ఖరారు చేయనుంది. ఓటింగ్‌కు జూన్ 3 సబబుగా ఉంటుందని అభిప్రాయపడింది. అభ్యర్థులు తమ నామినేషన్లు శుక్రవారం నుంచే సమర్పించవచ్చని పేర్కొంది.

యూన్ అనుకూల-వ్యతిరేక ర్యాలీలు

కోర్టు తాజా తీర్పు క్రమంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. యూన్ మద్దతుదారులు వేలాది మంది సియోల్ వీధుల్లోకి వచ్చి కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. దీంతో వందల మంది పోలీసులును ప్రభుత్వం మోహరించింది. భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసింది. అవాంఛిత ఘటనలు, ఘర్షణలకు తావు లేకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. మరోవైపు యూన్‌కు వ్యతిరేక వర్గం ఈ తీర్పును స్వాగతిస్తూ వేడుక చేసుకుంది. బ్యానర్లు ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టింది. విపక్ష నేత లీ జే మ్యుంగ్‌కు మద్దతు ప్రకటించింది.

పార్లమెంట్ నిరవధిక వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ భేటీలో ప్రసంగించిన సోనియా... వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగంపై దాడిగా పేర్కొన్నారు. సమాజాన్ని శాశ్వతంగా విభజించాలనే వ్యూహంతో బీజేపీ పనిచేస్తోందని దుయ్యబట్టారు. దీనిపై అధికారపక్ష సభ్యులు ఆందోళనకు దిగగా...పోటీగా ప్రతిపక్షాలు నిరసనకు దిగాయి. అమెరికా ప్రతీకార సుంకాలపై చర్చ జరపాలని డిమాండ్ చేశాయి. స్పీకర్ ఓంబిర్లా ప్రశ్నోత్తరాలు కొనసాగించేందుకు ప్రయత్నించటంతో ప్రతిపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. ఇరుపక్షాల పోటాపోటీ ఆందోళనలు, నినాదాలతో లోక్‌సభలో గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో వాయిదాపడిన లోక్‌సభ, తిరిగి 12గంటలకు సమావేశం కాగానే స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేసినట్లు ప్రకటించారు. బడ్జెట్ సమావేశాల ముగింపు ప్రసంగాన్ని చదివి వినిపించారు. ఈ సమావేశాల్లో సభ ఉత్పాదకత 118 శాతం కంటే ఎక్కువ ఉందన్నారు. స్పీకర్ ప్రసంగ సమయంలోనూ ప్రతిపక్షనేతలు ఆందోళన కొనసాగించారు. ప్రతిపక్షనేత రాహుల్ గాంధీని సభలో మాట్లాడనివ్వకుండా వివక్షచూపించారంటూ నినాదాలు చేశారు. ఎలాంటి చర్చ చేపట్టకుండానే బలవంతంగా వక్ఫ్ బిల్లుకు ఆమోదం తెలిపారని విమర్శించారు. వివిధ శాఖలకు సంబంధించిన గ్రాంట్లు, ఆర్థిక బిల్లుకు కూడా లోక్‌సభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో బడ్జెట్ ప్రక్రియ ముగినట్లు సభాపతి ప్రకటించారు. మరోవైపు రాష్ట్రపతి పాలనలో ఉన్న మణిపూర్ రాష్ట్రానికి సంబంధించిన బడ్జెట్ కూడా క్లియర్ అయినట్లు స్పీకర్ తెలిపారు.

రాజ్యసభలో 119శాతం ఉత్పాదకత

లోక్‌సభ వాయిదా పడిన కొద్దిసేపటికే రాజ్యసభను కూడా నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ జగ్‌దీప్ ధన్కర్ ప్రకటించారు. తొలుత మధ్యాహ్నం 1.00 గంట వరకు వాయిదా పడిన సభ అనంతరం నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్ ప్రకటించారు. రాజ్యసభ 267వ సమావేశం ముగిసిందని, సభ 159 గంటలు పనిచేసిందని, సభ ఉత్పాదకత 119 శాతంగా ఉందనిపేర్కొన్నారు. గురువారం నాటి సమావేశం రికార్డు స్థాయిలో అత్యంత సుదీర్ఘమైనదని అన్నారు.

సమానత్వం, లౌకికవాదంపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

అనుమతించడం ద్వారా ఆర్టికల్ 25ను, అలాగే మత సంస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసి ఆర్టికల్ 26ను ఉల్లంఘిస్తుందని తెలిపింది. చట్టపరమైన లోపాలకు మించి దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, నిరుద్యోగం వంటి నిజమైన సమస్యల నుండి ప్రజల దృష్టి మరల్చుతూ మతపరమైన ఉద్రిక్తతల్ని రెచ్చగొట్టడానికి బీజేపీ పన్నిన వ్యూహమని మండిపడింది. ఇందులో భాగంగానే మైనారిటీలను శత్రువులుగా చూపుతూ... వివాదాలను సృష్టించే ప్రయత్నం బీజేపీ చేస్తోందని సీపీఐ పేర్కొంది. ప్రతిపాదిత సవరణలు వివాదాస్పద వక్ఫ్ ఆస్తుల యాజమాన్యాన్ని నిర్ణయించే అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు ఇస్తాయి. వక్ఫ్ బోర్డుల అధికార పరిధి నుంచి.. ప్రభుత్వం నియమించిన అధికారులకు బదలాయించడం.. అధికార దుర్వినియోగానికి, రాజకీయ జోక్యానికి దారితీస్తుంది. వక్ఫ్ ఆస్తులు చట్టవిరుద్ధమైనవని, మైనారిటీలను వారి స్వంత దేశం నుండి దూరం చేయడానికి ప్రయత్నిస్తాయనే తప్పుడు ప్రచారాన్ని ఈ బిల్లు బలోపేతం చేస్తుంది. ఈ విధమైన జోక్యం చర్చిలు, గురుద్వారాలు, మైనారిటీ వర్గాల దేవాలయాల వంటి ఇతర మత సంస్థలను నియంత్రించడానికి ఒక నమూనాగా నిలుస్తుందని సీపీఐ హెచ్చరించింది. అన్ని మత సంస్థలకు సమానత్వం, న్యాయాన్ని నిర్ధారించడం ద్వారా భారతదేశ లౌకిక విలువలను నిలబెట్టాలని సీపీఐ జాతీయ సమితి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. నిజంగా సంస్కరణల కోసమే ఈ బిల్లు తీసుకొచ్చినట్లయితే... అది ప్రజాస్వామ్య యుతంగా సంప్రదింపులు, రాజ్యాంగ హక్కులను గౌరవించడం ద్వారా చేయాలని హితవు పలికింది.

సమగ్ర నివేదిక ఇవ్వండి

- హెచ్‌సీయూ భూముల విధ్వంసంపై సుప్రీం జోక్యం
- ఆత్మరక్షణలో ప్రభుత్వం... మంత్రుల కమిటీ ఏర్పాటు
- డిప్యూటీ సీఎం భట్టితో సీఎస్ భేటీ

విశాలాంధ్ర - హైదరాబాద్: హెచ్‌సీయూ భూముల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో చుక్కెదురు కావడంతో, ఇక ముందు ఆచితూచి అడుగులు వేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. అందులో భాగంగానే కోర్టు అదేశాలు అందిన వెంటనే మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కూడిన కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వానికి... వర్సిటీ విద్యార్థులకు వారథిగా పనిచేసి సమస్యను పరిష్కరించాలని సూచించింది. ఈ మేరకు శుక్రవారం కమిటీ ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశం అయింది. హెచ్‌సీయూ వివాదానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా రంగం సిద్ధం చేసింది. సచివాలయంలో మంత్రుల కమిటీ ... సీఎస్ శాంతికుమారితో భేటీ అయింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క... సీఎస్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, అటవీ, హెచ్ఎండీఏ ఇతర ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. ఒకటి రెండు రోజుల్లో విద్యార్థి, పౌర సంఘాలు, పర్యావరణ వేత్తలతో కమిటీ సమావేశం అయ్యేందుకు యోచిస్తున్నట్లు సమాచారం. ఈ నెల 16వ తేదీలోగా నివేదిక ఇవ్వాలని ఇప్పటికే సీఎస్‌ను సుప్రీంకోర్టు ఆదేశించడంలో నివేదిక తయారీపై సీఎస్ దృష్టిపెట్టినట్టు తెలిసింది. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో తమ ఆదేశాలు అమలు చేయకపోతే సీఎస్ వ్యక్తిగతంగా బాధ్యులవుతారని, జైలుకు వెళతారని సుప్రీం కోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించింది. ఇది తీవ్రమైన అంశమని, చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకోవద్దని సూచించింది. ముఖ్యంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిప్ ధర్మాసనం అమికస్ క్యూరీ లేవనెత్తిన ఐదు అంశాలకు సంబంధించిన పూర్తి సమాచారం ఇవ్వాలని అదేశించింది. అటవీ భూమిగా భావిస్తున్న కంచ గచ్చిబౌలిలో చెట్లను హడావుడిగా తొలగించాల్సిన అవసరమేంటి అనే విషయానికి సమాధానం ఇవ్వాలని సూచించింది. ప్రభుత్వం పర్యావరణ మదింపు ధృవీకరణ నివేదిక తీసుకుందా అని నిలదీసింది. చెట్ల నరికివేతకు అటవీ అధికారుల నుంచి అనుమతులు పొందారా... స్థానిక చట్టాలను అమలు చేశారా అని ప్రశ్నించింది. మార్చి 15న రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో అటవీ, పర్యావరణ వ్యవహారాల్లో నిపుణులు కాని అధికారులను నియమించాల్సిన అవసరమేంటి... వారికి అడవుల గురించి ఉన్న అనుభవమేంటి... చెట్ల కలపను ఏం చేస్తోంది... అనే ప్రశ్నలకు సమాధానాలతో కూడిన సమగ్ర నివేదిక సమర్పించాలి అని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసింది.

నిరసన వెల్లువ

(మొదటిపేజీ తరువాయి)

ముర్ము అడ్డుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో వేలాదిమంది ముస్లింలు జాతీయ జెండా చేబూని రోడ్డెక్కారు. 'వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తున్నాం', 'మేము వక్ఫ్ సవరణలను వ్యతిరేకిస్తున్నాం' అనే ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. 'జాయింట్ ఫోరమ్ ఫర్ వక్ఫ్ ప్రొటెక్షన్' అధ్వర్యంలో నిరసనలు జరిగాయి. 'ఈ బిల్లు దేశాన్ని విభజించడానికి బీజేపీ చేసిన ఒక కుట్ర. విపక్షాలు, ముస్లిం సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ మెజారిటీ ఉన్నందున లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ బిల్లును ఆమోదించగలిగారు. ఈ నియంతృత్వాన్ని మేము వ్యతిరేకిస్తున్నాం. ఇది ముస్లిం ఆస్తులను స్వాధీనం చేసుకునే ప్రయత్నం మాత్రమే కాదు. దేశంలో మమ్మల్ని శత్రువులుగా చూపే ప్రయత్నం' అని నిరసనకారులలో ఒకరు పీటీఐకి చెప్పారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో వక్ఫ్ బిల్లుపై నిరసన తీవ్రరూపం దాల్చింది. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ముస్లింలు రోడ్లపై బైఠాయించి... పెద్ద ఎత్తున నిరసన తెలపడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అయితే శాంతియుతంగా నిరసన చేపడుతున్న వారిపై పోలీసులు విరుచుకుపడ్డారు. రోడ్డుపై కూర్చున్న ముస్లింలను పోలీసులు బలవంతంగా తరుముతున్న దృశ్యాలు మీడియాలో వైరల్‌గా మారాయి. నిరసనకారులు ఏఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు సబీర్ కబ్లీవాలా నాయకత్వంలో కేంద్రంలోని బీజేపీ సర్కారుకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సబీర్ కబ్లీవాలా సహా 40 మంది నిరసనకారులను అరెస్టు చేశారు. ముస్లిం సంస్థలు బెంగళూరు, చెన్నైలో కూడా వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాయి. తమిళనాడులో నటుడు విజయ్ పార్టీ తమిళగ వెట్రి కజగం (టీవీకే) రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు నిచ్చింది. చెన్నైతో పాటు ముఖ్య పట్టణాలైన కోయంబత్తూర్, తిరుచిరాపల్లిలో టీవీకే కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. 'వక్ఫ్ బిల్లుని వ్యతిరేకించండి', 'ముస్లింల హక్కులు హరించవద్దు' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ బిల్లు ప్రజాస్వామ్య వ్యతిరేకమని విజయ్ పేర్కొన్నారు. ఈ బిల్లును ఆమోదించడం భారతదేశ లౌకిక పునాదిపై దాడిగా అభివర్ణించారు.

వ్యతిరేకించిన ప్రతిపక్షం...వెనక్కు తగ్గని మోదీ సర్కారు

వక్ఫ్ చట్టం, 1995కు కేంద్రంలోని మోదీ సర్కారు చేసిన ప్రతిపాదిత సవరణలను ముస్లిం సమాజంతో పాటు ఇండియా ఐక్య సంఘటన పార్టీలన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయి. దీనిపై పార్లమెంటు ఉభయసభల్లోనూ, వెలుపల నియంతృత్వ మోదీ సర్కారు కుయుక్తులను ఎండగట్టాయి. న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు, ఇతర బీజేపీ సభ్యులు లేవనెత్తిన అంశాలకు ప్రతిపక్ష ఎంపీలు దీటుగా స్పందించారు. సవరణలు వక్ఫ్ సంస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తాయని, మత స్వేచ్ఛను ఉల్లంఘిస్తాయని ప్రతిపక్షాలే కాకుండా విమర్శకులు సైతం వాదిస్తున్నారు. అయినప్పటికీ పంతం పట్టిన మోదీ సర్కారు పార్లమెంటు ఉభయ సభల్లో వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదింప చేసుకుంది. వక్ఫ్ సవరణ బిల్లుపై బుధవారం లోక్‌సభలో 14 గంటలకు పైగా చర్చ జరిగింది. ప్రతిక్షాల ఆరోపణలు, అధికారపక్షం కౌంటర్లతో సభ వాడీవేడిగా సాగింది. అనంతరం ఓటింగ్ ప్రక్రియ నిర్వహించగా బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. 56 ఓట్ల తేడాతో ప్రతిపక్షాల అభ్యంతరాలు వీగిపోయాయి. గురువారం ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టగా.. అర్ధరాత్రి దాటే వరకూ దీనిపై విస్తృత చర్చ జరిగింది. 13 గంటలకు పైగా చర్చ జరిగింది. ప్రతిపక్ష పార్టీల నుండి తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. బిల్లును ముస్లింలకు వ్యతిరేకమైనదిగా, రాజ్యాంగ విరుద్ధమైనది ప్రతిపక్ష సభ్యులు దుయ్యబట్టారు. కానీ ఈ బిల్లు 'చారిత్రక సంస్కరణ', ముస్లీం సమాజానికి ప్రయోజనం చేకూరుస్తుందని ప్రభుత్వం ప్రతిస్పందించింది. అనంతరం జరిగిన ఓటింగ్‌లో ఈ బిల్లుకు అనుకూలంగా 128 మంది, వ్యతిరేకంగా 95 మంది సభ్యులు ఓటేశారు. దీంతో శుక్రవారం తెల్లవారుజామున రాజ్యసభ వక్ఫ్ సవరణబిల్లుకు ఆమోదం తెలిపినట్లయింది. ఇక, రాష్ట్రపతి సంతకం కోసం ఈ బిల్లును ప్రభుత్వం పంపించనుంది. అక్కడ ఆమోదం పొందిన తర్వాత చట్టంగా మారనుంది. వక్ఫ్ బిల్లు పేరును.. యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫిషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ బిల్లుగా (ఉమీద్-యుఎంఈఈడీ)గా ప్రభుత్వం పేర్కొంది.

ఫిరాయింపులపై మీ వైఖరేంటి?

విశాలాంధ్ర - హైదరాబాద్: మీరు బోధిస్తున్న నీతి సూత్రాలు, పార్టీ సిద్ధాంతాలకు సీఎం రేవంత్ రెడ్డి తూట్లు పొడుస్తున్నాడని మాజీ మంత్రి హరీశ్‌రావు... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి శుక్రవారం లేఖ రాశారు. రేవంత్ వికృతపాలనపై రాష్ట్రంలో తీవ్ర నిరసన వ్యక్తం అవుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువల గురించి మీరు దేశమంతా తిరిగి మాట్లాడుతుంటే, ఇక్కడ మాత్రం రేవంత్ తన అనాలోచిత, అవగాహనరాహిత్యం వల్ల నిత్యం రాజ్యాంగ్యాన్ని అవమానిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే తక్షణమే అనర్హులయ్యేలా చట్టం చేస్తామని ఎన్నికల సమయంలో మీరు చెప్పిన మాటలకు విరుద్ధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి... బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారని ఆరోపించారు. ఇదే విషయంపై అసెంబ్లీ లోపల, వెలుపల రేవంత్ చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టిందని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా బుల్డోజర్ రాజ్యాన్ని వ్యతిరేకిస్తున్న మీరు తెలంగాణలో ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట బుల్డోజర్లు పంపి పేద, మధ్య తరగతి ఇళ్లు కూలగొడుతున్నాడని అన్నారు. ఈ విధ్వంస పూరిత వైఖరి హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చేరి వందల ఎకరాల్లో విధ్వంసానికి తెరతీసిందని విమర్శించారు. పక్షులు, జంతువులు ఆవాసాలు కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్మార్గాన్ని వ్యతిరేకిస్తున్న విద్యార్థులు, ప్రొఫెసర్లపై పోలీసుల దాష్టీకం తీవ్రంగా కలిచి వేసిందన్నారు. రోహిత్ వేముల ఆత్మహత్య సమయంలో హెచ్‌సీయూ సందర్శించిన మీకు అప్పటి మా ప్రభుత్వం ఎస్కార్ట్ ఇచ్చి నిరసన తెలిపేందుకు అవకాశం కల్పించిందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ సమయంలో విద్యార్థులకు అండగా ఉంటానని మీరు హామీ ఇచ్చిన విషయం గుర్తుందా అని అడిగారు. సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చేదాక హెచ్‌సీయూలో విధ్వంస కాండను ఆపలేదని, ఈ విషయంలో మీరు, మీ పార్టీ మౌనంగా ఉండడానికి కారణం తెలపాలని యావత్ తెలంగాణ ప్రజల తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

కార్మికుల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

(మొదటిపేజీ తరువాయి)

మోదీ ప్రభుత్వం కొమ్ము కాస్తూ , కార్మిక చట్టాల మార్పునకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. పీడనకు గురౌతున్న కార్మికులను సమీకరించి పోరాటాలను నిర్వహించటం ద్వారానే దోపిడిని ఎదుర్కొనేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. బడా పారిశ్రామికవేత్తల ఆస్తులు రోజురోజుకు గణాంకాలకు మించి పెరిగిపోతుంటే... ఉత్పత్తి సాధకులైన కార్మికులకు కనీస వేతనాలు అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా మారుస్తూ శ్రమజీవుల రక్తాన్ని పెట్టుబడిదారులు తమ శ్వేత సౌధాలను నిర్మించుకునేందుకు ఉపయోగించుకుంటున్నారని ధ్వజమెత్తారు. దేశంలో కమ్యూనిస్టుల భాగస్వామ్యంతో ఉన్న ప్రభుత్వంలో ఉపాధి హామీ చట్టం, భవన నిర్మాణ కార్మిక చట్టం తీసుకువచ్చిన ఘనత కమ్యూనిస్టులదేనన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజలను విభజిస్తుందన్నారు. ప్రజల మనోభావాలను అడ్డం పెట్టుకుని శ్రమదోపిడికి పాల్పడుతున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో సీపీఐ తరపున ప్రస్తావించినట్టు చెప్పారు. గత పదేళ్లలో కనీస వేతనాల పెంపుదల, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ఆటో క్యాబ్ వర్కర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో కార్మికవర్గం ఎదుర్కొన్నటువంటి సమస్యలపై సమగ్రమైన పరిశీలన చేసి పరిష్కారానికి మార్గం చూపాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకై నాలుగు లేబర్ కోడ్‌ల అమలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల అమలు కోసం మే డే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వి.ఎస్.బోస్, ఎం. నరసింహ, బి.చంద్రయ్య, పి. ప్రేమ్ పావని, పల్లా దేవేందర్ రెడ్డి, బి. వెంకటేశం, సింగ్ నరసింహారావు పాల్గొన్నారు.

ప్రగతి నిరోధకులపై అప్రమత్తం

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించామన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేలా ఒప్పందాలు చేసుకున్నామని వివరించారు. రాజీవ్ గాంధీ కృషితో నేడు ఐటీ రంగం ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. ఫ్యూచర్ సిటీలో మరిన్ని కంపెనీలు ఏర్పాటయ్యేలా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ఆవిర్భావం కోసం పోరాడిన యువతకు ఉద్యోగాలు కల్పిస్తేనే అర్థం పరమార్థం ఉంటుందన్నారు. ఆత్మగౌరవంతో బతుకొచ్చని రాష్ట్రం కోసం పోరాడిన నిరుద్యోగ యువతీ యువకుల ఆశలను నిజం చేయడానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 59,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించినట్టు వివరించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆనాడు సీఎం రేవంత్ రెడ్డి, తాను... నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఇచ్చిన మాట ప్రకారం అర్హత కలిగిన 112 మందికి, టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన 51 మందికి ఆర్థిక శాఖలో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్‌గా నియామక పత్రాలను అందజేసినట్టు చెప్పారు. లక్షల మంది యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించడానికి హైదరాబాద్ నగరంలో ఐటీ సెక్టర్, నాలెడ్జ్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

హైదరాబాద్ నగరాన్ని విస్తరించి ప్రపంచంలో పేరు ప్రఖ్యాతి పొందిన సంస్థలను తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ వెళ్లి రూ.లక్ష 84 వేల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూ కుదుర్చుకున్నట్టు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అమెరికాపై 34 శాతం చైనా సుంకాలు

(మొదటిపేజీ తరువాయి)

బెదిరింపులకు పాల్పడుతోందని మండిపడింది. 'చైనాలోని టారిఫ్ చట్టం, కస్టమ్స్ చట్టం, విదేశీ వ్యాపార చట్టం, అంతర్జాతీయ వాణిజ్య నిబంధనల ప్రకారం స్టేట్ కౌన్సిల్ ఆమోదంతో అమెరికా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై ఏప్రిల్ 10 నుంచి అదనపు సుంకాలు విధిస్తున్నాం' అని ది స్టేట్ కౌన్సిల్ ఆఫ్ టారిఫ్ కమిషన్ వెల్లడించింది. కొత్త నిర్ణయంతో ప్రస్తుతం అమెరికా నుంచి దిగుమతులపై ఉన్న పన్నులకు అదనంగా ఈ టారిఫ్‌లు విధించనున్నారు.

ఏపీ నీటి ప్రాజెక్టులపై సుప్రీంకోర్టుకు వెళతాం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. ఏపీ చర్యల వల్ల తెలంగాణలో సాగు, తాగునీటికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. శుక్రవారం నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి, కృష్ణా జలాల్లో న్యాయబద్ధమైన వాటా సాధిస్తాం. ఇందుకోసం సుప్రీం కోర్టులో కేసు వేస్తాం. గోదావరి ట్రిబ్యునల్ ఉత్తర్వులు, విభజన చట్టాన్ని ఏపీ ఉల్లంఘిస్తోంది. కేంద్రం, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ప్రాజెక్టులు చేపడుతున్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ఇప్పటికే అభ్యంతరం వ్యక్తం చేశాం. పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తోందని కేంద్ర నిపుణుల కమిటీ చెప్పింది. అయినా ఏపీ పరోక్ష మార్గాల్లో ప్రాజెక్టు నిర్మాణాన్ని కొనసాగిస్తోంది. ఏపీ చర్యలను తెలంగాణ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు' అని ఉత్తమ్ తెలిపారు.

రేషన్ షాపులకు సన్న బియ్యం రవాణా వేగవంతం చేయాలి : మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : రేషన్ షాపులకు సన్న బియ్యం రవాణా వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి మంత్రి, సన్న బియ్యం సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్., అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి తో కలిసి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 40 రూపాయలు పైగా కిలో బియ్యానికి వెచ్చించి ప్రజలకు ఉచితంగా దొడ్డు బియ్యం సరఫరా చేశామని, చాలా పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసి ప్రజలకు బియ్యం సరఫరా చేస్తున్నప్పటికీ 70 నుంచి 80 శాతం వరకు ఆ బియ్యాన్ని ప్రజలు తినేవారు కాదని, రీసైక్లింగ్ ద్వారా కోళ్ల ఫారాలకు, ఇతర అవసరాలకు తరలి వెళ్లేదని తెలిపారు. రేషన్ షాపులకు సన్న బియ్యం సరఫరా రవాణా వేగవంతం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, సన్న బియ్యం సరఫరా కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా లాంచ్ చేయడం జరిగిందన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి షా ఫైజల్ హుస్సేని, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు అంకితభావంతో పని చేయాలి

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్ : అధికారులు క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధ్యక్షతన జిల్లా స్థాయి అభివృద్ధి సంక్షేమ పథకాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడు తూ జిల్లాలో క్షేత్ర స్థాయిలో అధికారులు అంకిత భావంతో పనిచేసి గిరిజన, పేద బడుగు, బలహీన వర్గాల వారందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని తెలిపారు. ఐటీడీఏ ఏటూరునాగారం పరిధిలో మహబూబాబాద్ జిల్లా ప్రాంతం భాగస్వామ్యం ఉన్నందున గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రాజెక్టు డైరెక్టర్ పూర్తి సహకారం అందించాలని, గ్రామపంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామాలలో అంతర్గత అభివృద్ధి పనులు, పెండింగ్‌లను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.వీర బ్రహ్మచారి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ నరేష్, ఎక్సైజ్ సూపర్డెంట్ కిరణ్ కుమార్, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డీఎస్పీ తిరుపతిరావు, తొర్రూరు, మహబూబాబాద్ రెవిన్యూ డివిజనల్ అధికారులు గణేష్, కృష్ణవేణి, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు నరసింహస్వామి, దేశి రామ్ శ్రీనివాస్, డిసిఓ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు డాక్టర్ కిరణ్ కుమార్, మరియన్న, వేముల సురేష్, ప్రేమ్ కుమార్, ఏ రవీందర్ రెడ్డి, ఎంపీడీవోలు, తహసీల్దారులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయ, ముత్యాలమ్మ దేవాలయాల్లో జగదీష్ రెడ్డి పూజలు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో ప్రారంభోత్సవం చేసినటువంటి శ్రీసీతారామాంజనేయ స్వామి, ముత్యాలమ్మ దేవాలయాలను మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో పాడిపంటలతో ఆరోగ్యంగా ఉండాలని ఆ దేవుని కోరుకున్నానని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దేవాలయాలకు ప్రత్యేక గుర్తింపుని ఇచ్చారని తెలిపారు. బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, పెన్పహాడ్ మండల మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం గౌడ్, సూర్యాపేట మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, నేరేడుచర్ల బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అరిబండి సురేష్ బాబు, డిసిసిబి డైరెక్టర్ దొండపాటి అప్పి రెడ్డి, హుజూర్నగర్ మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి, హుజూర్నగర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు చెన్నబోయిన సైదులు, నేరేడుచర్ల మాజీ మున్సిపల్ చైర్మన్ చందమల్ల జయ బాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి యల్లబోయిన లింగయ్య యాదవ్ పాల్గొన్నారు.

బిడియల్ భానూర్ పోలీస్‌స్టేషన్ ఎస్పీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : పోలీస్ సిబ్బంది, అధికారులు స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలని, సివిల్ తగాదాలలో తల దూర్చ కూడదుదని ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. శుక్రవారం బిడియల్ భానూర్ పోలీసుస్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అధికారులు 24 గంటలు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణలో కృషి చేయాలని ఆయన తెలిపారు. మన చుట్టూ జరుగుతున్న ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్స్, బెట్టింగ్ యాప్ గురించి, రోడ్డు ప్రమాదాల గురించి జిల్లా ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన కూడళ్లలో ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయడం, బోలార్డ్స్, రాంబిల్ స్ట్రిప్స్ వేయించడం, తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లు గుర్తించి, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. విజిబుల్ పోలిసింగ్‌లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్, ఈ-పెట్టీ కేసులు నమోదు చేయాలని యస్.హెచ్.ఒకు పలు సూచనలు చేశారు.

14 వరకు రాజీవ్ యువవికాసం దరఖాస్తుల గడువు పొడగింపు

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి: రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 14 వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తులను ఆఫ్ లైన్ లో సంబంధిత మండల పరిషత్ కార్యాలయం లేదా మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని, ఈ కార్యాలయాల్లో ప్రజాపాలన కౌంటర్ నందు దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నిరుద్యోగ యువతపై పెద్ద మొత్తంలో ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తూ రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశ పెట్టిందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ యువకులకు సంబంధిత కార్పొరేషన్ల ద్వారా 100 శాతం సబ్సిడీపై 50 వేల యూనిట్, 90 శాతం సబ్సిడీ పై లక్ష రూపాయల యూనిట్, 80 శాతం సబ్సిడీతో 2 లక్షల రూపాయల యూనిట్, 70 శాతం సబ్సిడీతో 4 లక్షల వరకు యూనిట్ యువకులు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వ సహకారం అందిస్తుందని అన్నారు.

యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ మంజూరుకు అనుమతి

మంత్రి తుమ్మల వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ఉమ్మడి ఖమ్మం కొత్తగూడెం జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం తమ వంతు కృషికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాల సహకారం అందిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌కు ముఖ్యమంత్రి సమ్మతించారని తెలిపారు. అన్ని రకాల ఖనిజ నిక్షేపాలు ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సమగ్ర అభివృద్ధి సాధ్యమన్నారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అనేక ఖనిజనిక్షేపాలు ఉన్నందున చదువుకున్న యువతీ, యువకులకు ఖనిజాలను వెలికి తీసే విధంగా అవగాహన కల్పించడానికి యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యాలయం ఎంతో దోహదపడుతుందన్నారు. శుక్రవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలొ మాట్లాడారు. ఇందులో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, పిఓ బి. రాహుల్, ఎస్పీ రోహిత్ రాజ్‌లు కూడా వున్నారు. భద్రాచలం దేవస్థానం భక్తులు అధిక సంఖ్యలో రావడానికి తక్కువ ఖర్చుతో పర్యాటకంగా అభివృద్ధి చెందడానికి కొత్తగూడెంలో విమానాశ్రయం కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. కేంద్ర మంత్రికి నివేదించడం జరిగిందన్నారు. త్వరలో అనుమతులు వస్తాయని, భద్రాచలంలో ఎక్కువ శాతం ఆదివాసి గిరిజనులు నివసిస్తూ ఉంటారని ఈ ప్రాంతానికి రైలు మార్గం కోసం కూడా పాండురంగపురం నుండి మల్కనగిరి రైల్వే లైన్ కలుపుతూ 16 కిలోమీటర్లు సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. సార పాక వరకు రైలు మార్గం పూర్తయితే భద్రాచలం భక్తులు రావడానికి సమయం కలిసి వస్తుంద న్నారు. నేషనల్ హైవే అమరావతి నుండి జగదల్పూర్ వరకు అలాగే భద్రాచలం నుండి ఏటూరు నాగారం డబుల్ లైన్ రోడ్డు నిర్మాణం కొరకు సర్వే చేసి త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. భద్రాచలం దేవస్థానమును మరింత అభివృద్ధి దిశగా తీసుకు వెళ్లడానికి మాడవీధుల అడ్డంకి లేకుండా జిల్లా అధికారులు కృషి చేయడం వల్ల రూ. 34 కోట్లు తమ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఇంకా అవసరమైతే నిధులు అందజేస్తామని సీఎం ఒప్పుకున్నారని చెప్పారు. ఆగమ శాస్త్ర పండితులతొ చర్చించి టెంపుల్ అభివృద్ధి కొరకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు.

ప్రభుత్వాసుపత్రి వైద్యసేవలపై నమ్మకం కల్పించాలి

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : పలు రకాల వ్యాధులతో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వస్తున్న రోగులకు వైద్యం అందిస్తున్న డాక్టర్లపై నమ్మకం కలిగే విధంగా వైద్య సేవలు అందించాలని, మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైద్య సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం జిల్లా ప్రధాన ఆసుపత్రి సమావేశ మందిరంలో జిల్లాలో పనిచేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రోగ్రాం ఆఫీసర్స్, మెడికల్ ఆఫీసర్స్, ప్రధాన ఆసుపత్రి సూపరింటెంట్, జిల్లా వైద్య నిపుణులు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, సిబ్బందితో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్‌లతో కలసి అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో రోగులకు అందిస్తున్న వైద్యంపై పిహెచ్‌సిల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సాధారణ ప్రజలే మనకు దేవుళ్ళుగా భావించి మానవీయ కోణంలో, జనంతో మమేకమై ప్రజలు గుర్తించుకునేటట్లు, ప్రేమ ఆప్యాయతలతో మెరుగైన వైద్య సేవలు అందించాలని అప్పుడే సాధారణ ప్రజలకు వైద్య ఆరోగ్యశాఖ పట్ల నమ్మకం కలుగుతుందని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెంట్ జగదీశ్వర్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌లాల్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

అకాల వర్షం వల్ల పంట నష్టపోయిన రైతు వివరాలు అందచేయాలి : మంత్రి

గోవిందరావుపేట మండలంలోని కర్లపల్లి రెవెన్యూ గ్రామంలోనీ అమృతండా, చంద్రు తండా, కర్లపల్లి, లక్ష్మీపురం, మోద్దులగూడెం గ్రామాలలో అకాల వర్షం వలన పంట నష్టం జరిగినటువంటి పంట క్షేత్రాలను శుక్రవారం రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పర్యటించి, పంట నష్టం జరిగినటువంటి రైతుల వివరాలు సేకరించమని వ్యవసాయ శాఖను మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ సహాయ సంచాలకులు ఏటూరు నాగారం, తహసిల్దారు, ఎంపీడీవో, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు గొల్లపెల్లి రాజేంధర్ గౌడ్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : రాజీవ్ యువ వికాస పథకం కింద అర్హులైన యువత పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రాజీవ్ యువ వికాస పథకం ద్వారా ఎక్కువ మంది లబ్ధి పొందే విధంగా నల్గొండ జిల్లాలో యువతకు అవగాహన కల్పించడంలో భాగంగా షెడ్యూల్ కులాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్గొండ జిల్లా, కనగల్ మండలం, జి.యడవల్లి గ్రామంలో రాజీవ్ యువ వికాస పథకంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ జి.యడవల్లి గ్రామం అత్యంత వెనుకబడిన గ్రామమని, గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకుగాను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు తాను గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. రాజీవ్ యువ వికాస పథకంలో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 14 లోగా ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని, నాలుగు లక్షల రూపాయల వరకు ఈ పథకం కింద ఆర్థిక సాయం పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు.

అర్హులైన అందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి

విశాలాంధ్ర - ఖమ్మం : తెల్ల రేషన్ కార్డుల జారీకి సంబంధించి రకరకాల కారణాలు చూపి రేషన్ కార్డుల సంఖ్యను తగ్గించేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నిస్తుం దని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ఆరోపిం చారు. మారిన కాల మాన పరిస్థితుల్లో యువత ఉపాధి అవకాశాలు లేక వాహనాలను ఫైనాన్స్లో తీసుకుని కిరాయిల ద్వారా కుటుంబ పోషణ చేసుకుంటున్నారని ఇటువంటి వారికి తెల్లరేషన్ కార్డులను జారీ చేయడంలో వాహనం ఉందనే నిబంధన సరి కాదన్నారు. శుక్ర వారం ఈ మేరకు సురేష్ సిపిఐ జిల్లా సమితి పక్షాన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి అవకాశాలు లేని పరిస్థితుల్లో కొందరు జీరో చెల్లింపుపై వాహనాలను తీసుకున్నారని అటువంటి వారికి రేషన్ కార్డు రాదంటూ కొత్త నిబంధనలను తెర మీదకు తీసుకు వచ్చారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన గరిష్ట ఆదాయం లోపు ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వాలని సురేష్ కోరారు. జిల్లాలో మొక్కజొన్న సాగుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని ఆయన కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సమావేశం శనివారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని పుట్టకోటలో జరగనుంది. భూ కబ్జాలు, ల్యాండ్ సుఫారీ గ్యాంగుల చర్యలను నిరసిస్తూ ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా. నగర కార్యదర్శి ఎస్ కె జానిమియాతో పాటు సిపిఐ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఐసమితి సభ్యులు హాజరు కానున్నారు.

సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

విశాలాంధ్ర - కారేపల్లి : కారేపల్లి సొసైటీ ఆధ్వర్యం లో ధాన్యం,మొక్కజొన్న ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సొసైటీ అధ్యక్షులు దుగ్గినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కారేపల్లిలో విలేకరు లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు కల్పించాలని లక్ష్యంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు.కారేపల్లి మండలంలో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుకు విశ్వనాధపల్లి, సీతారాంపురం కేంద్రాలను ఏర్పాటు చేయటం జరుగుతుందని, మొక్కజొన్న కొనుగోలుకు మాధారం కేంద్రాన్ని ప్రారంభించటం జరుగుతుందన్నారు. వరి సన్నరకం క్వింటా రూ 2320, మొక్కజన్న క్వింటా రూ 2225 లను కొనుగోలు చేయటం జరుగుతుందన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులు తప్పని సరిగా వడ్డీలు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలన్నారు. సకాలంలో పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవటం ద్వారా ప్రభుత్వం అందించే 3 శాతం వడ్డీ రాయితీ వస్తుందని తెలిపారు. రెన్యూవల్ చేసుకోని వారిపై సహకార చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. రైతులు సొసైటీ అధికారులకు సహకరించాలని కోరారు.

మాదకద్రవ్యాల రవాణాపై కఠిన చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : యువత భవిష్యత్తుపై చెడు ప్రభావం చూపే మాదకద్రవ్యాల రవాణాపై జిల్లాలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు ఎస్.పి. ప్రభాకర్ రావు, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాలతో కలిసి నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలపై దుష్ప్రభావాలను చూపే మాదకద్రవ్యాల రవాణాపై జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అందరం సమిష్టిగా కృషి చేసి కుమ్రంభీం ఆసిఫాబాద్‌ను నషా ముక్త్ జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, కిరాణా దుకాణాలు, బెల్ట్ షాపులు, మందుల దుకాణాలలో తనిఖీలు చేపట్టాలని, సరిహద్దు రాష్ట్రం నుండి అక్రమంగా జిల్లాలో రవాణా చేసే అవకాశం ఉన్నందున చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాలు సేవించడం వల్ల ఆర్థిక స్థితి, కుటుంబ పరిస్థితి, వయసు, ఆరోగ్యం వంటి అంశాలపై చూపే చెడు ప్రభావం కారణంగా వ్యక్తి జీవితాన్ని కోల్పోతాడని అన్నారు. జిల్లాలో డ్రగ్స్ డి అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఆర్జీ వన్ జీఎం కాలనీల్లో పాదయాత్ర

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి,సింగరేణి: శుక్రవారం గంగానగర్ మిలీనియం బ్లాక్ కాలనీలో ఆర్జీ వన్ జీఎం లలిత్ కుమార్ పాదయాత్ర చేసి కాలనీ సమస్యలు పరిశీలించారు. ఉద్యోగుల క్వార్టర్లలలో అందుతున్న సదుపాయాలను, క్వార్టర్‌లలో సానిటేషన్, త్రాగునీటి సరఫరా, సివిల్ వర్క్స్, ఎలక్ట్రికల్ సంబంధించి విషయాలు ఉద్యోగులను, వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం గుర్తింపు సంఘం నాయకులు, మడ్డి ఎల్లయ్య, కె.స్వామి, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, అధికారులు జీఎం గోపాల్ సింగ్,కిరణ్ బాబు, దాసరి వెంకటేశ్వర్ రావు,జితేందర్ సింగ్, వర వరప్రసాద్, ఆంజనేయ ప్రసాద్, రవీందర్ రెడ్డి, కర్ణ, హనుమంతరావు, అధికారి వీరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనలంద పాఠశాల గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర - తొర్రూర్ : శ్రీ నలంద పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పాలడుగుల రవీందర్ తెలిపారు. శుక్రవారం తొర్రూర్ పట్టణం నందలి శ్రీ నలంద పాఠశాలలో ఘనంగా 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ పాఠశాల ప్రిన్సిపాల్ పాలడుగుల రవీందర్ గ్రాడ్యుయేషన్ డే అనేది విద్యార్థులకు ఒక మరుపురాని జ్ఞాపకంగా ఉంటుందని, అదేవిధంగా వాళ్లు ఇప్పటివరకు ప్రైమరీ విద్యను అభ్యసించి, ఉన్నత తరగతికి వెళ్లడం జరుగుతుందని. కాబట్టి పిల్లలకు ఈ గ్రాడ్యుయేషన్ డే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ గ్రాడ్యుయేషన్ డే అనేది సహజంగా డిగ్రీ పట్టా పొందిన వారికి ఏర్పాటు చేస్తారని, కానీ శ్రీ నలంద పాఠశాలలో విద్యార్థులకు ఈ గ్రాడ్యుయేషన్ అనేది యూకేజీ నుంచి ఒకటవ తరగతి వెళ్లే విద్యార్థులకు అదేవిధంగా ఐదవ తరగతి నుండి ఆరవ తరగతి వెళ్లే విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఒక మరుపురాని అనుభవంగా ఉండాలని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, పాఠశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, డిజిఎం చేతన్, ఏజీఎం పద్మాకర్, జెడిసి శివ కోటేశ్వరరావు, అకాడమిక్ డీన్ యాకన్న, ప్రైమరీ కోఆర్డినేటర్ అశ్విని, ప్రైమరీ ఇంచార్జ్ పుష్ప, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ శ్వేతారెడ్డి, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయం ముందు అంగన్వాడీ టీచర్ల నిరసన

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: ప్రభుత్వం హామీలు ఇచ్చిన ప్రకారం తమ జీతాలు ఇవ్వడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం బైఠాయించి అంగన్వాడీ టీచర్స్ ఆందోళన చేపట్టారు. 10 నెలలుగా మినీ అంగన్వాడీ టీచర్లు పూర్తి వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఎగనామం పెడుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో ఐసీడీయస్‌లో మినీ అంగన్వాడీ కేంద్రాలులో పని చేస్తున్న టీచర్స్ రెండు రకాల పనులు అంటే వర్కర్ పని, టీచర్స్ పని చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 24 రోజుల సమ్మె భాగంగా 4వేల మినీ కేంద్రాలు మెయిన్ కేంద్రాలుగా ప్రమోట్ చేస్తూ కేంద్రం ప్రభుత్వంకి లేఖ ఇవ్వడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఐసీడీయస్ శాఖ మంత్రి సీతక్క ప్రమాణం అనంతరం తొలి సంతకంతొ ఈ సెంటర్లను ప్రమోట్ చెశారన్నారు. పెరిగిన వేతనం రూ.4 నెలలు తోపాటు నెలకు రూ.13650 పెంచి ఇచ్చారని తెలిపారు. గత 10 నెలలుగా పెంచిన జీతం ఇవ్వకుండా, రూ.7650 ఇస్తున్నారని ప్రసాద్ విమర్శించారు. పెంచిన జీతం ఇవ్వడంతో పాటు, బిల్ ఓ డ్యూటీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు జిల్లా ఐసీడియస్ పిడికి సమస్యలపై వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షులు గోనే మణి, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి అరుణ, విజయ, సరస్వతి, భారతి, నీరజ, వినోద, లలిత, సరోజని పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లు ఉపసంహరించుకునే వరకు పోరాటం ఆగదు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : కేంద్రంలో ఎన్డీఏ ముసుగులో ఉన్న బిజెపి ప్రభుత్వం ముస్లింల పై పదేళ్ల కాలం నుంచి అనేక నిర్బంధాలు కుట్రలు పన్నుతూ వస్తుందని ఆ క్రమంలో భాగమే వక్ఫ్ సవరణ బిల్లని సీనియర్ జర్నలిస్ట్, జమాతే ఇస్లామీ హింద్ జాతీయ సభ్యులు ఎండి. ఉస్మాన్ ఖాన్ ఆరోపించారు. ఏక పక్షంగా ఉభయసభల్లో ఆమోదించిన నల్లచట్టం వక్ఫ్ బిల్లుపై ఆయన శుక్రవారం ప్రత్యేక నమాజ్ల అనంతరం సమావేశం నిర్వహించారు. ములకలపల్లి మండలం జగన్నాధపురంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఉద్యమానికి ముస్లిం సమాజం సిద్ధమవుతుందని స్పష్టం చేశారు. సెక్యులర్ ముసుగు తొడిగి ఇంతకాలం నాటకాలాడిన ఏపీ, బీహార్ ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్‌ల నైజం బిల్లు విషయంలో దేశ ప్రజలు గమనించారని ఉస్మాన్ విమర్శించారు. రాజ్యాంగ విరుద్ధమైన ప్రధాని మోడీ, హోమ్ మంత్రి అమిత్‌షాల ప్రతిపాదిత ఈ నల్ల చట్టానికి మద్దతు తెలిపిన చంద్రబాబు, నితీష్ కుమార్‌లు చరిత్ర హీనులుగా మిగిలి పొయ్యారని విమర్శించారు. ఈ నల్ల చట్టాన్ని కేంద్రం ఉపసంహరించుకునే వరకు ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు చేపట్టబోయే ప్రతి ఉద్యమంలో ముస్లింలందరూ వెన్నంటి నిలుస్తారని ఆయన స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ అబ్దుల్ జబ్బార్, బాజీబాబా, యాఖూబ్, షబ్బీర్, జాఫర్, సమీ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర దమనకాండ "ఆపరేషన్ కగార్' ను నిలిపివేయాలి

విశాలాంధ్ర - గార్ల : చత్తీస్గఢ్ అడవుల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ ఆదివాసుల ఊచకోతను తక్షణమే నిలిపివేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి. సక్రు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో నిర్వహించిన న్యూ డెమోక్రసీ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం దేశ మూల వాసులైన ఆదివాసి ప్రజలను పూర్తిస్థాయిలో నివారించే కుట్రలు, హత్యాకాండను కొనసాగించటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎన్కౌంటర్స్ పేర హతులవుతున్న వారిలో అమాయక ఆదివాసిలే అధికంగా ఉన్నారని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు అడవులను కట్టబెడితే తమ జీవనానికి, జాతి మనుగడకే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ పరిణామాలపై ప్రజాస్వామ్య వాదులు, సంఘాలు, ప్రతి పౌరుడు ఆదివాసీలకు అండగా నిలిచి, ప్రభుత్వ దమన కాండను ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. న్యూడెమోక్రసీ నాయకులు ఎం. సీతారాములు, జగన్, వీరు, రాధమ్మ, భారతి, రామ, బిచ్చ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని బలోపేతం చేయాలి

విశాలాంధ - కొత్తగూడెం : ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) జిల్లా అధ్యక్షులు, లయన్, షేక్ దస్తగిరి అన్నారు. శుక్రవారం పాత కొత్తగూడెం ప్రభుత్వ హైస్కూల్‌లో కొత్తగా పదోన్నతి పొందిన ఆంగ్ల ఉపాధ్యాయుల రెండు రోజుల వృత్యాంతర శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కోర్సు డైరెక్టర్, హెచ్ఎం. మధుర వాణి, దస్తగిరి లు పాల్గొని మాట్లాడారు. నిపుణులైన జిల్లా ఆంగ్ల రిసోర్స్ పర్సన్‌లు తమ బోధనల్లో నేర్పించిన మెలకువలు, ఆంగ్ల వ్యాకరణం, ప్రొఫెషనల్ డెవలప్మెంట్ వంటి అంశాలను ఆంగ్ల ఉపాధ్యాయులు తరగతి గదిలో పాటించడం వల్ల విద్యార్థుల్లో ఆంగ్లం అంటే భయం పోయి, ఆంగ్లంపై ఆసక్తి ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ తరపున కోర్సు డైరెక్టర్ మధురవాణి తో పాటుగా జిల్లా ఆంగ్ల రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ షేక్ మీరా హుస్సేన్, కర్లపూడి సైదులు, గుగులోతు రమేష్, చెరుకుపల్లి మురళి లను శాలువాలు కప్పి, బొకేలతో ఘనంగా సన్మానించారు. గౌరీ శంకర్,రవి శర్మ , జ్యోతి కుమార్, పద్మావతి, విజయ రత్న శ్రీ, హేమలత, సిహెచ్ రమేష్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

దాతల్లారా... నిండు ప్రాణాన్ని కాపాడండి...

విశాలాంధ్ర - పినపాక : విధి నిర్వహణకు వెళ్తూ కిందపడి తలకు బలమైన గాయమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ మహిళ చిరుద్యోగి నాగరాణిని వైద్యం కోసం దాతలు మానవత్వంతో సహాయం చేయాలని కుటుంబ సభ్యులు అభ్యర్థన చేస్తున్నారు. పినపాక మండలం భూపాల పట్నం గ్రామానికి చెందిన బర్ల నాగరాణి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా చేస్తోంది. ఈమెకు భర్త సురేష్,ఇద్దరు పిల్లలున్నారు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకొని మణుగూరు టూ వీలర్‌పై వెళుతున్న సమయంలో ఫిట్స్ వచ్చి కింద పడిపోయింది. తలకు బలమైన గాయాలు కావడంతో తొలుత భద్రాచలం నిమ్స్ హాస్పిటల్ చేర్పించారు. అనంతరం డాక్టర్లు ఖమ్మం తీసుకెళ్లాలని సూచించారు. ఇక్కడ కూడా చికిత్స సాధ్యపడదని హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. కొంతమంది దాతల సహాయంతో హైదరాబాదులోని కిమ్స్ హాస్పిటల్‌లో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. తలకు ఆపరేషన్ చెయ్యాలనీ, ఖర్చు రూ.8 లక్షలు అవుతుందని డాక్టర్లు తెలిపారు. ఆర్థిక స్తోమత లేని నాగరాణి ఇద్దరు పిల్లలు మా అమ్మప్రాణాలు కాపాడాలని దాతలను వేడుకుంటున్నారు. నాగరాణి ఇటీవల వీఆర్ ఎ నుంచి ప్రమోషన్ పై రికార్డ్ అసిస్టెంట్‌గా నియమితులైనట్టు తెలుస్తుంది. సహాయం చేసే దాతలు నాగరాణి ఫోన్‌పే 6281843477 కు చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

సంపాదకీయం

వీధి పోరాటాలు-కోర్టు వ్యాజ్యాలు

వక్ఫ్ వ్యవహారంలో మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం తాంబూలాలిచ్చేసింది. వక్ఫ్ సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించిన మరుసటి రోజు రాజ్యసభ కూడా ఆమోదించింది. లోక్‌సభలో ఈ బిల్లుకు అనుకూలంగా 288 మంది ఓటు వేస్తే 232 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. రాజ్యసభలో 120 మంది అనుకూలంగా ఓటు వేస్తే 95 మంది బిల్లును వ్యతిరేకించారు. మొత్తం మీద వక్ఫ్ బిల్లుకు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం సాధించడంద్వారా ఎన్డీయే ప్రభుత్వం తన పంతం నెగ్గించుకుంది. ముస్లింల, ప్రతిపక్షాల అభిప్రాయాన్ని మోదీ ప్రభుత్వం ఏ మాత్రం లెక్క చేయలేదు. సానుకూలమైన అంశం ఏమిటంటే లాంఛన ప్రాయంగానైనా సరే ఈ బిల్లును పార్లమెంటులో చర్చించడానికి ముందు ఈ బిల్లును కూలంకశంగా పరిశీలించడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీలో సవ్యంగా చర్చ జరగలేదు, ప్రతిపక్షాల అభిప్రాయాన్ని ఏ దశలోనూ ఖాతరు చేయకపోవడం బీజేపీ "బుల్డోజర్" సంస్కృతికి నిదర్శనం. కానీ ఒక లాంఛనం పూర్తి అయింది. లోక్‌సభలో ఈ బిల్లుపై దాదాపు 12 గంటల పాటు చర్చ జరిగింది. రాజ్యసభలోనూ సుదీర్ఘమైన చర్చ జరిగింది. అయితే ఇల్లలకగానే పండగ అయిపోలేదు. పార్లమెంటు ఉభయ సభలు ఈ బిల్లుకు ఆమోద ముద్ర వేసినా, రేపో మాపో రాష్ట్రపతి ఆమోదం తరవాత ఈ బిల్లు చట్ట రూపంలోకి వచ్చినా వివాదం మాత్రం సమసిపోయే అవకాశం కనిపించడం లేదు. పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొందిన మర్నాడే దేశంలోని అనేక ప్రాంతాలలో జనం వీధులకెక్కి ఈ బిల్లుపై నిరసన వ్యక్తం చేశారు. చివరకు మోదీ, అమిత్ షా సొంత రాష్ట్రమైన గుజరాత్ లో కూడా నిరసన ధ్వనులు గట్టిగానే వినిపించాయి. కోల్‌కతా, చెన్నై, లక్నో వీధుల్లో కూడా నిరసనలు కొనసాగాయి. ఈ నిరసనలు ఒకటి రెండు రోజులు భగ్గుమని ఆ తరవాత ఆగ్రహ జ్వాలలు చల్లబడే అవకాశం కనిపించడం లేదు. ఇది సుదీర్ఘ పోరాటానికి దారి తీయవచ్చు. పౌరసత్వ సవరణ చట్టం ఆమోదం పొందిన తరవాత నెలకొన్న పరిస్థితులే ఇప్పుడూ నెలకొనే అవకాశమే ఎక్కువగా ఉంది. ప్రతిపక్షాలు ఈ అంశంపై ఎంత తొందరగా కోర్టుకెక్కితే అంత మంచిదని బీజేపీ నాయకులు ఆత్రతపడుతూనే ఉన్నారు. అనుకున్నట్టే కాంగ్రెస్ ఎంపీ జావేద్, మజ్లిస్-ఎ-ఇత్తహాదుల్ ముస్లిమీన్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ శుక్రవారం ఈ బిల్లును సుప్రీంకోర్టులో సవాలు చేశారు. కాంగ్రెస్ ఎంపీ జావేద్ ఈ బిల్లును పరిశీలించడానికి ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. జావేద్, అసదుద్దీన్ విడివిడిగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వక్ఫ్ బిల్లుకి పార్లమెంటు ఆమోదం లభించి ఉండవచ్చు. ఆ ఆమోదం ప్రజామోదం అని అధికార పక్షం గట్టిగా వాదించవచ్చు. పార్లమెంటు ఆమోదించే బిల్లులు రాజ్యాంగానికి అనుగుణమైనవా కాదా అని పరిశీలించే బాధ్యత సుప్రీంకోర్టుకు ఉంది. పార్లమెంటు ఆమోదించినప్పటికీ కొన్ని సందర్భాల్లో వాటిని రాజ్యంగ విరుద్ధమైనవిగా భావించి కొట్టివేసిన సందర్భాలూ ఉన్నాయి.

వక్ఫ్ చట్టాన్ని సవరించి తీరాలన్న కేంద్ర ప్రభుత్వ పట్టుదల ముస్లింల మీద కత్తిగట్టినట్టు ప్రవర్తిస్తున్న ధోరణికి అనుకూలంగానే ఉంది. ముస్లింల, ముఖ్యంగా అణగారిన వర్గాలకు చెందిన ముస్లిం ప్రజల, ముస్లిం మహిళల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం పదే పదే చెప్తూ ఉంటుంది. ఈ బిల్లును ఎంత మంది సమర్థిస్తున్నారో మీకు తెలియడం లేదని మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు వాదిస్తున్నారు. పార్లమెంటులో ప్రతిపక్షాల నుంచి ఎదురైన వ్యతిరేకత తీవ్రతను పరిగణించడానికి మాత్రం కిరణ్ రిజుజు సిద్ధంగా లేరు. పార్లమెంటు లోపల ప్రతిపక్షాల అభిప్రాయాన్ని పరిగణించడానికి సిద్ధంగా లేని రిజుజుకు పార్లమెంటు వెలుపల ఈ బిల్లు ప్రతిపాదించినందుకు హర్షిస్తున్న వారి ముఖారవిందాలు మాత్రం కనిపిస్తున్నాయి. ఈ బిల్లులోని అంశాలు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నాయని ప్రతిపక్షాలు ఎంత గట్టిగా వాదించినప్పటికీ మోదీ ప్రభుత్వం వినిపించుకోలేదు. ప్రజాస్వామ్యంలో మెజారిటీ పక్షం అభిప్రాయానికి అనుకూలంగా నిర్ణయాలు జరుగుతాయన్నది వాస్తవమే. కానీ మెజారిటీ లేని వర్గం అభిప్రాయం పరిగణనలోకి తీసుకోని మెజారిటీ నిర్ణయం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ఒక వేళ అదే నిజం అయితే పార్లమెంటులో చర్చలు అర్థరహితంగా మిగిలిపోతాయి. ప్రతిపక్షాల అభిప్రాయాలను ఆమోదించకపోయినా కనీసం పరిగణించడం ప్రజాస్వామ్య ప్రక్రియలో ఉన్న విశిష్టత. కానీ మోదీ సర్కారు అధికారంలోకి వచ్చిన తరవాత ఈ సూత్రాన్ని పాటించిన దాఖలాలే లేవు. ముస్లింలు కూడా ఈ సమాజంలో విడదీయరాని అంతర్భాగమే అన్న వాస్తవాన్ని గ్రహించడానికి మోదీ ప్రభుత్వం సిద్ధంగా లేదు. అదేమంటే ప్రజలు మాకు అధికారం ఇచ్చారు గనక తాము ఏ నిర్ణయమైన తీసుకోవచ్చునన్న వితండ వాదానికి దిగుతున్నారు. ఈ బిల్లు ముస్లింల మీద తీవ్రమైన వివక్ష చూపుతోంది. అదేమంటే ఇది మత వ్యవహారాలకు సంబంధించిన బిల్లు కాదని, ఇది వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఉద్దేశించిందని ప్రభుత్వం వాదిస్తోంది. ఏ మత సంస్థలను నియంత్రించే వ్యవస్థల్లో ఇతర మతస్థుల వారు ఉండరు. ఉదాహరణకు తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీలో హిందువులు కాని వారు ఒక్కరూ ఉండరు. ఆ ఆలయ నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించే ఎగ్జిక్యూటివ్ అధికారి (సాధారణంగా సీనియర్ ఐ.ఎ.ఎస్. అధికారి) ఒక్క సారి కూడా హిందూయేతరులు లేరు. కానీ వక్ఫ్ నిర్వహణా వ్యవస్థలలో మాత్రం ఇతర మతాలకు చెందిన వారు ఇద్దరు ఉండాలట. ఏ మతం వారైనా తమ మతం పరిధిలోకి వచ్చే వ్యవస్థలను నిర్వహించుకోవడానికి రాజ్యాంగం అవకాశం కల్పిస్తోంది. కానీ మోదీ ప్రభుత్వం వక్ఫ్ విషయంలో మాత్రం ప్రభుత్వ జోక్యానికి అనువుగానే ఈ బిల్లును రూపొందించింది. రైతు ఉద్యమంలాగే ఈ విషయంలోనూ నిరసనోద్యమాలకు ప్రభుత్వం లొంగుతుందా లేక కోర్టు తమకు అనుకూలమైన తీర్పు ఇస్తుందన్న భరోసాతో ఉంటుందో చూడాలి. కానీ పోరాటాలు, కోర్టుకెక్కడాలు మాత్రం తప్పేట్టు లేవు. పౌరసత్వ సవరణ చట్టం విషంలో జరిగిన పరిణామాలు పునరావృతం అయ్యేట్టున్నాయి. వక్ఫ్‌ల నిర్వహణలో అక్రమాలు, అవినీతి లేవని ఈ బిల్లును వ్యతిరేకించే వారు కూడా అనడం లేదు. ఈ అక్రమాలను, అవినీతిని అరికట్టాలన్న ఉద్దేశమే ఉంటే దానికి అనువైన చట్టాలు ఉన్నాయి. ప్రత్యేకమైన చట్టాలు తీసుకొచ్చి ముస్లింల మత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం విద్వేష రాజకీయాల్లో భాగమే. ఇతర మతాల నిర్వహణా వ్యవస్థల్లోని లోపాలు మాత్రం మోదీ ప్రభుత్వానికి కనిపించవు. వక్ఫ్ వ్యవహారం ఆస్తులకు సంబంధించిందే అయితే అనేక మంది బాబాల గుప్పెట్లోకి అపారమైన ఆస్తులు ఎలా వచ్చాయో కూడా ఆలోచించాలిగా!

విఫల ఎత్తుగడలపై లోతైన మథనం అవశ్యం

పల్లవ్‌సేన్‌గుప్తా

భారత్‌లో మావోయిస్టుల రాజకీయ పంథా విఫలమైంది. వీరి విఫల ఎత్తుగడలు, వ్యూహాలపై చిత్తశుద్ధితో లోతుగా మథనం చేయాలి. ప్రస్తుత పరిస్థితి ఈ విధంగా మథించాల్సిన అవసరాన్ని నొక్కిచెపుతోంది. మావోయిస్టు పంథాను క్షేత్రస్థాయి ఎత్తుల పైన గాకుండా, రాజకీయ, భావజాల పరంగా విమర్శనాత్మకంగా తిరిగి సమీక్షించుకుని ఒక నిర్ధారణకు రావాలి. 2023 డిసెంబరులో ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయి. 2024లో భద్రతాదళాలు 194 మంది మావోయిస్టులను హతమార్చారు, 801 మందిని అరెస్టు చేశారు, 742 మంది లొంగిపోయారు. 2025 మొదటి మూడు నెలల కాలంలో రాష్ట్రంలో వివిధ ఎన్‌కౌంటర్లలో 103 మంది మావోయిస్టులు హతమయ్యారు. ప్రధాన మంత్రి మోదీ ఛత్తీస్‌గఢ్ చేరుకునే కొన్ని గంటల ముందు 50 మంది మావోయిస్టులు బీజాపూర్‌లో లొంగిపోయారు. ఈ సంఘటనల ద్వారా మావోయిస్టులు గరిష్టంగా త్యాగాలు చేశారని మనకు స్పష్టమవుతోంది. అయితే ఈ త్యాగాలు ఏమాత్రం సానుకూల ఫలితాలు ఇవ్వలేదు.

ఇండియా చైనా కాదు...

చైనాలో సుదీర్ఘ కాలం పీపుల్స్ వార్ (ప్రజాయుద్ధం) నిర్వహించడం ద్వారా అప్పట వరకు అధికారంలో ఉన్నవారిని దించివేశారు. మావోయిస్టులు చైనాను అనుసరించి సాయుధ విప్లవ పోరాటం దశాబ్దాల పాటు చేశారు. భారత్‌లో పరిస్థితులు చైనాలో విప్లవానికి ముందు ఉన్న పరిస్థితులులా ఉన్నాయని మావోయిస్టులు విశ్వసించారు. చైనాలో కమ్యూనిస్టు పాలనకు ముందు పాలన చాలా బలహీనంగా ఉండడమేగాక, విదేశీ ఆక్రమణలో ఉంది, రైతుల ఆధారిత సాయుధ పోరాటం కమ్యూనిస్టులు ఆనాటి రాజ్యాన్ని ఆక్రమించుకునేందుకు అవకాశం కలిగింది. అనేక కారణాల వల్ల చైనాలో ఉన్న పరిస్థితులతో పోలిస్తే ఇండియాలో చాలా లోపభూయిష్టంగా ఉన్నాయి. చైనాలో ఫ్యూడల్ (భూస్వామ్య) వ్యవస్థ ఉండగా, భారత్‌లో క్రమబద్ధంగా ఎన్నికలు జరుగుతూ, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉంది. పార్లమెంటరీ వ్యవస్థ పరిపూర్ణమైంది గాకపోయినా, వామపక్ష ఉద్యమాలు ప్రభుత్వ విధానాన్ని ప్రభావితం చేసేందుకు న్యాయపరమైన మార్గాలున్నాయి. అయితే మావోయిస్టులకు ఈ అవకాశాలు లేవు. అయితే భారత్‌లో భిన్న కులాలు, మతాలు, ప్రాంతీయ వైవిధ్యాల మూలంగా ఐక్యంగా సాయుధ పోరాటం ఆచరణీయం కాదు. సెంట్రల్ ఇండియా గిరిజన ప్రాంతాల్లో ప్రజలను సంఘటితం చేయడానికి మావోయిస్టు ఉద్యమాలు విఫలమయ్యాయి. అలాగే సామాజిక రాజకీయ వాస్తవాలను మావోయిస్టులు గ్రహించలేకపోయారు.

1940 లలో చైనాలో ఉన్నట్లుకాకుండా భారత్‌లో ఆర్థిక సరళీకరణ తర్వాత పట్టణ ప్రాంతాలలో కార్మిక వర్గం ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సంస్కరణలు ఆకాంక్షించారు. హింసాత్మక తిరుగుబాటును కోరుకోలేదు. అంతేకాదు, మారుతున్న వర్గ క్రియాశీలతను మావోయిస్టులు గుర్తించకుండా కేవలం వ్యవసాయం, విప్లవం పైనే శ్రద్ధ వహించారు. అయితే రైతు సాయుధ పోరాటాన్ని కొనసాగించడానికి శక్తి స్థోమతులు దాదాపు పూర్తిగా తగ్గిపోయాయి.

ప్రభుత్వ అణచివేత- తగ్గిన మావోయిస్టుల ప్రభావం:

పోలీసులు అణచివేయడం, నిఘా వర్గాల కార్యకలాపాలు, అభివృద్ధి ప్రయోజనాలు కొంత మేరకు ప్రజలకు చేరడం తదితరాల వల్ల ప్రభుత్వం అత్యంత క్రూరంగా మావోయిస్టుల తిరుగుబాటును అణచి వేసింది. అగ్రస్థాయి నాయకుల ఎన్‌కౌంటర్‌లు జరిగాయి. (ఉదాహరణకు పశ్చిమ బెంగాల్‌లో కిషన్‌జీని చంపివేశారు.) సామూహికంగా లొంగుబాట్లు జరిగాయి. (ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్) ఇలాంటి ఘటనలతో ఉద్యమ శక్తి సామర్థ్యాలు గణనీయంగా పడిపోయాయి. అదే సమయంలో మావోయిస్టుల హింసాకార్యకలాపాలు ఉదాహరణకి- భద్రతా దళాలపైన ,పౌరుల పైన చివరికి గిరిజనుల్లో అంగీకారం లేనివారిపై దాడులు జరిగాయి. సానుభూతిపరులుగా మారిన వారు కూడా దూరమైపోయారు. ఉద్యమంలో నిరంకుశంగా ఉన్నవారిని ప్రక్షాళన చేశారు. (ఉదాహరణకు పోలీసులకు సమాచారం అందిస్తున్నారని చెప్పేవారు.) ఈ కార్యకలాపాలతో మావోయిస్టుల పైన విశ్వాసం మరింత తరిగిపోయింది. అణగారిన వర్గాల కోసం తాము పోరాడుతున్నామని మావోయిస్టులు చెబుతున్నారు. తరచుగా మావోయిస్టుల ఎత్తుగడలు తాము ఎవరి కోసమైతే పోరాడుతున్నామని చెప్తున్నారో వారికే హాని కలిగించాయి. మావోయిస్టుల ప్రభావం కలిగిన జోన్‌లలో భద్రతా దళాల కార్యకలాపాల మూలంగా వేలాది ఆదివాసీలు అక్కడి నుంచి మరో ప్రాంతానికి వెళ్లిపోయారు. ఒకవైపు భద్రతా దళాల అణచివేతలు, మరోవైపు మావోయిస్టుల బలవంతపు వసూళ్లు ఉద్యమాన్ని మరింతగా దిగజార్చాయి. ఇదే సమయంలో ఎన్నికల రాజకీయాలను తిరస్కరించారు. అలాగే మావోయిస్టుల క్షేత్రస్థాయిని మితవాద శక్తులు ఆక్రమించుకున్నాయి. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలలో మావోయిస్టుల హింసాత్మక ఎత్తుగడలు వామపక్ష శక్తుల

క్రియాశీలత దేశ వ్యతిరేకమైనదని బీజేపీ ఇతర పార్టీలు ప్రజలను నమ్మించేందుకు తోడ్పడ్డాయి. విశాలమైన వామపక్ష ప్రజాస్వామ్య పోరాటాలు బలహీనమై పోయాయి.

విఫలమైన అంతర్జాతీయ మావోయిస్టుల పంథా:

ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో మావోయిస్టు గ్రూపులు తమ రాజకీయాలను పునరాలోచించుకున్నారు. అనేక దేశాలలో మావోయిస్టులు అనుసరించిన సాయుధ పోరాట వ్యూహాలు అనేక సార్లు విఫలమయ్యాయి. అనేక గ్రూపులు హింసాయుత కార్యకలాపాలను వదిలివేసి ప్రధానమైన కమ్యూనిస్టు రాజకీయాలలో చేరిపోయాయి. నేపాల్‌లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు) దశాబ్ది కాలం తిరుగుబాటు పోరాటం చేసింది. చివరకి ఈ పార్టీ రాజకీయ పార్టీగా మారి ఎన్నికల్లో పోటీ చేసింది. ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రజాస్వామ్యయుతంగా పరిపాలన చేసి సాయుధ పోరాటంలో చేసిన దానికంటే ఎక్కువగా సాధించారు.

పెరూలో: పెరూలో బాగా సాగుతున్న మావోయిస్టు పోరాటానికి నాయకత్వం వహిస్తున్న అబిమల్ గజ్‌మన్‌ను ప్రభుత్వం పట్టుకున్న తర్వాత ఇతర గ్రూపులు గణనీయంగా శక్తిని కోల్పోయాయి. పౌరులకు వ్యతిరేకంగా తీవ్రమైన హింసాయుత కార్యకలాపాలను నిర్వహించటం మూలంగా ఈ గ్రూపుల శక్తి బలహీనపడింది.

టర్కీలో: ఈ దేశంలో మావోయిస్టు టీకేపీ/ ఎంఎల్ ఇతర తీవ్ర వామపక్ష సాయుధ గ్రూపులు ప్రజల మద్దతును సాధించటంలో విఫలమయ్యాయి. అదే సమయంలో ప్రభుత్వ భద్రతాదళాలు ఈ గ్రూపుల కార్యకర్తలను దారుణంగా అణచివేయటం, హతమార్చటం జరిగింది. గుర్తింపు కలిగిన వామపక్ష పార్టీలు రాజకీయ వ్యవస్థలో పనిచేశాయి.

ఫిలిప్పీన్స్‌లో: ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీ (సీపీపీ) దాని సాయుధ విభాగం (ఎన్‌పీఏ) అనేక దశాబ్దాల కాలం పోరాటం చేశాయి. అయినప్పటికీ ఏమాత్రం అది విస్తృతి కాకుండా నిలిచిపోయింది. సైనిక ఒత్తిడి మూలంగా భారీగా కార్యకర్తలు లొంగిపోయారు. ప్రజల తోడ్పాటు లేకపోయింది. రాజకీయ తోడ్పాటు లేకపోవడంతో సాయుధ పోరాటం విఫలమైంది. అనంతరం ప్రధాన స్రవంతిలో పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీలోను, ప్రగతిశీల ఉద్యమాలలోను చేరిపోయి పనిచేశారు.

సీపీఐ పిలుపు:

నక్సలైటు ఉద్యమం ప్రారంభం నుంచి పోలీసుల దుర్మార్గాలను హింస, నకిలీ ఎన్‌కౌంటర్‌లను సీపీఐ ఖండిస్తూ వస్తున్నది. అదే సమయంలో సీపీఐ (ఎంఎల్) ఇప్పుడు సీపీఐ (మావోయిస్టు) గ్రూపుల నాయకత్వం విఫలమైన వ్యూహాలను, ఎత్తుగడలను దృష్టిలో ఉంచుకుని ప్రధాన స్రవంతిలో పనిచేస్తున్న కమ్యూనిస్టు ఉద్యమంలో చేరాలని కోరుతూనే ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌కి చెందిన వెంపటపు సత్యనారాయణ, ఆదిభట్ల కైలాసంను అత్యంత దారుణంగా నకిలీ ఎన్‌కౌంటర్ ద్వారా 1970 జులై 11 న హతమార్చారు. పంజాబ్‌కి చెందిన భూజాసింగ్‌ను కూడా చంపివేశారు. వివిధ రాష్ట్రాలలో ఇలాంటి ఘోర కృత్యాలు జరిగాయి. ఈ నేపథ్యంలో సీపీఐ జాతీయ సమితి ఈ హత్యలను ఖండిస్తూ తీర్మానం చేసింది. సీపీఐ (ఎంఎల్) నాయకత్వ తప్పుదారి పట్టి హానికరమైన వ్యక్తిగత, గ్రూపు టెర్రరిజాన్ని నాయకులు, కార్యకర్తలు అనుసరిస్తున్నందున వీటిని వదిలివేయాలని సీపీఐ పిలుపునిచ్చింది. ఇలాంటి హత్యలను నిలిపి వేయాలని పార్లమెంటులోనూ సీపీఐ ఎంపీలు అనేక సార్లు ప్రభుత్వాన్ని కోరారు. 2005లో సాయుధ గ్రూపు అయిన సల్వాజుడుంను ఏర్పాటు చేయడాన్ని సీపీఐ వ్యతిరేకించింది. స్థానిక ఆదివాసీలను సమీకరించడం కోసమే సల్వాజుడుంను ఏర్పాటు చేశారు. 2025 ఫిబ్రవరి 11 న సహజ సిద్ధమైన అడవులను నరికి వేయడానికి ఖనిజాల వనరులను తవ్వుకొనేందుకు కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మావోయిస్టు కార్యకర్తలను నకిలీ ఎన్‌కౌంటర్లు చేసిన దారుణాలను కూడా సీపీఐ పార్లమెంటులో ప్రస్తావించింది. రాజ్యసభలో సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్ ఈ ఎన్‌కౌంటర్లను తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా తమ పంథాను లోతుగా ఆలోచించుకుని మావోయిస్టులు ప్రధాన స్రవంతి కమ్యూనిస్టు ఉద్యమంలో చేరాలని సీపీఐ పిలుపునిస్తోంది.

సీపీఐ జాతీయ కార్యదర్శి

సీపీఐ ప్రధాన కార్యదర్శులు - 7

ఇఎంఎస్. నంబూద్రిపాద్

ఆర్వీ రామారావ్

కమ్యూనిస్టు పార్టీ చీలక ముందు సీపీఐ ప్రధాన కార్యదర్శిగా దాదాపు రెండేళ్లు మాత్రమే ఆ బాధ్యతలు నిర్వర్తించిన వారిలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ ఒకరు. దాదాపు 11 ఏళ్ల పాటు అజయ్ ఘోష్ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆ తరవాత 1962 నుంచి 1964 దాకా అంటే కమ్యూనిస్టు పార్టీ చీలిపోయే దాకా నంబూద్రిపాద్ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 1957 నుంచి 1959 దాకా కేరళ ముఖ్యమంత్రిగా పనిచేశారు. దాదాపు ప్రపంచంలోనే ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన కమ్యూనిస్టు నాయకుడు కూడా నంబూద్రిపాదే. ఈ పరిపాలనానుభవం తరవాతే అజయ్ ఘోష్ అకాల మరణం తరవాత ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. కమ్యూనిస్టు పార్టీ చీలిపోయిన తరవాత కూడా 1967 నుంచి 1969 దాకా నంబూద్రిపాద్ కేరళ ముఖ్యమంత్రిగా పని చేశారు. అప్పుడు సీపీఐ కూడా నంబూద్రిపాద్ మంత్రివర్గంలో ఉండేది. కేరళలో నంబూద్రిపాద్ మొదటి ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తే రెండో సారి ఏర్పాటు చేసిన ప్రభుత్వం అంతఃకలహాల వల్ల కూలి పోయింది.

వామపక్ష రాజకీయాలలో ఉన్న అంతర్గత కలతలను పక్కన పెట్టి చూస్తే నంబూద్రిపాద్ శిఖరాయమానమైన నాయకుడు. ఆయన మార్క్సిస్టు సిద్ధాంతవేత్త. మంచి సాహిత్యకారుడు. సాహిత్య రంగంతో ఆయన అనుబంధం కేవలం రచనకే పరిమితం కాలేదు. ప్రగతిశీల సాహిత్యం అంటే ఎలా ఉండాలో సిద్ధాంత ప్రాతిపదికతో నిరూపించారాయన. సంఘసంస్కర్త. స్వాతంత్ర్య సమరయోధుడు. కేరళలో కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకులలో ప్రధానమైన వ్యక్తి.

కేరళ నంబూద్రీలు ఛాందస వాదులంటారు. నంబూద్రిపాద్ ఆ వర్గంలోనే సంస్కరణల కోసం ప్రయత్నించారు. ఈ లక్షణం ఆయనకు చిన్ననాడే అబ్బింది. 15వ ఏటనే "యోగ క్షేమ సభ"కు

ఇఎంఎస్ నంబూద్రిపాద్

కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయన రాజకీయ జీవితం అప్పటి నుంచే ప్రారంభం అయింది. ఛాందసత్వాన్ని వ్యతిరేకించడం, అంటరాని వారి సంక్షేమం కోసం పాటు పడడం ఆయన సంస్కరణ విధానాల్లో ప్రధానమైనవి. కులాంతర వివాహాలను ప్రోత్సహించేవారు. వితంతు, పునర్వివాహాలకు అండగా ఉండేవారు.



మనుషుల్ని మాయం చేస్తున్నారు

నేను హింస గురించే మాట్లాడదలచుకున్నాను. హింసకు మరో రెండు అక్షరాలు కలిపిన ప్రతిహింస గురించి మాట్లాడాలనుకోవడం లేదు. గుట్టలుగా తెగిపడిన శరీరాలు, వాటిల్లో బుల్లెట్లు ఎలా దూరాయన్న వాస్తవాల గురించే చింతిస్తున్నాను. చెట్లకో, పుట్టలకో వేలాడదీసి కాల్చేయడం అనే అనాగరిక మానవత గురించి చెప్పాలనుకుంటున్నాను. రెండు నెలల క్రితం 40 మంది, అంతకు ముందు 30, ఆ తర్వాత 23, సరికొత్తగా 17. ఇదిసంఖ్యగానే చూడాలనుకోవడం లేదు. ఓ సమస్యగా కూడా పరిగణించాలనుకోవడం లేదు. ఆకలిని, ఆవేదనని, ఆకాంక్షలని, ఆశల్ని, వేకువ జామున తెలతెలవారుతూండగా వచ్చే సూర్యుడ్ని ఆపేయాలనుకోవడం గురించే నా బాధంతా. ఖనిజాల్లో దాగిన నిజాల గురించో, అట్టడుగున పడి కనిపించని బతుకుల గురించో కదా మాట్లాడాలి అంటున్నాను. "వాళ్లకి డబ్బులిస్తే ఏం చేయాలో తెలియదు ఆ రైతులకి" అంటాడు ఓ సినిమాలో తన ఊరి

చక్రవాకం

\- ముక్కాము చక్రధర్

రైతుల గురించి ఓ పెద్దాయన. ఆదివాసీలు కదా... గిట్టుబాటు ధర, రైతు బీమా, రైతు భరోసా, సహకార సంఘాలు, డ్వాక్రా గ్రూపులు, ధోకా లేని బతుకులు... ఇవేవీ వాళ్లకు తెలియని పదాలు. జమిందారు మనీపర్సు మాయంటావా... మిథ్యంటావా అంటాడు ఆ మహాకవి. ఈ మాయ, మిథ్య కూడా వాళ్లకి తెలీదు. ఆదివాసీలు కదా. మన రాతల్లో అంతే వాసులు కదా... వాళ్లు అంతే... వాసులు... ఆదివాసులు.

"చావు అందరికీ సమానమే అయినా
చావు అందరినీ సమానంగా చూడదు
సమా... శ్వాసించదు" అంటాడు శివారెడ్డి. గురూ.. నిజం చెప్పావు. వీళ్లని చావే కాదు బతుకు కూడా సమా శ్వాసించదు. లేకపోతే మైదానాల అడవుల్లో మనం... అడవుల మైదానాల్లో మనిషితనంతో వాళ్లు. ఎంత వెలిగిపోతున్నారు. చుట్టేశారు కదా. ఆ శరీరాలని నీలి వర్ణపు కవర్లలో. శవాలని చుట్టేశాం అనుకున్నారు. ఆకాశపు నీలివర్ణంలో కలిపేశాం అనుకోవడం లేదు. బతుకులు ఈదుస్తున్నామా...!.. ఏడుస్తున్నామా....! ఈదుస్తూ ఏడుస్తున్నామా....! ఏడుస్తూ ఈదుస్తున్నామా....! గ్లాసుడు మద్యానికి బానిసలమా.. రెండు కన్నీటి బొట్లకు బానిసలమా...! బానిసలకొక బానిస.. ఆ బానిసకు మరో బానిస.. మా తాత సత్యనారాయణ మూర్తి పౌరహితానికి బానిస. మా నాన్న కామేశ్వరరావు కోర్టులకి... ప్రైవేట్లు చెప్పడానికి బానిస. నేను సాహిత్యానికి, ఓ విషాదపు మత్తుకు బానిస. మా నాన్నమ్మ సుబ్బసోదమ్మ వంటింటికి బానిస, మా అమ్మ అన్నపూర్ణమ్మ కట్టెల పొయ్యికి బానిస. నా భార్య ఆధునిక పోకడలకు బానిస. నా వారసత్వం సోషల్ మీడియాకి బానిస. ఇక్కడ నేను వ్యక్తిగతం కాదు. సామూహికం. పేర్లు మార్చుకుంటే నువ్వుంటావు. అతనుంటాడు. ఆమె ఉంటుంది. ఎదురింటి వారుంటారు. పొరుగు వారుంటారు. శతాబ్దాల బానిసత్వానికి ప్రతీకలు మనమే.

"చీచీచీ చీనా వాడు చీచీచీ చీనాదాన్ని ప్రేమిస్తాడు" అన్నాడు కదా శ్రీశ్రీ. ఆ చీచీ నేనే అని తెలుసుకోవడానికి ఐదున్నర దశాబ్దాల ఆయుష్షు కరిగిపోయింది. ఇక మిగిలింది బానిసత్వమే కదా. ఆధునికులం కదా. అత్యాధునికులం కావాలి కదా... ఫేస్ బుక్ బానిసలం. వాట్సాప్ బానిసలం. రెండు లైన్ల ముందు థమ్స్ అప్ గుర్తులతో మోకరిల్లితున్నాం కదా. వాళ్లెవరో తెలియని లోకంలో వాళ్లకి బానిసలం. ఐత్‌మాతోవ్ అన్నారో, జర్మని కవి గోథే అన్నారో, చరిత్రకారుడు కోశాంబీ అన్నారో కాని "నువ్వు బతికి ఉన్నావంటే బానిసగానే ఉన్నావని గుర్తుంచుకో". వాళ్లు ఆ బానిసత్వాన్ని ధిక్కరించారు కదా. ఆ బానిసత్వాన్ని ఈసడించుకున్నారు కదా. అసలు బానిసతనం లేకూడదని వాంఛించారు కదా. అందుకే మహావృక్షాలను నరికేసి, కాల్చేసిన దుంగల్లా మార్చేస్తున్నాం. ఆ పసితనంలో అర్థం కాలేదు. ఇప్పుడేమంత జ్ఞానం వచ్చిందని కాదు కాని... "నిన్ను నువ్వు తెలుసుకో " అనే రమణ మహర్షి ఇంకా మన తెలియని తనానికి ఆ గోచితో వెక్కిరిస్తూనే ఉన్నారు. ఆ మహర్షికి తెలిసింది కాని రమణ మహర్షి అచ్చంగా ఆదివాసీయే. కాకపోతే ఆధ్యాత్మిక ఆదివాసీ.

చిన్న సంఘటన ఈ మధ్యనే. రంజాన్ కదా... ఓ మసీదులో నమాజ్ కోసం కాదు కాని దండం పెట్టుకుందుకు వెళ్లా. ఇదివరికెక్కడకూ వెళ్లని వాడిని కదా. ప్రాణ ప్రియురాలి మాట "వెళ్లరా చక్రి. దైవం అన్నింటిలోనూ ఉన్నాడు" అంటే వెళ్లాను. రెండు చేతులతో దండం పెట్టుకుంటూంటే.. ఓ నవ యవ్వన కుర్రాడు "ఇది సరే. మోకాళ్లపై నా పక్కనే కూర్చోండి. నే చేసిందే చేయండి" అన్నాడు. అలాగే చేశాను. "దైవం కనిపించిందా" అన్నాడు ఆ యువకుడు. నేను "సమస్త లోకం కనిపించింది. హింస లేని లోకం కనిపించింది" అన్నాను. "అవును సమస్త లోకమూ కనిపిస్తుంది. ముఖ్యంగా అన్నార్తుల లోకం" అన్నాడు. యశోదమ్మ తన పెంపుడు కొడుకు కృష్ణుడ్ని నోరు ఎందుకు చూపించమందో ఆ క్షణం అర్థం అయ్యింది. విద్యుత్ తీగల కోసం కొమ్మలు నరికేయకండ్రా. ఆదివాసుల నిండు జీవితాలు కోరుకునే వారిని కొమ్మలుగా భ్రమించకండ్రా. అదిగో శ్రీరాముడు అదే చెబుతున్నాడు. రోజుకు ఐదుసార్లు అల్లా అరుస్తున్నాడు. ఏసుక్రీస్తు గంటల వాయిస్తున్నాడు. చంపేయకండి. ప్లీజ్. కన్నీళ్లు ఇంకిపోతున్నాయి. గుండెలు అలిసిపోతున్నాయి. ఇప్పుడే నిర్ణయించుకున్నాను పత్రికలు చదవను. అక్షరాల రక్తపు మరకలను వేళ్లకు అంటించుకోను. టీవీలు చూడను. నా అంతట నేనే కళ్లు ఊడబెరుక్కుని కబోదిని కాలేను. సర్వే జనా బతుకో భవంతు.

\- సీనియర్ జర్నలిస్టు, 9912019929

డ్రగ్స్‌తో పట్టుబడ్డ మహిళా కానిస్టేబుల్

చండీగఢ్: మహిళా పోలీస్ కానిస్టేబుల్ డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్నట్టు సమాచారం అందడంతో ఆమె వ్యక్తిగత వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. డ్రగ్స్‌తో దొరికిపోవడంతో ఆమెను అరెస్ట్ చేశారు. సర్వీస్ నుంచి తప్పించి ఆమె కూడబెట్టిన ఆస్తులపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన పంజాబ్‌లోని భటిండాలో జరిగింది. వివరాల్లోకి వెళితే... పంజాబ్ రాష్ట్రంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మహిళా పోలీస్ కానిస్టేబుల్ అమన్‌దీప్ కౌర్ తన వాహనంలో డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది. పోలీసులు, యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది కలిసి కౌర్ నడుపుతున్న వాహనాన్ని భటిండాలోని బాదల్ ఫ్లైఓవర్ సమీపంలో అడ్డగించారు. తనిఖీ చేయగా గేర్ బాక్స్ వద్ద దాచిన 17.71 గ్రాముల హెరాయిన్ లభించింది. ఆ మహిళా కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేశారు. నిబంధనల ప్రకారం ఉద్యోగం నుంచి ఆమెను తొలగించారు. అమన్‌దీప్ కౌర్‌కు ... మహేంద్ర థార్‌తోపాటు ఆడి, రెండు ఇన్నోవా కార్లు, బుల్లెట్ బైక్, రెండు కోట్ల విలువైన లగ్జరీ ఇల్లు, ఖరీదైన వస్తువులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ అక్రమ వ్యాపారం ద్వారా వాటిని కొనుగోలు చేసిందా అనేదానిపై దర్యాప్తు చేస్తున్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో ఆమెకు అధికారులు ఎవరైనా సహకరించారా అన్న దానిపై కూడా దృష్టిసారించినట్లు పోలీస్ అధికారి తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై విజయ్ పార్టీ నిరసనలు

చెన్నై : వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నటుడు-రాజకీయ నాయకుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ నేతృత్వంలో శుక్రవారం తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. తక్షణమే బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీవీకే ప్రధాన కార్యదర్శి ఎన్.ఆనంద్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఇక్కడ పెద్ద సంఖ్యలో గుమికూడి... పార్లమెంటులో వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ, 'వక్ఫ్ బిల్లును తిరస్కరించండి', 'ముస్లింల హక్కులను లాక్కోవద్దు' అంటూ నినాదాలు చేశారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించి విషయాల్లో కేంద్రం జోక్యం చేసుకోకూడదని, బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 'మైనార్టీలకు ద్రోహం చేయొద్దు', 'లౌకికవాదాన్ని పరిరక్షించండి' అంటూ నినాదాలు చేశారు. మదురై, కోయంబత్తూర్, తిరుచిరాపల్లి, తూటుక్కుడి, తంజావూరుతో పాటు ఇతర నగరాల్లో టీవీకే నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. గురువారం విజయ్ వక్ఫ్ బిల్లును 'ప్రజాస్వామ్య వ్యతిరేకం' అని అభివర్ణిస్తూ, దానిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంకా ఈ డిమాండ్ నెరవేర్చకపోతే, తన పార్టీ ముస్లింలతో కలిసి వారి 'వక్ఫ్ హక్కుల చట్టపరమైన పోరాటం' లో పాల్గొంటుందని తెలిపారు.

సోనియా క్షమాపణ చెప్పాలి
బీజేపీ ఎంపీలు

న్యూఢిల్లీ: వక్ఫ్ బిల్లుపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆమె క్షమాపణ చెప్పాలని బీజేపీ ఎంపీలు లోక్‌సభలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సోనియా నిన్న కీలక వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్ బిల్లును రాజ్యాంగంపై దాడిగా ఆమె అభివర్ణించారు. ఈ బిల్లుతో సమాజంలో శాశ్వత విభజన తీసుకురావడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని ఆమె ఆరోపించారు. లోక్‌సభలో ఈ బిల్లును బుల్డోజ్ చేశారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీలు తీవ్రంగా స్పందించారు. ఆమె వ్యాఖ్యలే రాజ్యాంగంపై దాడిగా ఉన్నాయని ఎదురుదాడికి దిగారు. సోనియా క్షమాపణలు చెప్పాలని శుక్రవారం లోక్‌సభలో పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సమయంలో విపక్షాలు అమెరికా సుంకాల అంశాన్ని లేవనెత్తాయి. సుంకాలపై ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశాయి. ఈ నినాదాల నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

బీజేపీ తమిళనాడు అధ్యక్షురాలు తమిళిసై?

చెన్నై: తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై సంచలన ప్రకటన చేశారు. తాను బీజేపీ అధ్యక్ష రేసులో లేనని చెప్పడం సంచలనంగా మారింది. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అన్నామలై నిర్ణయం ఆశ్చర్యానికి గురిచేసింది. అన్నాడీఎంకే, బీజేపీ మధ్య పొత్తు చిగురిస్తున్న వేళ ఈ ప్రకటన వచ్చింది. గతవారం అన్నాడీఎంకే నేత పళనిస్వామి, పార్టీ ముఖ్య నేతలు ఢిల్లీలో అమిత్ షాతో భేటీ అయ్యారు. పొత్తు నేపథ్యంలోనే అన్నామలై పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, తమిళనాడు బీజేపీ కొత్త అధ్యక్షులు ఎవరనే అంశంపై సందిగ్ధత నెలకొంది. ఈ పదవికి తమిళిసై సౌందర్‌రాజన్ పేరు ప్రధానంగా వినిపిస్తుంది. గతంలో ఆమె తెలంగాణ గవర్నర్‌గా పనిచేశారు. మహిళ కావడం, ఎన్నికల్లో మహిళా ఓట్లు కీలకం కావడంతో పార్టీ ఆమెను అధ్యక్షురాలిగా చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేంద్ర సహాయమంత్రి ఎల్.మురుగన్, కోయంబత్తూర్ మురుగానందం పేర్లు కూడా ప్రధానంగా వినిపిస్తున్నాయి. అన్నామలై చేపట్టిన 'ఎన్ మన్-ఎన్ మక్కళ్' యాత్ర విజయవంతం కావడంలో మురుగానందం కీలక పాత్ర పోషించారు.

నకిలీ ఓటరు గుర్తింపు కార్డులపై
టీఎంసీ నిరసన... ఈసీకి వినతి

- ఆధార్ అనుసంధానంతో మరిన్ని సమస్యలు
- ఎంపీల ఆందోళన

న్యూదిల్లీ : నకిలీ ఓటరు గుర్తింపు కార్డు సమస్యలపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీలు శుక్రవారం పార్లమెంటు ప్రాంగణంలో నిరసన తెలిపారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) కి వినతి పత్రం సమర్పించారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని ఆ పార్టీ పార్లమెంటు సభ్యులు నకిలీ ఓటరు గుర్తింపు కార్డుల (ఈపీఐసీలు) సమస్యను లేవనెత్తారు. ఆధార్ కార్డులను ఎపిక్ కార్డులతో అనుసంధానించవద్దని, నకిలీ ఓటరు గుర్తింపు కార్డుల సంఖ్యను వెల్లడించాలని డిమాండ్ చేస్తూ ఈసీ మొత్తం సభ్యులను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇదే అంశంపై ఈసీ కార్యాలయం నుంచి విజయ్ చౌక్ వరకు... అటుతర్వాత పార్లమెంటు ప్రాంగణానికి నిరసన ప్రదర్శన ఆధార్ కార్డులను ఎపిక్ కార్డులతో అనుసంధానించవద్దని నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎంసీకి చెందిన రాజ్యసభ పార్లమెంటరీ పార్టీ నాయకుడు డెరెక్ ఓబ్రెయిన్ మాట్లాడుతూ 'నకిలీ ఓటర్లు గుర్తింపు కార్డులు ఒక పెద్ద కుంభకోణం. దీనిని ఈసీ లోతుగా పరిశీలించాలి' అని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీలు 'డూప్లికేట్' అని రాసి ఉన్న ప్ల కార్డులను కూడా ప్రదర్శించారు. పార్టీ ఎంపీ కీర్తి ఆజాద్ మాట్లాడుతూ ఇది కేంద్ర ప్రభుత్వం చేసిన పెద్ద కుంభకోణమని అన్నారు. 'ఆధార్ కార్డు నుంచి ఎటువంటి అనుసంధానాలను మేము డిమాండ్ చేయలేదు. రాబోయే 90 రోజుల్లో దీనిపై పని చేస్తామని ఎన్నికల కమిషన్ మాకు తెలిపింది' అని అన్నారు. టీఎంసీ రాజ్యసభ సభ్యురాలు సాగరికా ఘోష్ మాట్లాడుతూ 'ఈ రోజు అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల కమిషన్‌ను సంప్రదించింది. నకిలీ ఓటరు గుర్తింపు కార్డులు (ఎపిక్) సమస్యను చేపట్టాలని కోరుతూ ఎన్నికల కమిషన్‌కు ఒక వినతి పత్రం సమర్పించాం. ఆధార్ కార్డులను ఎపిక్ కార్డులతో అనుసంధానించవద్దని కూడా కోరాం. ఈ రోజు శాంతియుతంగా జరిగిన ప్రదర్శనలో పాల్గొన్నాం. నకిలీ ఎపిక్ కార్డుల అంశాన్ని సభలో లేవనెత్తుతున్నాం. కానీ ఈరోజు అధికార పక్షం, ప్రభుత్వం ఎటువంటి నోటీసు ఇవ్వకుండా సభకు అంతరాయం కలిగించాయి' అని అన్నారు. 'మోదీ ప్రభుత్వం, అధికారపక్షం, బీజేపీ కారణంగా సభ వాయిదా పడింది. ఇది దిగ్భ్రాంతికరం, అధికార పక్షం స్వయంగా పార్లమెంటు కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తోంది' అని విమర్శించారు. 'ఓటర్ల కార్డులను ఆధార్‌తో అనుసంధానించే ప్రతిపాదన సరైనది కాదు. వాటిని పరిష్కరించడానికి బదులుగా మరిన్ని సమస్యలు సృష్టిస్తుంది' అని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు అందించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. అసంపూర్ణ సమాచారం, సరైన డాక్యుమెంటేషన్ లేకపోవడం, నాణ్యత లేని బయోమెట్రిక్‌లతో ఓటరు కార్డులను ఆధార్‌కు అనుసంధానం చేస్తామని ఈసీ ప్రకటించడం ఆందోళన కలిగించిందని టీఎంసీ పేర్కొంది. దీని ఫలితంగా నకిలీ ఆధార్‌లు ఉత్పత్తి అవుతాయని తెలిపింది. తృణమూల్ ఈసీ ముందు చేసిన ప్రధాన డిమాండ్లలో, రాష్ట్ర సరిహద్దులను దాటి అనేక నియోజకవర్గాలలో వివిధ ఓటర్లకు ఒకే ఆల్ఫాన్యూమరిక్ కోడ్ జారీ చేయబడిన నకిలీ ఓటర్ల గుర్తింపు కార్డుల సంఖ్యపై ఒక సంఖ్యను పేర్కొనడం కూడా ఉంది. 'అనేక అభ్యర్థనలు ఉన్నప్పటికీ భారతదేశం అంతటా వ్యవస్థలో ఉన్న మొత్తం నకిలీ ఓటరు గుర్తింపు కార్డుల వివరాలను అందించడంలో విఫలమైంది' అని కూడా వినతి పత్రంలో పేర్కొంది. 'ఆధార్‌ను ఈపీఐసీతో అనుసంధానించడం పూర్తిగా స్వచ్ఛంద ప్రక్రియ అని, అది తప్పనిసరి కాదని ఈసీ తన ఫారమ్ 6బిలో ఎందుకు పేర్కొనలేదు. ఆధార్ నంబర్‌లను క్లోనింగ్ చేయడం వల్ల ఓటర్ల గుర్తింపు కార్డులు, ఎన్నికల నమోదుపై ఎలాంటి ప్రభావం పడకుండా ఈసీ ఎలా నిర్ధారిస్తుంది? టీఎంసీ ప్రశ్నించింది.

నీట్ మినహాయింపు అభ్యర్థనకు రాష్ట్రపతి తిరస్కారం

చెన్నై: వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్ష నుంచి తమ రాష్ట్రాన్ని మినహాయించాలని తమిళనాడు చేసిన అభ్యర్థనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించారు. ఈ విషయాన్ని శుక్రవారం శాసనసభలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. తమ ప్రభుత్వం అన్ని వివరణలు ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నీట్‌ను ఉపసంహరించుకోలేదన్న ఆయన... ఈ వ్యవహారంలో తమిళనాడు చేస్తున్న పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించేందుకు ఈ నెల తొమ్మిదో తేదీన పార్టీలకతీతంగా ఎమ్మెల్యేలందరితోనూ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. నీట్‌కు వ్యతిరేకంగా తమిళనాడు ఎప్పటి నుంచో పోరాటం చేస్తోంది. నీట్ పరీక్ష పత్రాల లీకేజీ, పరీక్ష ఉత్తీర్ణత కాని స్థితిలో కొందరు అభ్యర్థులు బలవన్మరణానికి పాల్పడడం, కోచింగ్‌లకు వెళ్లే స్తోమత లేని విద్యార్థుల పాలిట ఇదొక శాపంగా మారిందనే అభిప్రాయం తమిళనాడులో వ్యక్తమైంది. సామాజిక న్యాయం దక్కాలంటే 'నీట్ వద్దు' అనే నినాదంతో పోరాడుతూ వస్తోంది. నీట్ బదులు 12వ తరగతి మార్కుల ఆధారంగా వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికి తమిళనాడును అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక బిల్లును రూపొందించింది. 2021-22 నుంచి అది పెండింగ్‌లో ఉంది.

ఈ క్రమంలో...2024 జూన్‌లో తమిళనాడు ప్రభుత్వం ఏకగ్రీవంగా నీట్‌ను రద్దు చేయాలంటూ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. అయినప్పటికి కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదు. తాజా ఎదురు దెబ్బపై స్టాలిన్ అసెంబ్లీలో మాట్లాడుతూ... దక్షిణ రాష్ట్రం మరోసారి అవమానానికి గురైందని అన్నారు. 'కేంద్రం... తమిళనాడు అభ్యర్థనను తిరస్కరించవచ్చు. కానీ, మన పోరాటం మాత్రం ఆగదు. న్యాయ నిపుణులతో చర్చించి ఈ నిర్ణయాన్ని సవాల్ చేసే అంశం పరిశీలిస్తాం' అని స్టాలిన్ ప్రకటించారు. పశ్చిమ బెంగాల్ కూడా నీట్‌కు వ్యతిరేకంగా ఓ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. కాంగ్రెస్, ఆర్జేడీ వంటి పార్టీలు కూడా నీట్‌ను మొదటి నుంచే వ్యతిరేకిస్తూ వస్తున్నాయి.

జోక్యం చేసుకోలేం
పిల్లలు సోషల్ మీడియా వినియోగంపై సుప్రీం

న్యూఢిల్లీ: పదమూడేళ్ల లోపు పిల్లలు సోషల్‌మీడియాను వినియోగించకుండా చట్టబద్ధమైన నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఈ మేరకు శుక్రవారం అత్యున్నత న్యాయస్థానం తన నిర్ణయం వెలువరించింది. 'ఇది పాలసీకి సంబంధించిన విషయం. దీనిపై చట్టం చేయమని మీరు పార్లమెంట్‌ను కోరండి. ప్రస్తుతం దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించలేం. దీనికి పరిష్కారం విధానపరమైన నిర్ణయం పరిధిలో ఉంది' అని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిటిషనర్లు సంబంధిత విభాగానికి వినతి చేసేందుకు అవకాశం ఇస్తూ ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. ఒకవేళ ఇప్పటికే సంబంధిత విభాగానికి అర్జీ పెట్టుకొని ఉంటే... వారు దానిని 8 వారాల్లో పరిష్కరించాలని న్యాయస్థానం పేర్కొంది. ఈ పిటిషన్‌ను జెప్ ఫౌండేషన్ దాఖలు చేసింది. సోషల్ మీడియాలో బలమైన వెరిఫికేషన్ వ్యవస్థ ఏర్పాటుచేసేలా కేంద్రం, ఇతరులకు మార్గదర్శకాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరింది. దీంతోపాటు చిన్నారులకు సోషల్ మీడియాలో యాక్సెస్‌ను నియంత్రించాలని విన్నవించింది. పిటిషనర్ల తరపున న్యాయవాది మోహిని ప్రియ వాదించారు. పిల్లల భద్రత కోసం ఏర్పాటుచేసిన నిబంధనలను ఉల్లంఘించిన సోషల్ మీడియా సంస్థలకు భారీగా జరిమానా విధించాలని పిటిషనర్లు న్యాయస్థానాన్ని కోరారు.

అమెరికా నుంచి 682 మంది స్వదేశానికి: కేంద్రం

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి డొనాల్డ్ ట్రంప్... తమ దేశంలో అక్రమంగా నివసిస్తున్నారంటూ వందలాదిమందిని స్వదేశాలకు పంపిస్తున్నారు. సరైన పత్రాలు లేకుండా అక్రమంగా తమ దేశంలోకి వచ్చిన, నివసిస్తోన్న వారిని అమెరికా నుంచి బయటికి పంపిస్తున్నారు. అందులో భాగంగా జనవరి నుంచి 682 మంది భారతీయులు బహిష్కరణకు గురయ్యారు. ఈ విషయాన్ని శుక్రవారం భారత విదేశాంగశాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ పార్లమెంట్‌లో వెల్లడించారు. బహిష్కరణ ముప్పు పొంచి ఉన్న, సరైన పత్రాలు లేక న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటున్న భారతీయులకు మద్దతుగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. 'ఈ బహిష్కరణకు గురైన వారిలో చాలామంది చట్టవిరుద్ధంగా అమెరికాలోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. కానీ వారిని అమెరికా సరిహద్దులోనే అరెస్టు చేసి, వెరిఫికేషన్ తర్వాత భారత్‌కు తిరిగి పంపారు. అయితే దీనివల్ల అక్కడ నుంచి వచ్చే రెమిటెన్స్ (విదేశాల నుంచి భారతీయులు పంపే డబ్బులు)పై ఎలాంటి ప్రభావం ఉండదు' అని మంత్రి వెల్లడించారు.

మహారాష్ట్రలో రైతుల చావుకేకలు
24 ఏళ్లలో 21,219 మంది ఆత్మహత్య

అమరావతి : మహారాష్ట్రలో రైతుల ఆత్మహత్యలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి. అమరావతి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు జిల్లాలలో గత 24 ఏళ్లలో 21,219 మందికి పైగా అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నట్లు అధికారిక నివేదిక పేర్కొంది. ఈ సంఖ్య జనవరి 2001-జనవరి 2025 మధ్య అమరావతి డివిజన్‌లోని అమరావతి, అకోలా, బుల్దానా, వాషిమ్, యావత్మల్ జిల్లాలలో జరిగిన మరణాలకు సంబంధించినదని, ఈ సంవత్సరం జనవరిలో 80 మంది రైతు ఆత్మహత్యలు కూడా ఇందులో ఉన్నాయని తెలిపింది. 24 సంవత్సరాలలో అమరావతి జిల్లాలో 5,395 మంది రైతులు, అకోలా జిల్లాలో 3,123 మంది, యావత్మల్ జిల్లాలో 6,211 మంది, బుల్దానా జిల్లాలో 4,442 మంది, వాషిమ్ జిల్లాలో 2,048 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని నివేదిక వెల్లడించింది. కాగా, జనవరి 2025లో అమరావతి జిల్లాలో 10 మంది రైతులు, అకోలాలో 10 మంది, యావత్మల్‌లో 34 మంది, బుల్దానాలో 10 మంది, వాషిమ్ జిల్లాలో ఏడుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మొత్తం ఆత్మహత్యలలో 9,970 కేసులు (ప్రభుత్వ పరిహారం పొందేందుకు) అర్హత కలిగి ఉన్నాయని, 10,963 అనర్హమైనవి అని, 319 కేసులు విచారణ కోసం పెండింగ్‌లో, 9,740 కేసులలో సహాయం అందించినట్లు నివేదిక పేర్కొంది.

ఎంపురాన్ నిర్మాత కార్యాలయాలపై ఈడీ దాడులు

కొచ్చి/న్యూఢిల్లీ: మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటించిన 'ఎల్2: ఎంపురాన్' చుట్టూ వివాదం కొనసాగుతోంది. ఈ సమయంలో చిత్ర నిర్మాత కార్యాలయాల్లో ఈడీ సోదాలు చేసింది. 2002లో గుజరాత్‌లో చోటుచేసుకున్న అల్లర్లను తప్పుగా సినిమాలో కీలక సన్నివేశాలుగా చూపించారని విమర్శలు వచ్చాయి. ఆపై విలన్ పేరును భజరంగిగా పెట్టడాన్ని తప్పుబట్టారు. బీజేపీ ఎంపీ, మలయాళ నటుడు సురేష్ గోపీ రాజ్యసభలో ఈ సినిమాపై మాట్లాడారు. ఇప్పటికే కొందరు బీజేపీ నేతలు ఈ చిత్రాన్ని బహిష్కరించాలంటూ పిలుపునిచ్చారు. ఇలాంటి సమయంలో నిర్మాతపై ఈడీ దాడులు చేయడం చర్చనీయాంశంగా మారింది. లూసిఫర్2 సినిమాపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో నిర్మాతలలో ఒకరైన గోకులం గోపాలన్ చిట్‌ఫండ్ కంపెనీలో ఈడీ సోదాలు చేసింది. ఆయనకు సంబంధించిన తమిళనాడు, కేరళ కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు చేసింది. సుమారు రూ.1,000 కోట్ల విదేశీ మారక ద్రవ్య ఉల్లంఘన కేసుకు సంబంధించి ఈ సోదాలు జరిగినట్లు తెలుస్తోంది. చెన్నైలోని కోడంబాక్కంలోని గోకుల్ చిట్ ఫండ్స్ కార్యాలయం సహా అనేక ప్రదేశాలలో ఈడీ దాడులు జరిగాయి.

పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎల్2: ఎంపురాన్' బాక్సాఫీస్ వద్ద రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు సుమారు రూ. 240 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసినట్లు తెలుస్తోంది.

ఇంఫాల్ ఉద్రిక్తం
ఎన్‌పీపీ నేత ఇంటి ముట్టడికి మహిళా నిరసనకారుల యత్నం

ఇంఫాల్ : మణిపూర్ రాజధానిలో మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇంఫాల్ వెస్ట్‌లో అపున్‌బా మణిపూర్ ఎమాసింగ్ అధ్వర్యంలో మహిళా నిరసనకారులు నేషనల్ పీపుల్స్ పార్టీ నాయకుడు యుమ్నామ్ జోయ్‌కుమార్ సింగ్ ఇంటిని ముట్టడించడానికి ప్రయత్నించడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. మైతేయి సంస్థ అరంబాయి టెంగోల్ గురించి చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. తన వ్యాఖ్యలను అపార్థం చేసుకున్నారని జాయ్‌కుమార్ అన్నారు. తన పోస్ట్ నుంచి ఆ గ్రూప్ పేరును తొలగించినట్లు ఆయన వివరణ ఇచ్చారు. అయితే మహిళల నిరసనను భారీ పోలీసు బలగాలు అడ్డుకున్నారు. అయితే అధికారులు ఎంపిక చేసిన ప్రతినిధులను జాయ్‌కుమార్‌ను కలవడానికి అనుమతించారు.
కుకీ-మైతేయి సంఘర్షణ, అరంబాయి టెంగోల్ వంటి గ్రూపుల చర్యలను ప్రశ్నిస్తూ జాయ్‌కుమార్ 'ఎక్స్' లో పోస్ట్ చేయడం వల్ల ఈ గందరగోళం తలెత్తింది. ఎన్‌పీపీ యువజన విభాగం తమ విచారాన్ని అరంబై టెంగోల్‌కు తెలియజేసింది. భవిష్యత్‌లో ఇటువంటి అపార్థాలను నివారించాలనే ఉద్దేశాన్ని జాయ్‌కుమార్ వ్యక్తం చేశారు. సంస్థకు, రాష్ట్ర సంక్షేమానికి కట్టుబడి ఉన్న ఇతరులకు తన మద్దతు కొనసాగుతుందని పేర్కొన్నారు.

చైనాను చూచి నేర్చుకోండి: పీయూష్



న్యూఢిల్లీ: చైనాను చూసి నేర్చుకోవాలని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ యువ పారిశ్రామిక వేత్తలకు సూచించారు. స్టార్టప్ మహాకుంబ్ కార్యక్రమంలో తన అభిప్రాయాలను వెల్లడిస్తూ... మన దేశంలోని చాలా అంకుర సంస్థలు (స్టార్టప్స్) ఫుడ్ డెలివరీ, బెట్టింగ్, ఫాంటసీ స్పోర్ట్స్ వంటి యాప్‌లపై ఎక్కువగా దృష్టి పెట్టాయని, కానీ చైనాలోని స్టార్టప్‌లు మాత్రం ఇందుకు భిన్నంగా దూసుకుపోతున్నాయన్నారు. దేశంలో ప్రస్తుతం ఉన్న స్టార్టప్‌లు ఫుడ్ డెలివరీ యాప్స్‌పై దృష్టి పెట్టిన ఫలితంగా దిగువ శ్రేణి కార్మికులు తయారై సంపన్నులు కాలు బయటపెట్టకుండా ఆహారం పొందగలుతున్నారు గానీ అంతకుమించి ఏంలేదన్నారు. చైనా అంకుర సంస్థలు ఏఐ, ఈవీలు, సెమీ కండక్టర్ల రంగాలను ఎంచుకుంటున్నాయని తెలిపారు. భారత్‌లో డీప్-టెక్ స్టార్టప్‌లు పరిమిత సంఖ్యలోనే వస్తున్నాయని, ఆ రంగంలో కేవలం 1,000 స్టార్టప్‌లు మాత్రమే ఉండటం ఆందోళనకరమని అన్నారు. ఇక్కడి యువతరం గొప్ప ఆలోచనలు కేవలం రూ.25 లక్షలు, రూ.50 లక్షలకు విదేశీ కంపెనీలకు అమ్ముడుపోతున్నాయని వాటిని మనం ఉపయోగించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీయూష్ గోయల్ వ్యాఖ్యలపై క్విక్ కామర్స్ సంస్థ జెప్టో సీఈఓ అదిత్ పలిచా స్పందిస్తూ... విమర్శించడం తేలికన్నారు. ప్రస్తుతం జెప్టోలో 1.5 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని... మూడున్నరేళ్ల క్రితం అసలు ఆ సంస్థే లేదన్న విషయాన్ని గుర్తు చేశారు. తాము పన్నులు చెల్లిస్తున్నామని, దేశంలోకి విదేశీ పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. సప్లై చైన్ ను నిర్వహించేందుకు వందల కోట్ల పెట్టుబడులు పెట్టారని తెలిపారు. భారత ఆవిష్కరణల్లో ఇదొక అద్భుతం అన్నారు. అమెజాన్, ఫేస్‌బుక్, అలీబాబా, గూగుల్ వంటి పెద్ద ఇంటర్నెట్ సంస్థలు కూడా కన్స్యూమర్ ఇంటర్నెట్ కంపెనీలుగా ప్రస్థానం మొదలుపెట్టినవే అన్నారు.

వేర్పాటువాదులకు స్వేచ్ఛతో ఇబ్బందులు
భారత్-కెనడా సంబంధాలపై విదేశాంగశాఖ

న్యూఢిల్లీ: భారత్-కెనడా సంబంధాలు తిరోగమన దిశలో ఉన్నాయని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ చెప్పారు. లోక్‌సభలో రాతపూర్వకంగా అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ విషయం వెల్లడించారు. కెనడాలోని వేర్పాటువాదులు, తీవ్రవాదులే ఈ పరిస్థితికి కారణమయ్యారన్నారు. 'కెనడాలో తీవ్రవాదులు, వేర్పాటువాదులకు స్వేచ్ఛ ఇవ్వడమే రెండు దేశాల సంబంధాల తిరోగమనానికి కారణం. ఆ దేశం నుంచి కార్యకలాపాలు సాగించే భారత వ్యతిరేకులపై చర్యలు తీసుకోవాలని కేంద్రం చాలాసార్లు కోరింది. భారత నాయకుల హత్యలను గొప్పగా చిత్రీకరించే వ్యక్తులు, దౌత్యవేత్తలను బెదిరించే వారు, ప్రార్థనా మందిరాలను ధ్వంసం చేసే మూకలు, రెఫరెండం పేరిట భారత విభజనకు మద్దతు పలికే వేర్పాటువాదులను అడ్డుకోవాలని భారత్ కోరింది. అంతర్గత వ్యవహారాల్లో విదేశీ శక్తుల జోక్యం విషయంలోనూ కెనడా తీరు ఆందోళనకరంగానే ఉంది. నిరంతరం భారత అంతర్గత వ్యవహారాల్లో కలుగజేసుకుంటోంది. ఇది అక్రమ చొరబాట్లు, వ్యవస్థీకృత నేర కార్యక్రమాలకు వీలు కలిగించింది. భారత ప్రభుత్వంపై కెనడా చేసిన వ్యాఖ్యలను తిరస్కరిస్తున్నాం. పరస్పర గౌరవం, సున్నిత అంశాల ఆధారంగా కెనడాతో దౌత్య సంబంధాల పునరుద్ధరణకు భారత్ సిద్ధంగా ఉంది' అని కేంద్రమంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వెల్లడించారు. ఖాలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందంటూ నాటి కెనడా ప్రధాని ట్రూడో ఆరోపించడంతో రెండు దేశాల సంబంధాలు దెబ్బతిన్నాయి. భారత నిఘా సంస్థలకు ఎటువంటి ఆధారాలు చూపకుండానే కెనడా సర్కారు నిందలు మోపింది. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది.

'ఆయుష్మాన్ భారత్'లో అక్రమాలు

రంగంలోకి ఈడీ

న్యూఢిల్లీ: కేంద్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకంలో అవకతవకలు జరిగాయి. కాగ్ రిపోర్ట్ ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) చర్యలకు ఉపక్రమించింది. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఈడీ ఏకకాలంలో దాడులకు దిగింది. 2023లో పార్లమెంటులో కాగ్ నివేదిక ప్రవేశపెట్టింది. జార్ఖండ్‌లో ఆయుష్మాన్ పథకం పేరుతో పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలు జరిగిందనేది ఆ నివేదిక సారాంశం. రోగులను చేర్చుకోకుండా, బీమా మొత్తాన్ని మోసపూరితంగా క్లెయిమ్ చేస్తున్నారని పేర్కొంది. కాగ్ తన నివేదికలో దేశంలోని 212 ఆస్పత్రులలో పీఎంజేఏవైలో ఈ అవకతవకలు జరిగినట్లు గుర్తించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయుష్మాన్ భారత్ పథకం కింద మోసపూరిత కార్యకలాపాలు, ఆర్థిక దుర్వినియోగానికి సంబంధించి జార్ఖండ్‌లోని రాంచీ, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలో ఈడీ సోదాలు నిర్వహించింది. పీఎంజేఏవైలోని నెట్ వర్క్ ఆస్పత్రులలో ఎటువంటి వైద్య చికిత్స లేకుండా, ఏ రోగిని చేర్చకుండా చెల్లింపులు జరిగాయని ఆరోపణలు రావడంతో ఈడీ దాడులకు దిగింది. కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుంది. పీఎంజేఏవై పథకం కింద కేంద్రం నిరుపేదలకు మెరుగైన వైద్యం అందిస్తుంది. ఈ పథకంలో రూ.5 లక్షల వరకు ఉచితంగా చికిత్స పొందవచ్చు. ప్రస్తుతం దాదాపు 12.3 కోట్ల కుటుంబాలకు అందుబాటులో ఉంది. తాజాగా కేంద్రం ఈ పథకాన్ని 70 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారికి వర్తించేలా మార్పులకు శ్రీకారం చుట్టింది.

విశాలాంధ్ర
హైదరాబాద్

సన్న బియ్యం పంపిణీని విజయవంతం చేయాలి

మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సన్న బియ్యం పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఇప్పటికే అన్ని మండల, గ్రామ కేంద్రాల్లో నిర్వహించడం జరిగిందన్నారు. స్థానిక మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి కార్యాచరణ ప్రణాళిక మరింత ముందుకు తీసుకుపోవడానికి ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని, అందుకు తగిన విధంగా స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. బియ్యం నాణ్యత, పరిమాణానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని, బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు, పొరపాట్లు జరగకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు.

ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలో 57 శాతానికిపైగా సన్నబియ్యం చౌక ధరల (రేషన్ షాప్) దుకాణాలకు వచ్చాయని, మిగిలిన స్టాక్‌ను రాబోయే రెండు రోజుల్లో పంపిణీ చేయాలని మంత్రి అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా ప్రత్యేకంగా శ్రద్ధ వహించి పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా పౌర సరఫరాల అధికారులు శ్రీనివాస్, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేసవి తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇంటర్ కళాశాలల్లో వేసవి తరగతులు నిర్వహించవద్దని ఇంటర్ బోర్డ్ ప్రకటించిన నిబంధనలకు విరుద్ధంగా శ్రీ చైతన్య, నారాయణ కళాశాలలు వేసవి తరగతులు నిర్వహిస్తున్నాయని, ఇంటర్ బోర్డు ఆదేశాలను పట్టించుకోని శ్రీ చైతన్య, నారాయణ శ్రీ వశిష్ఠ కళాశాలలపై ఇంటర్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని ఇంటర్ కళాశాలలు వేసవి తరగతులు నిర్వహిస్తే ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో ఆయా కళాశాలలపై ప్రత్యక్ష దాడులు చేస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్ జిల్లా దిల్‌షుక్‌నగర్‌లోని శ్రీ చైతన్య, నారాయణ, శ్రీ వశిష్ఠ జూనియర్ కళాశాలలు వేసవి తరగతులు నిర్వహించడాన్ని నిరసిస్తూ ఆయా కళాశాలల వద్ద తరగతుల బహిష్కరణ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మణికంఠ రెడ్డి లక్ష్మణ్ మాట్లాడుతూ ఇంటర్ బోర్డు వేసవి తరగతులు నిర్వహించవద్దని ప్రకటించిన శ్రీచైతన్య, నారాయణ, శ్రీ వశిష్ఠ కళాశాలలు ఇష్టారాజ్యంగా వేసవి తరగతులు నిర్వహిస్తున్నాయని ఆయా కళాశాలల వారు తరగతులు నిర్వహిస్తున్న ఇంటర్ బోర్డు వారు తనిఖీలు నిర్వహించడం లేదని శ్రీ చైతన్య, నారాయణ, వశిష్ఠ కళాశాలలకు అనుమతులు లేకున్నా అనేక కళాశాలలు నిర్వహణ చేశారని ఇంటర్ బోర్డు అధికారుల అండదండలతోనే జూనియర్ కళాశాలలు ఇష్టారాజ్యం వ్యవరిస్తున్నాయని ఇప్పటికే కొన్ని కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్లు కూడా పూర్తయ్యాయని కనీస సౌకర్యాలు లేకున్నా లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని ఇప్పటికైనా ఇంటర్ బోర్డు అధికారులు వేసవి తరగతులు నిర్వహిస్తూ ముందస్తు అడ్మిషన్ నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల ని గుర్తించి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డు ముట్టడిస్తామని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ గ్యార నరేష్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష,కార్యదర్శి చైతన్య యాదవ్, సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, జిల్లా నాయకులు అరుణ్, ఉదయ్, అశ్వన్, శ్రావణి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా వాటర్ సప్లై పథకం ఫేజు - 2 లో భాగంగా పటాన్‌చెరు నుంచి హైదర్‌నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు ఆర్ సి పురం, ఫాదర్ స్కూల్, ఓల్డ్ ముంబయి రోడ్డు ఈ రెండు చోట్ల భారీ లీకేజీ ఏర్పడింది. ఈ లీకేజీలు అరికట్టడానికి మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ఈ పనులు శుక్రవారం రాత్రి 11 గంటల వరకు జరుగుతాయి. కాబట్టి పలు డివిజన్ల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

అంతరాయం ఏర్పడు ప్రాంతాలు:

ఓ అండ్ ఎం డివిజన్ - 6 : ఎర్రగడ్డ, ఎస్.ఆర్.నగర్, అమీర్ పేట్ (లోప్రెజర్ తో నీటిసరఫరా)., ఓ అండ్ ఎం డివిజన్ - 8 : హాఫ్ టేక్ పాయింట్లు, బల్క్ కనెక్షన్లు., ఓ అండ్ ఎం డివిజన్ - 9 : కేపీహెచ్ బీ కాలనీ, కూకట్ పల్లి, భాగ్యనగర్ కాలనీ, వసంత్ నగర్., ఓ అండ్ ఎం డివిజన్ - 15 : ఆర్సీ పురం, అశోక్ నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, దీప్తి శ్రీ నగర్, మదీనాగూడ, మియాపూర్., ఓ అండ్ ఎం డివిజన్ - 24 : బీరం గూడ, అమీన్ పూర్, బొల్లారం. కాబట్టి పైన పేర్కొన్న ప్రాంతాల వినియోగదా రులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని జలమండలి అధికారులు కోరారు.

డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ రైల్వే ట్రాక్ సమీపంలో నిరంతరం రోడ్డుపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ జలమండలి జిహెచ్ఎంసి అలాగే రైల్వే అధికారులను కోరారు. శుక్రవారం ఆయా శాఖల అధికారులతో కలిసి ఆమె గౌతమ్ నగర్ రైల్వే లైన్ సమీపంలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. రాకపోకలు సాగించే ప్రజలకు ఇబ్బంది కలవకుండా డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించే విధంగా పైపుల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ నవీన్, జిహెచ్ఎంసిఐ దివ్య జ్యోతి, రైల్వే అధికారులు, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ పాల్గొన్నారు.

గ్రూప్-1 ఉద్యోగం సాధించిన మల్లేష్ యాదవ్

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఆమనగల్లు మున్సిపాలిటీ 6 వార్డ్ గుర్రం గుట్ట కాలనీకి చెందిన వ్యవసాయదారులైన కావటి యాదయ్య, పార్వతమ్మ కుమారుడు కావటి మల్లేష్ యాదవ్ ఇప్పటికే మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై తన ప్రతిభను చాటుతున్నాడు. వెలువడిన గ్రూప్ 1 మెరిట్ లిస్టులో రాష్ట్రస్థాయిలో 187వ ర్యాంకు, మల్టీజోన్ 2 విభాగంలో 92వ ర్యాంకు సాధించాడు. ఉన్నత ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో గ్రూప్ 1 లో కష్టపడి ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల ఆమనగల్ గుర్రం గుట్ట కాలనీకి చెందిన కావటి మల్లేష్ యాదవ్‌కు 6 వార్డ్ గుర్రం గుట్ట మాజీ కౌన్సిలర్ దివ్య శ్రీకాంత్ సింగ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు బిజెపి నాయకులు మల్లయ్య, శ్రీశైలం యాదవ్, గుజ్జరి శ్రీను, లింగం, బ్రహ్మం, శ్రీనివాస్ చారి, శీను, బాలకృష్ణ, కాలనీ వాసవులు నాయకులు పాల్గొన్నారు.

పగటి కలలు కంటున్న కేటీఆర్: సాయికుమార్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మరో మూడేళ్ళలో బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పగటి కలలు కంటున్నారని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ అన్నారు. కాని వాస్తవానికి మూడేళ్లు కాదు, పదమూడు ఏళ్ళు అయిన వారి పార్టీ అధికారంలోకి రాదనే విషయం వారు గుర్తు పెట్టుకోవాలన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ పదేళ్లలో బీఆర్ఎస్ పాలనలో వారు చేసిన అరాచకం అంత ఇంత కాదని మండి పడ్డారు. రాసుకుంటే రామకోటి, చెప్పుకుంటూ పోతే రామాయణం అంత ఉందని దుయ్యబట్టారు. రాష్ట్ర ఖజానాను దోచుకొని దాచుకొని ఫాం హౌస్ ప్యాలెస్‌లు కట్టుకున్నారని విమర్శించారు. కేటీఆర్ అబద్ధాలను పదేపదే చెప్పి నిజాలుగా నమ్మించే దుర్మార్గమైన ప్రయత్నం చేస్తున్నారని ఇప్పటికైన బీఆర్ఎస్‌ను భారతీయ జనతా రాష్ట్ర సమితిగా మార్చుకోండని చురకలు అంటించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒకే స్క్రిప్ట్ ఫాలో అవుతున్నాయని, బీజేపీ, బీఆర్ఎస్‌లు తలకిందులు తపస్సు చేసిన తెలంగాణ ప్రజలు మిమ్మల్ని నమ్మరనే విషయాని గ్రహించాలన్నారు. సన్న బియ్యం పథకం అమలు చేస్తే బీజేపీ, బీఆర్ఎస్‌లకు కడుపుమంట మొదల్కెందని, వారు లోపాయికారీగా కలసి పని చేయడం కాదు ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కలసి పోటీ చేయాలని లేదంటే బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పనితీరుతో కేటీఆర్ కళ్లలో రక్తం కారుతుందని, వేల కోట్ల భూములు కేటీఆర్ తన బంధువులకు కట్టబెట్టారని ఆరోపించారు. మీ పదేళ్ళ దుర్మార్గాన్ని, అక్రమాలు తప్పక బయట పెడతామని హెచ్చరించారు. పదేళ్లు విద్యార్థి, నిరుద్యోగులను ఇబ్బందులు పెట్టి ఇపుడు మరోసారి వారిని పావులుగా వాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద కేటీఆర్ ముక్కు నేలకు రాసి విద్యార్థి, నిరుద్యోగులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వానికి ఉపాధి కూలీల గోడు పట్టదా!

బీకేయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మొదటినుండి వ్యవసాయ కార్మికుల, ఉపాధి కూలీల గోడును పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు నిశితంగా విమర్శించారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలనే కొనసాగిస్తున్నదన్నారు. ప్రతి సంవత్సరం బడ్జెట్లో గ్రామీణ ఉపాధి నిధులలో కోత పెట్టడం పరిపాటిగా మారిందన్నారు. ప్రభుత్వ బడా పెట్టుబడి దారి కార్పోరేట్ శక్తుల అనుకూల విధానాల వలన నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటి ఏమీ కొనలేని తినలేని పరిస్థితిలో పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు కనీస కూలి రేటు 700 రూపాయలు ఇవ్వాలని దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తుంటే గత సంవత్సరం 300 రూపాయలు ఉన్న కూలీని నామమాత్రంగా కేవలం ఏడు రూపాయలు పెంచి 307 గా నిర్ణయించి ఏప్రిల్ 1వ తేదీ నుండి అమలు పరుస్తామని ప్రకటించి చేతులు దులుపుకోవడం కూలీలను దగా చేయడమేనన్నారు. ప్రకటించిన రేట్లు కూడా అమలు జరిపేందుకు చర్యలు చేపట్టడం లేదని క్షేత్రస్థాయిలో రూ.150 నుండి 200 కూడా కూలి రావడం లేదని, కూలీ డబ్బులు నెల నుండి రెండు నెలల వరకు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని కూలీడబ్బులతో కుటుంబాలను పోషించలేక పడుతున్న బాధలు వర్ణనాతీతమన్నారు. మండుటెండలలో కూలీలు పని చేస్తున్న అధికారులు కనీస సదుపాయాలు కూడా కల్పించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం కూలీ రేట్లు పెంచి వారానికి ఒకసారి వేతనాలు చెల్లించాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

కార్మికుల జీతాలు పెంచకుండా... ఎంపీల జీతాలు పెంచుకోవడం సిగ్గుచేటు

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశ సంపదకు సృష్టికి మూలమైన కార్మికులు, శ్రామికుల కనీస జీతభత్యాలు పెంచలేని అసమర్థ మోడీ ప్రభుత్వం ప్రజాధనంతో రాజ భోగాలు అనుభవించే ప్రధానమంత్రి మంత్రులు ఎంపీల జీతభత్యాలు ఇబ్బడి ముబ్బడిగా పెంచడం సిగ్గుచేటని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్ తీవ్రంగా మండిపడ్డారు. శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ మహబూబ్ నగర్ జిల్లా 12వ మహాసభల సందర్భంగా సిపిఐ కార్యాలయం ఎదుట రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. యూసుఫ్ ఏఐటియుసి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుండి తెలంగాణ చౌరస్తా వరకు కార్మిక ప్రదర్శన నిర్వహించి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భవన్‌లో ఏఐటీయూసీ 12వ జిల్లా మహాసభలు ఘనంగా ప్రారంభమైనాయి. ముందుగా కార్మికోద్యమంలో అశువులు బాసిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కుట్ర పూరిత విధానాల ఫలితంగా దేశ కార్మిక వర్గం తీవ్రమైన శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటీష్ కాలం నుండి పోరాడే సాధించుకున్న 44 కార్మిక చట్టాలను సవరణల పేరుతో మోడీ సర్కార్ కార్పొరేట్ దోపిడీ గుత్త పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తూ కార్మికుల సంక్షేమానికి సమాధి కడుతున్నారని ధ్వజమెత్తారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. విజయ మాల్యా, నీరవ్ మోడీ లాంటి ఆర్థిక దోపిడీదారులకు రాయితీలు కల్పిస్తూ వారి అప్పులను మాఫీ చేస్తుందని వాపోయారు. జాతీయ వార్షిక బడ్జెట్ కేటాయింపుల్లో కూడా అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ నిధికి భారీ కోతలు పెట్టారని అన్నారు. రాష్ట్రంలో మార్పు పేరుతో అధికారంకు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వర్గానికి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల జీవోలకు గెజిట్ చేసి కనీస వేతనం 24వేలు అందేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను, కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడుల రద్దుకై ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఐ మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ మాట్లాడుతూ కార్మిక వర్గం లేకుంటే దేశ అభివృద్ధి శూన్యమని అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా నేతలు పి.సురేష్, బాగీ కృష్ణ యాదవ్, కోటకదిర నరసింహ, ఆంజనేయులు, చెన్నయ్య, శ్రీనివాసులు, రంగయ్య, గోపాల్ నాయక్, దేవానంద్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్షు కార్యదర్శులు భార్గవి, కే.పద్మావతి, పద్మ, ఇందిరా, అంజమ్మ, మంగమ్మ చిట్టెమ్మ, లక్ష్మి, యాదయ్య, శ్రీను, అంజి, సాయి కుమార్, బాలరాజ్, బాలకోటి, నరసింహ, అంజలయ్య, రాములు, హరి, యుగంధర్ రెడ్డి, రామస్వామి, చిన్నయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ఓయూ ప్రొఫెసర్ కాలనీలో అరవై లక్షలు రూపాయలు అంచనా వ్యయంతో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు గాను స్థానిక నాయకులతో కలసి పిఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ, కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్‌లు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు నిత్యం అవసరం అయినా మౌలిక వసతుల ఏర్పాటుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలియజేశారు. కోట్ల రూపాయలు వ్యయంతో అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. ప్రజలు కోరుకొనే విధంగా కాలనిలను అభివృద్ధి చేసే బాధ్యత మాపై ఉందని, నూటికి నూరు శాతం వారు కోరుకొనే విధంగా మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్ పటేల్, సీనియర్ నాయకులు కొసరాజు లక్ష్మణ్, షేక్ చాంద్ పాషా, సుద్దపల్లి విజయ్ కృష్ణ, విజయ్ శర్మ, కరీం లాలా, పెరుక రమేష్ పటేల్, మధు ముదిరాజ్, దీపక్ కచ్చావా, బోయినపల్లి గోపి కృష్ణరావు, కొండల విద్యాసాగర్ రెడ్డి, అరుణ్, శ్రీకాంత్, అజిత్ రెడ్డి, సీహెచ్ సంతోష్, కే సంతోష్, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ చౌదరి, రజనికాంత్, బుడుగు తిరుపతి రెడ్డి, రవి శంకర్ నాయక్, ఎర్ర రాజు, బసవ రాజు, కాట్రగడ్డ బసవ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులు పెడతారా : హరీష్‌రావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్ పై ఎంతగా భయపెట్టాలని చూసినా కూడా మేము మాత్రం అధికార పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తూ ప్రజా క్షేత్రంలో వారి వైఫల్యాలను ఎండగడుతూనే వుంటామని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు స్పష్టం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్ పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. శుక్రవారం ఎక్స్ వేదికగా అయన స్పందిస్తూ హెచ్‌సియూ విషయంలో ప్రభుత్వాన్ని నిలదీసినందుకు విద్యార్థులు, బిఆర్ఎస్ నాయకులు, సోషల్ మీడియా వారియర్స్‌పై అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. తాజాగా శుక్రవారం నాడు నల్లగొండ జిల్లా, మర్తినేని గూడెం మాజీ సర్పంచ్ బండమీది రామును అక్రమంగా పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారన్నారు. ఇలా ఎంతమందిపై కేసులు పెట్టుకుంటూ వెళ్తారు రేవంత్ రెడ్డి అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా ఇదేక్కడి ప్రజాస్వామ్యం అంటూ మండిపడ్డారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కేసులు పెడతారా, ఇదెక్కడి ప్రజాస్వామ్యం ఇదేం ఇందిరమ్మ రాజ్యం అంటూ వ్యాఖ్యానించారు. అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీ పిట్ట బెదిరింపులకు భయపడేది లేదని, రైతులకు, మహిళలకు, విద్యార్థులకు, వృద్ధులకు, దివ్యాంగులకు ఇలా అన్ని వర్గాల ప్రజలకు మీరు ఇచ్చిన హామీలను అమలు చేయించేదాకా బిఆర్ఎస్ పార్టీ వదిలిపెట్టదన్నారు.

ఉద్యోగ జేఏసీ పోరాట కార్యక్రమాల సన్నాహక సమావేశం

విశాలాంధ్ర- హైదరాబాద్: శుక్రవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ సంఘ భవనం, మాసబ్ ట్యాంక్, హైదరా బాద్‌లో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ స్టీరింగ్ కమిటీ ఉద్యమ కార్యాచరణకు సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశానికి రంగారెడ్డి జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ లక్ష్మణ్ అధ్యక్షతన, కన్వీనర్ డాక్టర్ కె.రామారావు నేతృత్వంలో ఏర్పాటు చేసి క్రింది తీర్మానాలు చేయడమైనది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రజా ప్రతినిధుల (శాసనసభ్యులు) కు వినతిపత్రాలు ఇవ్వడం, రంగారెడ్డి జిల్లాలో అందరి ఉద్యోగులతో జిల్లా స్థాయి సదస్సు ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యలు చర్చించి ఉద్యమ కార్యాచరణకు సన్నాహ పరచాలని నిర్ణయించడమైనది. రాష్ట్ర స్థాయిలో మే 4న జరగబోయే సదస్సుకు రంగారెడ్డి జిల్లా నుండి అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొనాలని నిర్ణయించారు. జిల్లా ప్రధాన కేంద్రములో మే నెల 15న నిరసన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర స్థాయిలో జూన్ 9న జరగబోయే మహా ధర్నాకు రంగారెడ్డి జిల్లా నుండి అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొనాలని నిర్ణయించారు. రాష్ట జేఏసీ పిలుపునిచ్చిన పోరాట కార్యక్రమాలలో రంగారెడ్డి జిల్లా నుండి అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొనాలని ఈ స్టీరింగ్ కమిటీ తీర్మానించింది. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా జేఏసీ చైర్మన్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో ఉద్యోగుల జేఏసీని బలోపేతం చేయాలని ఉద్యోగులకు ఉద్యమ పోరాట కార్యమాలను వివరించి అన్ని దివిజినల్‌లో ఉద్యోగులను కలిసి బవిష్యత్తులో జరిగే కార్యక్రమాలకు మద్దతుగా ఉండాలని తెలిపారు. అదేవిదంగా ప్రతి 15 రోజులకు ఒకసారి రంగారెడ్డి జిల్లా విశృత స్థాయి ఎగ్జిక్యూటివ్ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని కోరారు. రంగారెడ్డి జిల్లా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ డాక్టర్ కె.రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగుల జెఏసి ఇచ్చే అన్ని పోరాట కార్యక్రమాలకు రంగారెడ్డి జిల్లాలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనేట్లు సన్నాహక సదస్సులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనేష్ కుమార్ నోరి, టి.జి.ఓ సెక్రటరీ, విజయకుమార్, టి.ఎన్.జి.ఓ సెక్రటరీ, పాండురంగా రెడ్డి, వెంకటప్ప, ఇస్మాయిల్, నూతనపటి వెంకట్, శాంతి శ్రీ, శ్రీనివాస్, రాజేష్, చంద్రశేఖర్ రెడ్డి, నరసింహ, ఆనంద్, రాజేష్ పైలట్ మొదలైన వారు పాల్గొన్నారు.

గ్రూప్ వన్ పేపర్లు దిద్దడంపై అనుమానాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా 563 గ్రూప్ వన్ పోస్టులకు ఫలితాలు ప్రకటిస్తే 500 ర్యాంకుల లోపు ఒక్కరంటే ఒక్క తెలుగు మీడియం విద్యార్థి లేకపోవడం ఆశ్చరంగా వుందని బీఆర్ఎస్ నాయకులు రాకేష్ రెడ్డి అన్నారు. అసలు ప్రభుత్వం 20వేల పేపర్లను దిద్దారా లేక రెండు నిమిషాల్లోనే పేపర్లను కొట్టేశారా అనే అనుమానం కలుగుతుందని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఎన్నికల సందర్భంలో 2 లక్షల ఉద్యోగాలు టీజీపీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని చెప్పారు కాని పరిస్థితులు అందుకు బిన్నంగా వున్నాయని అన్నారు. కృష్ణ దేవరాయలు దేశభాషలందు తెలుగు లెస్స అంటే రేవంత్ రెడ్డి తెలుగు లెస్ అంటున్నారని దుయ్యబట్టారు. 40 శాతం మంది తెలుగు మీడియం అభ్యర్థులు గ్రూప్ వన్ మెయిన్స్ రాస్తే అందులో పది శాతం కూడా పోస్టులు సాధించలేరా అంటూ అశ్చర్యం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తెలుగు భాషను చంపేస్తున్నారని, అసలు తెలంగాణ తల్లిని మార్చింది ఇందుకేనా అనే అనుమానం వస్తుందన్నారు. ఇదే రేవంత్ రెడ్డి వేలాది ప్రభుత్వ తెలుగు మీడియం స్కూళ్లను మూసివేశారు, విద్యాశాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డికి మాతృ భాషపై శ్రద్ధ లేదని, టీజీపీఎస్సి పరీక్షలకు తెలుగు అకాడెమీ పుస్తకాలు ప్రామాణికం కావు అంటున్నారు, రేపు తెలుగు భాషనే ప్రామాణికం కాదంటరేమో అంటూ ఎద్దేవ చేశారు. కేవలం రెండు పరీక్షా కేంద్రాల్లోనే 74 మంది గ్రూప్ వన్ టాపర్లు ఉన్నారని, కేవలం 15 సెంటర్లోనే మొత్తం ర్యాంకులు రావడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. అనేక సెంటర్లలో ఒక్కరికి కూడా రాంక్ రాలేదని, ఓకే మార్కులు వచ్చిన వారు ప్రత్యేకించి కొన్ని సెంటర్ల నుంచే ఉన్నారని, గ్రూప్ వన్ పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయని అభ్యర్థులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గ్రూప్ వన్ ప్రిలిమ్స్‌లో ఒక హల్ టికెట్ నెంబర్, మెయిన్స్‌లో ఇంకో హల్ టికెట్ నెంబర్ ఇచ్చారు, ఎక్కడా ఇలా జరగదని, గ్రూప్ వన్ పరీక్షల నిర్వహణ లో అనేక అవకతవకలు జరిగాయని మాకు అనుమానాలు ఉన్నాయన్నారు. టీజీపీఎస్సి వాళ్ళు కాన్ఫిడెన్షియల్ డాటా ఇస్తున్నారా లేదా కాంగ్రెస్ డాటా ఇస్తున్నారా అంటూ ధ్వజమెత్తారు. గ్రూప్ వన్ పరీక్షల మీద 30, నలభై కేసులున్నాయన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలు పెట్టేందుకు అది అయన రేవంత్ రెడ్డి జాగీరు కాదని, తెలంగాణ పోరాటం ఉవ్వెత్తున ఎగిసి పడ్డ గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ అని గుర్తు చేశారు. ఓవైపు కోర్టులు మొట్టి కాయలు వేస్తున్నా రేవంత్ బుద్ధి మారడం లేదని, హైడ్రా, ఫ్యూచర్ సిటీ ఫిరాయింపులు, హెచ్‌సీయూ కేసుల్లో రేవంత్ రెడ్డికి కోర్టు చెంప పెట్టు లాంటి ఆదేశాలు ఇచ్చిందన్నారు.

ఆర్ఎల్ఐసి, బంకచర్ల ప్రాజెక్టుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం : మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : కృష్ణా, గోదావరి నదులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన రాయల సీమ ఎత్తిపోతల పథకంతో పాటు బంకచర్ల ఎత్తిపోతల పథకం నిర్మాణాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. నిబంధనలకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్మించతల పెట్టిన ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణాలతో తెలంగాణా సాగునీటి ప్రాజెక్టులతో పాటు ఇక్కడి తాగునీటికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉన్నందున సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. శుక్రవారం ఉదయం నీటిపారుదల శాఖా ప్రధాన కార్యాలయం జలసౌధలో ఆయన నీటిపారుదల శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటిపారుదల స్టాండిరగ్ కౌన్సిల్ సభ్యులతో పాటు అడ్వకేట్ జనరల్‌తో త్వరలోనే ప్రత్యేక సమావేశం నిర్వహించి గోదావరి, కృష్ణా నదులలో తెలంగాణాకు న్యాయబద్ధంగా రావాల్సిన వాటాను కాపాడేందుకు సుప్రీంకోర్టులో కేసు వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి నది నీటితో నిర్మించ తలపెట్టిన బంకచర్ల ఎత్తిపోతల పథకం 80,112 కోట్లు అని ఈ ప్రాజెక్టు ద్వారా పోలవరం వద్ద 200టి.యం.సిల నీటిని గోదావరి నీటిని బొల్లపల్లి రిజర్వాయర్, బంకచర్ల హెడ్ రెగ్యులేటట్ ద్వారా రాయలసీమకు మళ్లించ నున్నారని ఆయన వెల్లడించారు. 1980లో జి.డబ్ల్యూ.డి.టి ట్రిబ్యునల్ ఉత్తర్వులు, 2014 ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థికరణ చట్టాలను అక్కడి ప్రభుత్వం ఉల్లంగిస్తోందని ఆయన ఆరోపించారు. కేంద్ర జల వనరుల సంఘం, జీ.ఆర్.యం.బి., కే. ఆర్.యం.బి., ఏపేక్స్ కౌన్సిల్ నుంచి అనుమతులు పొందకుండానే వారు ప్రాజెక్టుల నిర్మాణాలకు పూనుకున్నారని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని 46(2), 46(3) ఆధారంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసమై కేంద్రం నుండి నిధులు పొందేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఇది పూర్తిగా నిబంధనలకు భిన్నంగా ఉందన్నారు. రాయల సీమకు గోదావరి వరద నీటిని మళ్లింపు అంటూ జరిగితే భద్రాచలం వంటి ప్రాశస్త్యం కలిగిన దేవాలయం ప్రమాదపుటంచున పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమంగా నీటిని ఆంధ్రప్రదేశ్ తరలించుకుంటు పోతుంటే బి.ఆర్.ఎస్ ప్రభుత్వం చోద్యంలా చూసింది మినహా అడ్డుకోలేక పోయారని ఆయన విమర్శించారు. నీటిపారుదల శాఖా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు అదిత్యా దాస్ నాథ్,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్‌అండ్ ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఇ.ఎన్.సిలు అనిల్‌కుమార్, విజయ్ భాస్కర్ రెడ్డి సి.ఇ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

డీఎస్సీ ఎస్జీటీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : డీఎస్సీ 2024 ఎస్జీటీ స్పోర్ట్స్ కోటాలో అర్హత పొందిన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో లక్డీకపూల్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ కందిమళ్ల లింగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగ నియామకాలకు శ్రీకారం చుట్టిందని, ముఖ్యంగా ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియను పూర్తి చేశామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులకు డీఎస్సీ స్పోర్ట్స్ కోటా రిక్రూట్మెంట్లో ఉద్యోగాలు రాకపోవడంతో కొందరు అభ్యర్థులు కోర్టులను ఆశ్రయించారని, న్యాయస్థానాలు ఈ ఆరోపణలపై డీఎస్సీ బోర్డును ప్రశ్నించడంతో పాటు ప్రభుత్వం వెంటనే వీటిపై నిగ్గు తేల్చాలని ఆదేశాలిచ్చినా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీంతో స్పోర్ట్స్ కోటా రిక్రూట్మెంట్పై రీవెరిఫికేషన్ చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారని, స్పోర్ట్స్ కోటా ఎస్జీటీ టీచర్ పోస్టుల నియామకాలను రీవెరిఫికేషన్ చేయాలంటూ ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ లిస్టు ఆధారంగా గత నెల 19 నుంచి మూడు రోజులపాటు 393 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను రీవెరిఫికేషన్ పూర్తి చేశారు. డీఎస్సీ రిక్రూట్మెంట్లో స్పోర్ట్స్ కోటా ఎస్జీటీ పోస్టుల నియామకాలను చేపట్టగానే డీఎస్సీలోని క్రీడా విభాగాలను చూసే అధికారులు అలాగే స్పోర్ట్స్ అథారిటీ సిబ్బంది కుమ్మక్కై అనర్హులకు ఉద్యోగాలిచ్చేందుకు పావులు కదిపారన్నారు. దీంతో అర్హులకు కాకుండా డబ్బులు ఇచ్చిన వారికి ఉద్యోగాలు వచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారని వారు ఆరోపించారు. జాతీయస్థాయి పోటీలో పాల్గొన్న అభ్యర్థులు మాత్రమే ఫామ్ 2 సమర్పించాల్సి ఉండగా రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొన్న వారితో కూడా ఫామ్ 2ను సమర్పింపజేసి వారికి ఉద్యోగాలు వొచ్చేలా అక్రమాలకు పాల్పడుతున్నారాన్న విమర్శలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఉపాధ్యక్షుడు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, అభ్యర్థులు రాజేష్, హరికృష్ణ, వెంకటేష్, స్వామి, అనిరుధ్, కిరణ్, ప్రదీప్, నరహరి, విజయ్, ఉమ, జరీనా, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు బిల్లు ఆమోదంపై బీజేపీ సంబరాలు

విశాలాంధ్ర - అమనగల్లు : పార్లమెంటులో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఆమోదించడాన్ని హర్షిస్తూ శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో జాతీయ రహ దారిపై బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. వక్స్ బిల్లు ఆమోదంతో పేద ముస్లింలకు మేలు జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండె హరిప్రసాద్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ మండల బిజెపి మండల అధ్యక్షులు ఎర్రవోలు శ్రీనివాస్, నియోజకవర్గ కో కన్వీనర్ గోరేటి నరసింహ, మున్సిపాలిటీ నాయకులు చెక్కల లక్ష్మణ్, చెన్నకేశవులు, పాషా, ప్రభాకం పాల్గొన్నారు.

వరద నివారణకు సమగ్ర చర్యలు తీసుకోండి

కమిషనర్ ఇలంబర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగరంలో కురిసిన వర్షాలకు హాకీంపేట్ వరద ప్రవాహం వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా శాశ్వత పరిష్కారం చేసేందుకు పూర్తి ప్రణాళికను సిద్ధం చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, ఎస్ఈ రత్నాకర్, ఇతర అధికారులతో కలిసి వరద ముంపుకు గురైన ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, లోటస్ ఫాండ్ నుండి వర్షపు వరద ప్రవాహం హకీంపేట్ నుండి బల్కాం చెరువులోకి వెళుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. గతంలో వరద రాలేదని హెచ్ ఎండిఏ లే ఔట్ చేయడం మూలంగా వర్షం కురిసినప్పుడు వరద వస్తున్నట్లు స్థానికులు తెలిపారు. గతంలో లే ఔట్ చేయక ముందు చెట్లు ఉండటం మూలంగా ఎక్కువ వరద రాలేదని, ఇటీవల కురిసిన వర్షాలకు హకీంపేట్‌కు లేఅవుట్ మట్టితో వరద వస్తుందని తెలిపారు. వరదలో వచ్చిన మట్టిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి డిపిఆర్ తయారు చేసి పంపాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, ఎస్ఈ రత్నాకర్, కార్వాన్, జూబ్లిహిల్స్ ఈఈలు వెంకట శేషాచలం, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

శానిటేషన్ నిర్వహణకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : బహిరంగ ప్రదేశాలలో రోడ్లకు ఇరువైపులా చెత్త వేయరాదని, వేసిన వారికి రూ.1000 జరిమాన విధించ బడుతుందని ఉప కమిషనర్ జి.రాజు తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2024లో భాగంగా మల్కాజిగిరి సర్కిల్‌లో వివిధ ప్రాంతాలలో ముఖ్యంగా ప్రధాన రహదారుల వెంట చెత్త వేసే ప్రాంతాలను గుర్తించి ప్రజలకు అవగాహన కల్పించే విధంగా పలు కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అయినప్పటికి చెత్త వేసిన నేరము కింద రూ.1000 విధించబడు తుందని తెలియజేసే విధంగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా సర్కిల్‌లో పారిశుద్ధ్యం మెరుగుదలకై అనేక చర్యలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. బహిరంగ చెత్త వేయు ప్రాంతాలను గుర్తించి స్థానిక కార్పొరేటర్లు, ప్రజల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం జరుగుతున్నదని, అదే విధంగా పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అడగ్గానే స్వచ్ఛందంగా సైన్ బోర్డు ఏర్పాటుకు ముందుకు వచ్చి 20 సైన్ బోర్డ్స్, 1 సీసీ కెమెరా రూ.35 వేల రూపాయల విలువగల వాటిని అందించి నటువంటి అరుష్ సుజుకి యాజమాన్యం అరుష్ సుజు జనరల్ మేనేజర్ విశేష్ కుమార్ జైస్వాల్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మల్కాజిగి పారిశుద్ధ్యం అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి కేవలం జిహెచ్ఎంసి అధికారులు సిబ్బంది వారే కాకుండా ప్రజలు స్వచ్ఛందంగా పారిశుద్ధ్య చర్యలు పాటించాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలు ఇండస్ట్రీస్ తమవంతుగా సిఎస్ఆర్ (కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ) క్రింద ముందుకు వచ్చి తమ వంతుగా పారిశుద్ధ మెరుగుదలకు అవసరమైన వస్తువులను అందించడానికి సహకరించాలని కోరారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు తమ తమ కాలనీలో బహిరంగం ప్రదేశాలలో చెత్త వేయకుండా కాలనీవాసులకు అవగాహన కల్పించాలని వాట్సాప్ గ్రూప్ ద్వారా అందరికీ సమాచారం అందించాలని కోరారు. సర్కిల్ ఉప వైద్యాధికారి డాక్టర్ కే.మంజుల మాట్లాడుతూ సర్కిల్‌లో బహిరంగ ప్రదేశాలలో చెత్తవేయు ప్రాంతాలు అనేకంగా ఉన్నాయని, తమవంతుగా నేటికీ సుమారు 25 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసామని ఇంకా చేయవలసినవి చాలా ఉన్నాయని, అందుకు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లు, వ్యాపార వేత్తలు ముందుకు వచ్చి సిఎస్ఆర్ (కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ద్వారా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు అవగాహన బోర్డులు గోడలపై చేతివ్రాతలు, పూల మొక్కలు పెంచడం లాంటివి చర్యలు చేపట్టాలని కోరారు. శానిటేషన్ సూపర్‌వైజర్ చింత శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంతో నిరుద్యోగ యువతకు స్వయంఉపాధి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చేందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన రాజీవ్ యువ వికాసం పథకం ప్రకటించడమైనదని, సెలవు దినాలలో కూడా ప్రజాపాలన కేంద్రాలు పని చేస్తాయని, ఆఫ్ లైన్ ద్వారా కూడా ధరఖాస్తు చేసుకోవచ్చని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధికగుప్తా తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమీషనర్లతో జరిగిన టెలికాన్ఫరెన్సులో అదనపు కలెక్టరు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ఎక్కువ మంది నిరుద్యోగులు ఉపయోగించుకోవాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఈ నెల 14 వరకు ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింద న్నారు. ప్రజాపాలన కేంద్రాల వద్ద అన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లో కూడా ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సెలవు దినాలలో కూడా ఈ కేంద్రాలు పని చేస్తాయని ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. ఆఫ్‌లైన్‌లో స్వీకరించిన ధరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేసి జాగ్రత్తగా భద్రపరచాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టరు ఆదేశించారు. కొన్ని మున్సిపాలిటీలలో మైనారిటీ ధరఖాస్తులు ఏమి రానందున, మైనారిటీ వర్గాలలో ఎక్కువ మందికి ఈ పథకం ద్వారా లబ్ధిచేకూరాలని మైనార్టీ వర్గ ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను మత పెద్దలతో మసీదులలో, చర్చిలలోఈ పథకం గురించి ప్రచారం చేయాలని సూచించారు. మున్సిపల్, ఎంపిడిఓ కార్యాలయ స్థాయిలలో ప్రచారం చేసి అధిక సంఖ్యలో ధరఖాస్తులు చేసుకునేల చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. 25 శాతం సింగిల్ ఉమెన్, వితంతులకు, 5 శాతం దివ్యాంగులకు కూడా ఈ పథకంలో కల్పించవలసి ఉన్నందున వారు కూడా ధరఖాస్తు చేసుకునేలా సంబంధిత అధికారులు చర్య తీసుకోవాలని అదనపు కలెక్టరు ఆదేశించారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు రక్షణ పూర్తిగా కరువైందని బీఆర్ఎస్ నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. ముఖ్యంగా గడిచిన వారం రోజుల్లోనే నలుగురు మహిళలపై అత్యాచారణ ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనలు రాష్ట్రంలో మహిళల రక్షణ పరిస్థితి ఏలా వుందో అర్థం అవుతుందని అయన పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ మేడ్చల్ ఎంఎంటీఎస్ మహిళా భోగిలో ఉన్నప్పటికీ మహిళపై అత్యాచారయత్నం జరిగిందని, అలాగే సంగారెడ్డి కందిలో భర్తను కట్టేసి మహిళపై అత్యాచారం జరగగా, నాగర్ కర్నూల్‌లో ఓ గుడి దగ్గర మహిళపై సామూహిక అత్యాచారం, మార్చి 31న జర్మనీ మహిళపై నగరంలోని పహాడీ షరీఫ్‌లో అత్యాచారం ఘటనలు జరిగాయని వివరించారు. రాష్ట్రంలో ఒకేసారి వరుసపెట్టి ఇన్ని అత్యాచారాలు జరగడం మామూలు విషయం కాదన్నారు. ఓవైపు హెూం శాఖ సీఎం.రేవంత్‌రెడ్డి దగ్గరే వుందని, అయినా ఇంత మంది పోలీసులు ఉన్నా ఇన్ని అత్యాచారాలు జరగడంపై ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం వుందన్నారు. ఘోరమైన ఘటనలు జరుగుతున్నా రేవంత్ రెడ్డికి వాటి పై కనీసం సమీక్ష చేసే సమయం కూడా లేకపోవడం గమనార్హం. కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వస్తున్న సీఎం శాంతి భద్రతలపై సమీక్ష ఎందుకు పెట్టడం లేదని నిలదీశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధమైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, కేసీఆర్ హయం లో మహిళల రక్షణకు 331 షీ టీమ్ లు ఏర్పాటు చేయడంతో పాటు 11 లక్షల సీసీ కెమెరాలు పెట్టి పోలీసు వ్యవస్థ ఆధునీకరణకు రూ.770 కోట్ల కేసీఆర్ వెచ్చించారని గుర్తు చేశారు. రేవంత్ పాలనలో క్రమంగా ప్రజలకు పోలీసుల పై నమ్మకం పోతుందని, మహిళలకు రక్షణ కల్పించమంటే రేవంత్ రెడ్డి హెచ్‌సీయూలో 400 ఎకరాలు ఆక్రమించేందుకు పోలీసులను పంపారని ధ్వజమెత్తారు. అక్కడ కూడా విద్యార్థినుల పై పోలీసులు లాఠీలు ప్రయోగించారని విమర్శించారు. అత్యాచార భాదితులను హెూమ్ మంత్రిగా రేవంత్ రెడ్డి పరామర్శించలేదని చివరకు రాష్ట్రంలో మహిళా కమిషన్ ఏం చేస్తోందో అర్థం కావడం లేదని అన్నారు. సీఎం, మహిళా కమిషన్ మౌనంలో అర్థం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు చిరుమళ్ల రాకేష్ కుమార్, అభిలాష్ రంగినేని, తుంగబాలు, అరుణ పాల్గొన్నారు.

ఈనెల 14న సూట్లు, బూట్ల ర్యాలీ

విశాలాంధ్ర-బషీర్ బాగ్: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న బషీర్బాగ్ బాబు జగ్జీవన్ రావ్ విగ్రహం నుండి ట్యాంక్ బండ్ మీ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వరకు "సూట్ల బూట్ల బ్లూ షర్ట్స్ జై భీమ్ ర్యాలీ" నిర్వహిస్తున్నామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ ప్రజా విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో హైదరా బాదులో సూటు బూటు బ్లూ షర్ట్స్ జై భీమ్ ర్యాలీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. భారతరాజ్యాంగ రక్షణే లక్ష్యంగా ఈ ర్యాలీ ఉంటుందని, రాజ్యాంగాన్ని కాపాడుకోవా ల్సిన బాధ్యత ఈ దేశంలోనూ ఉండే సబ్బండ వర్గాల ప్రజలది అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ సూటు బూటు ఈ ర్యాలీలో పాల్గొనాలని అన్నారు. అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ మీసాల మల్లేశం ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సూట్లు బూట్లు బ్లూ షర్ట్స్ జై భీమ్ ర్యాలీ చైర్మన్‌గా డాక్టర్ మీసాల మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్లుగా గజ్జల్లి మల్లికార్జున్, డాక్టర్ బొమ్మెర స్టాలిన్, రింగు రాంబాబు, బోరెల్లి సురేష్, నక్క మహేష్, సాంశాన్ రాజు, చాగంటి చంద్రశేఖర్, మారపాక సాయిలు, వరలక్ష్మి వీరమనీ, చిరుమర్తి రాజు, కోటగిరి ఉషారాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ర్యాలీకి రాష్ట్ర కోఆర్డినేటర్‌గా అంబేద్కర్ సంఘాల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు రాపోలు రాములును ఎన్నుకున్నారు. దేవరకొండ నరేష్, జోగు గణేష్, గుర్రం కోటేష్ పాల్గొన్నారు.

బీజేపీ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఎల్బీనగర్ నియోజకవర్గం మనసురాబాద్ డివిజన్ పరిధిలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా నూతన అధ్యక్షులుగా నియమితులైన వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్, పరాల శేఖర్, సుభాష్ చందర్ జీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్ చంపాపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి, మనసురాబాద్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, ఇతర రాష్ట్ర, జిల్లా, నాయకులతో కలిసి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి నూతన జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో, బలమైన నాయకత్వం ద్వారా పార్టీని పార్టీని ప్రాథమిక స్థాయిలో బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. కష్టపడిన వారికి తగిన పదవులు వరిస్తున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా ఎల్.బి నగర్, శేరిలింగంపల్లి నియోజవర్గాలలో విజయం సాధించే దిశగా కృషి చేయాలన్నారు. సమస్య ఏదైనా కావచ్చు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలతో మమేకమై ఉండాలన్నారు. మీకు అండగా మేమున్నామని పోరాడి గెలుదామన్నారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, కొత్త కార్యాలయం ప్రజలతో పార్టీకి మధుర సంబంధాలను మరింత బలపరచేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలలో బీజేపీ విజయాన్ని సాధించేందుకు కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

రిజర్వేషన్ బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చేలా అన్ని రాజకీయ పక్షాలు కృషి చేయాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: బీహార్, తెలంగాణ రిజర్వేషన్, బిల్లులను రాజ్యాంగ 9వ షెడ్యూల్‌లో చేర్చేలా అన్ని రాజకీయ పక్షాలు ఓబీసీ సంఘాలు కృషి చేయాలని రాజ్యసభ ఎంపీ. పి.విల్సన్ అన్నారు. ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్, బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం, ఛాత్ర ఆర్జేడీ, స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ద్రవిడియన్స్, రిజర్వేషన్ క్లబ్- సంయుక్తంగా ఆధ్వర్యంలో కుల జనగణన, ఓబీసీ రిజర్వేషన్లు, రాజ్యాంగ పరిరక్షణలు, సామాజిక న్యాయాన్ని లోతుగా అభివృద్ధి చేసేందుకు చర్యా- ప్రణాళిక అనే అంశంపై జాతీయ స్థాయిలో న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ ఎంపీ. పి.విల్సన్, ప్రొ. సురజ్ మండల్ ప్రొఫెసర్ రతన్ లాల్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ సలహాదారు ఆళ్ల రామకృష్ణ, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, పండితులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు బీసీ సంఘాలు మనసు కలిసిన సంస్థలు ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ సలహాదారు ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి సంఘాల ఐక్యత ఓబీసీల ఉద్యమాన్ని మరింత బలపరిచేలా చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ప్రొ.సురజ్ మండల్, ప్రొఫెసర్ రతన్ లాల్, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయడంలో మేధావుల పాత్ర అత్యంత ప్రాముఖ్యమైనదని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు జి. కిరణ్ కుమార్, ఇళయ కుమార్ (ఎస్ఎఫ్డీ) రితు అనుపమ (రిజర్వేషన్ క్లబ్), అక్షన్ రంజన్ (ఛాత్ర ఆర్జేడీ), పంకజ్ కుష్వాహ్, మహేశ్, రితు, రాకేష్ పాల్గొన్నారు.

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ప్రచారం ప్రారంభం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : మహనీయుల ఆశయాలను కాపాడటంతో పాటు ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి దేశ వ్యాప్తంగా జై-బాపు, జై-భీమ్, జై-సంవిధాన్ ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. తెలంగాణ కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షులు చల్లా నరసింహ రెడ్డి నేతృత్వంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశం శుక్రవారం శేరిలింగంపల్లి, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మదీనగూడా కిన్నెర గ్రాండ్ హెూటల్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి జనరల్ సెక్రటరీ, కనెక్ట్ సెంటర్ ఇంచార్జ్ దుర్గం భాస్కర్, ఏఐసీసీ కోఆర్డినేటర్ పులి అనిల్ కుమార్, చేవెళ్ల/శేరిలింగంపల్లి నియోజకవర్గ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ టీపీసీసీ కోఆర్డినేటర్ చైర్మన్ శ్రీ.గుత్తా అమిత్ రెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్, చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జ్ భీమ్ భరత్, కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, పూజిత గౌడ్ పాల్గొని నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ సందేశని కాంగ్రెస్ పార్టీ నాయకులు వివరించి, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతూ గౌరవిస్తూ పాలన చేయాల్సిన పాలకులు నేడు వ్యవస్థలను నాశనం చేస్తూ తమ ఆధీనంలోకి తీస్కొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని కలరాస్తున్నదని అన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను, మన రాజ్యాంగాన్ని అవమానించే బీజేపీ దాని అనుబంధ సంస్థల దాడులను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

పురాతన ఇస్లామిక్ స్మశానవాటికను పునర్నిర్మించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : సౌదీ అరేబియాలోని మదీనాలో ఉన్న పురాతన ఇస్లామిక్ స్మశానవాటిక (జన్నత్-ఉల్-బాకీ)ని పునర్ నిర్మించాలని అంతర్జాతీయ షియా పండితుడు నజాఫ్ ఇరాక్ విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ సుబ్రమణ్యం జైశంకర్, కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు, న్యూఢిల్లీలకు లేఖలు పంపుతామని తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ స్మశానవాటికలో సుమారు 7 వేల మంది ఇస్లామిక్ ప్రముఖులను ఖననం చేశారన్నారు. ముఖ్యంగా, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం కుటుంబం, అనుచరులు సమాధి చేయబద్దారన్నారు. జన్నత్-ఉల్-బకీని 1926లో వహాబీ సౌదీ పాలకులు కూల్చివేశారన్నారు. భారత్‌లోని సౌదీ అరేబియా రాయబారితో చర్చలు ప్రారంభించాలన్నారు. ఐక్యరాజ్యసమితి సంస్థతో జన్నత్-ఉల్-బాకీని పునర్నిర్మించే విషయాన్ని చేపట్టాలని భారత ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. మహమ్మద్ ప్రవక్త కుమార్తె హజ్రత్ బీబీ ఫాతిమా-తుస్-జెహ్రా(లు) కొంతమంది ఇమామ్‌లు, ఇమామ్ హసన్, ఇమామ్ జైన్-ఉల్-అబిదీన్, ఇమామ్ మొహమ్మద్ బాకర్, ఫాబిన్-ఇమామ్, అసద్-ఇమామ్ అలీ, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తల్లి, మేనమామలు అక్కడ ఖననం చేయబద్దారన్నారు. ఈ సమావేశంలో మౌలానా షేక్ మొహమ్మద్ అబ్బాస్ పంజు, మౌలానా సయ్యద్ మొహెబ్బే అబేద్, మౌలానా సయ్యద్ ఫయాజ్ హుస్సేన్, మీర్ ఫిరాసత్ అలీ బక్రీ, సయ్యద్ అలీ హుస్సేన్ జైదీ, మీర్ రజా అలీ సోహైల్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి : వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాస్థానంలో జరిగిన శ్రీమదలర్మేల్ మంగా పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల 34వ వార్షిక బ్రహ్మోత్సవం కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని వెంకటేశ్వరస్వామి వారి కృపా కటాక్షాలతో ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండలని, స్వామి వారి కృపా ప్రజలందరిపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ కాలనీ ప్రెసిడెంట్ వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, దేవినేని ప్రసాద్, నాని నాయకులు సంజీవ రెడ్డి, నాయి నేనీ చంద్రకాంత్‌రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, కృష్ణంరాజు, మల్లయ్య, అల్లం మహేష్, హరికృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు చంద్రబాబు వెన్నుపోటు: నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాజ్యాంగానికి విరుద్ధమైన వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతివ్వడంతో ముస్లింలను సీఎం చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని మాజీ మంత్రి, వైసీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున వ్యాఖ్యానించారు. దీనిపై ముస్లింల ఆగ్రహాన్ని గ్రహించే ఆయన ఇప్పుడు దృష్టి మళ్లింపు రాజకీయాలు చేస్తున్నారన్నారు. నాగార్జున శుక్రవారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుపై చంద్రబాబు అబద్ధాలకు అంతులేదని విమర్శించారు. మైనారిటీలను ఓటు బ్యాంకుగా వాడుకు న్నారని, వక్ఫ్ బిల్లుకు మద్దతివ్వడం ద్వారా తన నిజస్వరూపాన్ని బయట పెట్టుకున్నారని వ్యాఖ్యానించారు. టీడీపీ ద్రోహాన్ని ముస్లింలు ప్రశ్నిస్తుం డటంతో చంద్రబాబు తనకు అలవాటైన డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నా రన్నారు. రాజ్యసభలో వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ ఎంపీలకు వైసీపీ విప్ జారీ చేయలేదని, బిల్లుకు మద్దతిచ్చిందని తమ పార్టీపై తప్పుడు ప్రచారం జరుగుతోందని తెలిపారు. తమ పార్టీ ఉభయ సభల్లో ఈ బిల్లును వ్యతిరేకించిందన్నారు.

లౌకిక వ్యవస్థకు చీకటి రోజులు

- వక్ఫ్ బిల్లుకు ఆమోదంపై నారాయణ
- హెచ్‌సీయూ భూముల జోలికి వెళ్లొద్దని తెలంగాణ ప్రభుత్వానికి హితవు

న్యూఢిల్లీ: వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లును ప్రతిపక్షాలు ముక్తకంఠంతో వ్యతిరేకించినప్పటికీ మోదీ ప్రభుత్వం పంతం నెగ్గించుకున్నదని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. వక్ఫ్ బిల్లును పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించడంతో లౌకిక వ్యవస్థకు చీకటి రోజులు వచ్చినట్టేనని వ్యాఖ్యానించారు. నారాయణ శుక్రవారం సీపీఐ కార్యదర్శి అజీజ్ పాషాతో కలిసి ఢిల్లీలోని పార్టీ కార్యాలయం అజయ్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటు సమావేశాలను అధికార పక్షం రెండు రోజులు బుల్డోజ్ చేసిందని దుయ్యబట్టారు. 'మోదీ రాజ్యంలో రాజ్యాంగానికి ఏం విలువ ఉంది. మత ఘర్షణల ముప్పు ఏర్పడింది. ఆర్‌ఎస్‌ఎస్ ఏనాడు స్వాతంత్ర్యం కోసం పోరాడలేదు. లౌకిక వ్యవస్థను నాశనం చేసే హక్కు వీరికి ఎక్కడిది? పార్లమెంటు ఆమోదించినప్పటికీ వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సీపీఐ పోరాటం కొనసాగుతుంది' అని నారాయణ తెలిపారు. తెలంగాణలో చర్చనీయాంశంగా మారిన హెచ్‌సీయూ భూ వివాదాన్ని ప్రస్తావించారు. ఈ భూముల జోలికి వెళ్లమని రేవంత్ ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూములను వ్యాపార వస్తువుగా చూడొద్దని హితవు పలికారు. ఈ అంశం ఇప్పుడు సుప్రీంకోర్టు ముందుకు వచ్చిందన్నారు. ఇందిరాగాంధీ హయాంలో హెచ్‌సీయూకు భూములు కేటాయించారని గుర్తుచేశారు. భూముల ధరలు పెరగడంతో అందరి కన్ను వీటిపై పడిందని నారాయణ వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేర్ ఆసుపత్రి వారు ఈ భూములను కోరితే అవి విద్య వ్యవస్థ కోసం కేటాయించినట్లు అప్పట్లో స్పష్టంగా చెప్పారన్నారు. 'జనాభా పెరుగుతుంది కానీ భూమి పెరగదు కదా... విద్య కోసం కేటాయించిన భూములను వాటి కోసమే వినియోగించాలి' అని నారాయణ అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఈ భూములు ఇవ్వలేదని, ఆ రాష్ట్ర ప్రభుత్వం వీటి విషయంలో పునరాలోచించాలన్నారు. 'విద్యార్థులను కొడుతుంటే.. భూముల అమ్మే ప్రయత్నం చేస్తే ఊరుకుంటామా! రాజకీయాలు వేరు... మిత్ర బంధాలు వేరు. ప్రస్తుత సమస్య వేరు. ఎవరికి శాశ్వత మిత్రులు... శత్రువులు ఉండరు. భూముల విషయంలో మేము చెబితే తెలంగాణ ప్రభుత్వం వింటుందా! మేము మా అభిప్రాయాన్ని చెప్పాం' అని నారాయణ వ్యాఖ్యానించారు.

మణిపూర్ ఐక్యత, శాంతికి కట్టుబడ్డాం: సంతోశ్ కుమార్

న్యూఢిల్లీ: గిరిజన తెగల మధ్య హింసతో అట్టుడికిపోతున్న ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో శాంతి నెలకొల్పేందుకు సీపీఐ కట్టుబడి ఉందని ఎంపీ పి.సంతోశ్ కుమార్ అన్నారు. రాజ్యసభలో మాట్లాడిన ఆయన మణిపూర్ విషయంలో బీజేపీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నిర్లక్ష్యాన్ని నిలదీశారు. అర్ధరాత్రి తీర్మానాలతో పార్లమెంటును, ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ తెల్లవారుజామున 3 గంటలకు తీర్మానించారని దుయ్యబట్టారు. మోదీ ప్రభుత్వ వైఫల్యాలను సీపీఐ ఎంపీ ఎండగట్టారు. పాలకుల జవాబుదారీతనాన్ని ప్రశ్నించారు. జననేత హీజం ఇరావత్ వారసత్వాన్ని సీపీఐ సంతరించుకున్నదన్నారు. మణిపూర్ ఐక్యతా, శాంతి సాధనకు ఏ అవకాశాన్ని వదలదని సంతోశ్ కుమార్ నొక్కిచెప్పారు. సమస్యలన్నీ పరిష్కారమయ్యేంత వరకు మణిపూర్ పక్షాన పోరాడుతుందని అన్నారు. మణిపూర్ సమస్యల పరిష్కారం కోసం జవాబుదారీ తనంతో, చిత్తశుద్ధితో పని చేయాలని కేంద్రానికి సంతోశ్ కుమార్ హితవు పలికారు.

దేశ సమగ్రత కాపాడేలా పునర్విభజన

సీపీఎం జాతీయ మహాసభలో కీలక తీర్మానాలు

మదురై : నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ (డీలిమిటేషన్) సమానత్వ ప్రాతిపదికన న్యాయసమ్మతంగా దేశ సమగ్రతను కాపాడేలా చేపట్టాలని సీపీఎం జాతీయ మహాసభ డిమాండ్ చేసింది. సీతారాం ఏచూరి నగర్ (మదురై)లో జరుగుతున్న ఆ పార్టీ 24వ అఖిల భారత మహాసభలో మూడో రోజు వివిధ అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. కొన్ని కీలక అంశాలపై తీర్మానాలను మహాసభ ఆమోదించింది. మహాసభ తీర్మానాలను సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎండీ సలీం మీడియాకు వివరించారు. వీటితో పాటు రాజకీయ తీర్మాన ముసాయిదాపై మహాసభలో చర్చలు జరుగుతున్న తీరును కూడా ఆయన వివరించారు. ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేస్తూ, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న కేరళలోని వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. మహాసభ మూడవ రోజైన శుక్రవారం ఐదు తీర్మానాలను చర్చించి ఆమోదించినట్లు చెప్పారు.

– పార్లమెంట్‌లో ఏ రాష్ట్రానికైనా ప్రాతినిధ్యం తగ్గించే విధంగా జరిపే డీలిమిటేషన్ ప్రక్రియను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. కీలకమైన విషయంలో రాజకీయ పార్టీలతో, రాష్ట్ర ప్రభుత్వాలతో విస్తృతంగా సంప్రదింపులు జరపాలి. జనాభా నియంత్రణ విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాల ప్రయోజనాలను తప్పకుండా రక్షించాలి. పార్లమెంటు ప్రాతినిధ్యాన్ని విస్తరించేందుకు సీట్ల సంఖ్యను నిష్పత్తి ప్రకారం పెంచాలి. ఈ తీర్మానాన్ని పొలిట్‌బ్యూరో సభ్యులు జి.రామకృష్ణన్ ప్రతిపాదించగా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి సంజయ్ చౌహాన్ బలపరచారు.

– 2021లో జరగాల్సిన జనగణన ఇప్పటివరకు నిర్వహించకపోవడం పట్ల సీపీఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సమాజంలోని పీడిత వర్గాలకు న్యాయం జరగాలంటే, 2021 నుంచి వాయిదా పడుతున్న జనగణనతో పాటే కులగణన కూడా నిర్వహించాలని డిమాండ్ చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్ర కమిటీ సభ్యులు అవదేశ్‌కుమార్ ప్రతిపాదించగా, టి.జ్యోతి బలపర్చారు.

– ఎన్నికల కమిషన్ స్వతంత్రత, సమగ్రత, పారదర్శకతలను కాపాడాలని, ఎన్నికల ప్రక్రియలో అన్ని పార్టీలకు సమాన అవకాశాలు ఉండాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మహాసభ ఆమోదించింది. గత దశాబ్ద కాలంగా భారత ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర ఆందోళన, ఆవేదనలను వ్యక్తం చేసింది. ఎన్నికల విధానం పూర్తిగా పారదర్శకత కోల్పోయిందని, రాజ్యాంగ విరుద్ధంగా మలచబడిందని, డబ్బు ఉన్న పార్టీలకు లాభదాయకమైనదిగా మారిందని తీర్మానం పేర్కొంది. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, పారదర్శకంగా పనిచేయాలని కోరింది. దీనిని పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు ప్రవేశపెట్టగా, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వీ శ్రీనివాసరావు బలపర్చారు.

– ఆర్ఎస్ఎస్–బీజేపీ ప్రతిపాదిస్తున్న 'ఒక దేశం– ఒకే ఎన్నిక' విధానం దేశ ప్రజాస్వామ్యానికి తీవ్రమైన హాని కలిగిస్తుందని సీపీఎం పేర్కొంది. ఈ మేరకు ఆమోదించిన తీర్మానంలో ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపింది. వారి ఇతర నినాదమైన "ఒక దేశం, ఒక మతం, ఒక భాష, ఒక సంస్కృతి, ఒక నాయకుడు" అనే విధానం యొక్క పొడిగింపుగానే దీనిని చూడాలని తెలిపింది.

ఇళ్లపట్టాల పంపిణీ తొలి అడుగు...

మంగళగిరిని నం.1గా తీర్చి దిద్దుతా
మంత్రి నారా లోకేశ్

విశాలాంధ్ర–మంగళగిరి: ఇళ్ల పట్టాల పంపిణీ తొలి అడుగు మాత్రమేనని, అన్ని రంగాల్లో మంగళగిరిని దేశంలోనే నం.1గా తీర్చిదిద్దుతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. 'మన ఇల్లు–మన లోకేష్.. పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మంగళగిరి డాన్ బాస్కో ఉన్నత పాఠశాల పక్కన ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సభలో ఎర్రపాలెం, నీరుకొండ, మంగళగిరి రత్నాలచెరువుకు చెందిన 546 పేద కుటుంబాలకు శాశ్వత ఇళ్ల పట్టాలను మంత్రి లోకేశ్ స్వయంగా బట్టలు పెట్టి మరీ అందజేశారు. దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న ఎర్రబాలెం గ్రామానికి చెందిన 248 మంది, నీరుకొండకు చెందిన 99 మంది, మంగళగిరి రత్నాలచెరువుకు చెందిన 199 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... "ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది. 2019లో మంగళగిరిలో పోటీచేయాలనే ఐడియా వచ్చింది. నాకు పరిచయం లేని నియోజకవర్గం ఇది. 21 రోజుల ముందు నాకు టికెట్ ఇచ్చారు. నేనేంటో మీకు తెలియదు, మీ సమస్యలేంటో నాకు అర్థం కాలేదు. 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయా. దాంతో కసి పెరిగింది. ఓడిపోయిన రెండో రోజు నుంచే కష్టపడి మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకోవాలని ఆనాడే నిశ్చయించుకున్నాను. ప్రతిపక్షంలో ఉన్న ఐదేళ్లు మీకోసమే అహర్నిశలు కష్టపడ్డా. 26 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ఎన్టీఆర్ సంజీవని పెట్టి ఉచితంగా వైద్యం అందించాం. ఇంట్లో పెళ్లి జరిగితే బట్టలు పెట్టాం. నీటి సమస్య ఉంటే వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు అందించాం. నైపుణ్య శిక్షణ అందించి యువతకు ఉద్యోగాలు కల్పించాం. సొంత నిధులతో మంగళగిరి ప్రీమియర్ లీగ్‌ను ఏర్పాటుచేసి క్రికెట్‌ను ప్రోత్సహించాం. వర్షాకాలంలో గ్రామాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోతే గ్రావెల్, డస్ట్ అందించాం" అని చెప్పారు. ఫలితంగా 2024 ఎన్నికల్లో మంగళగిరి ప్రజలు చరిత్ర తిరగరాశారని... భారీ మెజారిటీ కట్టబెట్టి తనను శాసనసభకు పంపారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ గుంటూరు జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, షేక్ రియాజ్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకి దేవి, సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ తోట పార్థసారథి, టీడీపీ నాయకురాలు ఆరుద్ర భూలక్ష్మి, మంచికలపూడి వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభల పోస్టర్‌ను ఢిల్లీలోని సీపీఐ కార్యాలయం అజయ్ భవన్‌లో మహాసభ ఆహ్వాన సంఘ అధ్యక్షుడు, సీపీఐ కార్యదర్శులు కె.నారాయణ, అజీజ్ పాషా, రామకృష్ణ పాండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి సుఖేందర్ మహేసరి, ఆర్.తిరుమలై రామన్ మాట్లాడుతూ యువతను అన్ని రకాలుగా మోసం చేస్తున్న పాలకులపై ఉద్యమించడానికి ఈ మహాసభలు వేదిక కానున్నాయన్నారు. మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చినా ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదని, ఆయన లెక్కన ఇప్పటికి 24 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కాషాయ మతోన్మాదాన్ని విద్యార్థులు, యువతకు నూరిపోసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంస్కరణలు జరగాలని, సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలని, భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తేవాలని డిమాండ్ చేశారు. మే 15–18 తేదీల్లో ఆంధ్రప్రదేశ్, తిరుపతిలో జరగబోయే మహాసభలను విజయవంతం చేయాలన్నారు. దేశ–విదేశాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విధానాలపై నిర్దిష్ట చర్చలకు మహాసభల్లో కార్యాచరణ రూపొందుతుందని నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి లెనిన్, ఉపాధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, రోషన్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి సంతోశ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

శాంతి, సుస్థిరత, ప్రగతిశీల బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు

బ్యాంకాక్: శాంతి, సుస్థిరత, ప్రగతిశీల, సమ్మిళిత బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. రెండు దేశాల ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలను ఆకాంక్షించారు. థాయిలాండ్‌లో ప్రాదేశిక సదస్సు నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు యూనస్ సమావేశమయ్యారు. బంగ్లాదేశ్‌లో విద్యార్థి ఉద్యమం క్రమంలో హసీనా ప్రభుత్వం కుప్పకూలి... నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ పరిపాలన బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో మోదీ, యూనస్ తొలిసారిగా భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. బ్యాంకాక్‌లో బీమ్‌స్టెక్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్న వీరిద్దరు శుక్రవారం ద్వైపాక్షిక చర్చలు జరిపారు. దాదాపు 40 నిమిషాలు సమావేశమయ్యారు. షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం గురించి యూనస్ ప్రస్తావించారు. గంగా, తీస్తా నది జలాల సంధిపై చర్చించారు. అక్రమ చొరబాట్లు కట్టడి చేయాలని మోదీ ఆయనను కోరారు. సరిహద్దు వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందువుల పరిస్థితిపై మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. వారి భద్రతకు హామీ ఇవ్వాలని, దురాగతాల కేసుల్లో సమగ్ర దర్యాప్తు జరిపించాలన్నారు. బంగ్లాదేశ్, భారత్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో తమ రెండు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపర్చుకోవాలని ఇద్దరు నాయకులు నిర్ణయించారని న్యూఢిల్లీ విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ మీడియాకు తెలిపారు.







Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.